### ముఖచిత్రం

22.10.82 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రిక రాజ్యలక్ష్మి నవ్వుతున్న ముఖ చిత్రాన్ని చూసి మాకు కూడ నవ్వు వచ్చింది.

కె. భీమ్‌సేన్‌రావు (దామరిగిద్ద)

### నచ్చలేదు

8.10.82 తేది సంచిక ముఖ చిత్రంలో నటి విజయ శాంతి "కడవెత్తు కొచ్చింది కన్నె పిల్ల" అన్న భంగిమలో చూడ ముచ్చటగా ఉంది. ఈ సంచికలో 'కవన శర్మగారు' ఇంజనీరింగ్ కళాశాలల కోసం వ్రాసిన "సంచార పరిశోధనాలయం" కథ బాగానే వ్రాసారు కాని కథలో ఒక చోట "మరో కిలో మీటరు పోయేసరికి తాటిపాకవారి ఇంజనీరింగ్ కాలేజి అని వో తాటి మట్టమీద వ్రాసి ఉంది. ఈ తాటిమట్టని మరో రెండు తాటి మట్టలు మోస్తున్నాయి. మూటిని కలిపి స్వాగత ద్వారంలా ఏర్పరచారు" అని వ్రాసారు. ఈ వాక్యం మాత్రం నచ్చలేదు. ఎందుకంటే కళాశాలను మరీ అంత 'చులకన' చేస్తూ వ్రాసారు. విద్యా విధానాలు ఇలా ఎందుకు సాగుతున్నాయి అని ప్రశ్నించుకుంటే ఒకటే సమాధానం కనిపిస్తుంది. అదే "జనాభా", ప్రతి భారత పౌరుడు ఆలోచించవలసినది, అరికట్టవలసినది జనాభా పెరుగుదలను. ఆ తరువాత మాత్రమే మిగతా సమస్యలు.

ఎన్. విష్ణు మోహన్‌రెడ్డి (భిలాయి)

### పచ్చి నిజం

"పచ్చి నిజం" కథ నాకు బాగా నచ్చింది. గొప్పోళ్ల రంకు రహస్యంగానే ఉంటుందనే భావం యీ కథలో ముఖ్యాంశం. ఎన్నో తెలుగు సామెతలు సందర్భాన్ని బట్టి చోటు చేసుకున్నాయి.

మరువాడ సూర్యప్రకాశం (కాశీబుగ్గ)




### వేషధారణ బాగాలేదు

ఈవారం (15.10.82) పత్రికపై ముద్రించిన ముఖ చిత్రము ఏమీ ఆకర్షనీయంగా లేదు. నటి 'శ్రీదేవి' చాలా అందగత్తె అయినప్పటికి ఆమె వేషధారణ ఏమీ బాగులేదు. దయచేసి ఇకముందు ఇటువంటి 'ముఖ చిత్రములు' ప్రచురింపవద్దని నా మనవి.

ఎమ్. వి. నరసింహమూర్తి పట్నాయక్
(ఆమదాలవలస)

* * *

రాజ్యలక్ష్మి నవ్వు పాఠకులను చూచి నవ్వినట్లని పిస్తున్నది.

గల్లా రామమూర్తి, సరళ (హుబ్లి)

### పాకం కుదిరింది

"పాకం కుదిరింది" కథ చాల బాగున్నది. ఆ కథ రచయిత్రి గారికి మా హృదయ పూర్వక అభివందనములు.

1.10.82 ఆ వారం ప్రచురించిన 18 పేజీలో కార్టూన్ చాల బాగుంది. ఆంధ్ర సచిత్ర వారపత్రిక మేము ప్రతి వారం చదువుతు ఉంటాం. మరికొన్ని మంచి కథలు ప్రచురించమని కోరుతున్నాను.

షరీక్ అహమ్మద్, జుబెయిల్ (సౌదీఅరేబియా)

### ముక్కుతాడు — పసుపుతాడు

3.9.1982 సంచికలో నేను రాసిన "అంతే లేడా" అన్న "కవిత"పై శ్రీ ఆవుల రమణారెడ్డి వ్యాఖ్యను (15.10.82 సంచిక) చదివాక సమాధానం ఇవ్వవలసి వచ్చింది. నేను స్పష్టం చేయాలనుకొన్నది ఏమిటంటే—

"పసుపుతాడును ముక్కు తాడుగా పరిగణించే మానవ మాత్రుడు పశుతుల్యుడని, ఆ కారణంగా ఒక గేదెకు ముక్కుతాడు కడుతున్నట్లుగా ఏ విధమైన 'మానవాను భూతి' లేకుండా ఒక ఆడదానికి పసుపుతాడు కట్టగలడని!"

ఇందులో పసుపుతాడును కించపరచడమంటూ ఏమీ జరగలేదు. పశువుకు ముక్కుతాడు వేసి లొంగదీసుకొన్నట్లు మనిషి పసుపుతాడు కట్టి ఆడదాన్ని స్వంతం చేసుకొంటాడని ఆ నా రాతలో ఎక్కడా లేదు. అలా స్ఫురించే అవకాశం కూడ లేదు.

లేనిది ఉన్నట్లు వూహించుకొని, సంప్రదాయ గౌరవాన్ని నేనేదో మంటగలిపినట్లుగా భావించి— రెడ్డిగారు ఏదో తితిక్షతో, ఉత్తరాల శీర్షికలోనికి దూసుకొని వస్తే నేనేం చేసేది? తొందరపాటు మంచిది కాదని, విషయ విచక్షణ పూర్తిగా అలవడందే పెదవి విప్పకూడదని, అర్ధవంతమైన అవగాహన ముఖ్యమని, అన్నింటికంటే సాహితీపరమైన నిగ్రహం అవసరమని సలహా యివ్వనా? నాకెందుకో సంస్కారం అడ్డు వస్తోంది.

అయినా చొరవ తీసుకొని అభిప్రాయాన్ని వెల్లడించినందుకు, ఆయనలోని సాంప్రదాయిక పరమైన గౌరవ భావానికి హృదయ పూర్వకంగా చేతులు జోడిస్తున్నాను.

పసుపుతాడుకే విలువనిచ్చే సంప్రదాయం గొప్పదా? ప్రాణమున్న మనిషికి— ఆ మనిషిలోని మమతాను రాగానికి విలువ నిచ్చే సంప్రదాయం గొప్పదా?

డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు, (తిరుపతి)

### సవరణ

నా వ్యాసం 'మా విద్యార్థి లోకం ఆశయాలు'లో 37వ పేజీలోని 3వకాలమ్‌లో 'అరాచక అకృత్య నిర్మూలనము' లంచగొండితనము నిర్మూలనము, మొదలగు ఎన్నో ఆదర్శవంతములైన ఆశయములు గల్గిన విద్యార్థులు' అనుటకు బదులుగా 'అరాచక అకృత్య నిర్మూలనం, లంచగొండి తనము మొదలగు ఎన్నో ఆదర్శవంతములైన ఆశయములు గల్గిన విద్యార్థులు...' అని వ్రాసితిని. ఈ పొరపాటు ఫెయిర్ చేయుటలో దొర్లినది.

కావున పాఠకులు పై విధముగా సవరించి చదువుకోవలసినదిగా కోరుచున్నాను.

పర్వతనేని అన్నపూర్ణ
(మచిలీపట్నం)

**ఆంధ్ర సచిత్ర వారపత్రిక**

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభు ప్రసాద్

సంపాదకుడు

[1938 1972]

శుక్రవారం : 19–11–'82

దుందుభినామ సం. కార్తీక శు. చవితి

సంపుటము 75 సంచిక 12

సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

*

ఆరు మాసాల చందా రు. 42–90

విదేశాల్లో ఏడాది చందా రు. 85–80

విడి ప్రతి వెల రు 1–50


ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ–520 003


## విషయానుక్రమణిక



## * లోకం పోకడ — ఊమెన్ *



# ఈ దేశాన్ని నడుపుతున్నది ఎవరు?

ఏదో ఒక సందర్భంగా అప్పుడప్పుడు విదేశీ జర్నలిస్టులు, రచయితలు న్యూఢిల్లీలో దిగుతూ ఉంటారు. వాళ్లని అమితంగా వేధించే ఒకే ఒక ప్రశ్నకి సమాధానం కోసం ప్రయత్నించడానికే వాళ్ళు ఇక్కడికి వస్తూ ఉంటారు. ఈ దేశాన్ని ఎవరు నడుపుతున్నారన్నది ఆ ప్రశ్న!

అటువంటి విదేశీ జర్నలిస్టు ఒకతను ఈ మధ్య నన్ను కలుసుకున్నాడు. ఈ దేశాన్ని ఎవరు నడుపుతున్నారని ఎంతో వినయంగా అడిగాడు.

మాకు ఒక రాజ్యాంగం ఉంది. దాన్ని బట్టి మాకు ఒక ప్రధానమంత్రి, మంత్రి వర్గం ఒకటి ఉంటాయి. ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ, ఆమె మంత్రి వర్గం ఈ దేశాన్ని నడుపుతున్నారని నేను అనుకుంటున్నాను అని చెప్పి, ఆమెని కలుసుకో గలిగితే అతని ప్రశ్నలలో చాలా వాటికి జవాబులు దొరకవచ్చని నమ్మకంగా చెప్పాను.

అయితే అతను ఉన్నపాటున వెళ్లి ప్రధానమంత్రిని కలుసుకోగలడా? ఆయన 20 సంవత్సరాలకి పైగా అమెరికలో జర్నలిస్టుగా ఉంటున్నా, వైట్‌హౌస్‌కీ అతనికీ ఒక కిలోమీటరు దూరం ఎప్పుడూ ఉంటూనే ఉంది. అంతకన్నా దగ్గరగా వెళ్ల లేకపోయాడు. అటువంటి వాడికి నేను ప్రధానమంత్రితో ఇంటర్‌వ్యూ ఏర్పాటు చెయ్యగలనా?

సఫ్దర్ జంగ్ రోడ్డులోని ఒకటో నెంబరు ఇంట్లోకి ఒక భారతీయుడికి ప్రవేశం కల్పించడం కన్నా సూదిబెజ్జంలో ఒంటెని దూర్చడం తేలిక! అదే మాటని ఆయనతో చెప్పాను

వాస్తవంగా కూడా వెల్లింగ్‌టన్, న్యూజిలాండ్‌ల నించి వచ్చిన స్కూలు పిల్లలే అక్కడ ఎక్కువగా కన్పిస్తూంటారు తప్పితే తల నెరిసిన జాతీయ దినపత్రిక సంపాదకుడు ఎవరూ కన్పించరు.

మూడు రోజుల తర్వాత అతను మళ్లీ నన్ను కలుసుకున్నాడు. తాను ప్రధానమంత్రిని కలుసుకోలేక పోయానని, అయితే ఆమె కార్యాలయంలోని వారందరినీ కలుసుకున్నానని చెప్పాడు. కానీ ఈ దేశాన్ని ఎవరు నడుపుతున్నదీ మాత్రం తెలుసుకోలేక పోయానని అన్నాడు

ప్రధానమంత్రి కార్యాలయంలోని వారంతా ఏం చేస్తున్నారని నేనతన్ని అడిగాను.

వాళ్లెప్పుడూ ఫోన్‌లలో మాట్లాడుతూనే ఉన్నారని, డబ్బు వసూలు చేస్తున్నారని చెప్పాడతను. నాకు భలే మంచి వార్త దొరికింది! ఇష్టంలేని ప్రజలనించి డబ్బు వసూలు చెయ్యడానికి ఇన్‌కంటాక్స్ అధికారులు ఉన్నారు కదా అని అనుకున్నాను!

రాష్ట్రపతి దేశంలో లేరు కాబట్టి తాత్కాలిక రాష్ట్రపతి ఇప్పుడు ఈ దేశాన్ని

## న్యూఢిల్లీ లేఖ

డాక్టర్ జయ్ దుబాషి

నడుపుతున్నారేమో అనినాకనిపిస్తూందనీ, వెళి ఆయన్ని కలుసుకోమని నా మిత్రుడితో చెప్పాను. తనకి ఇదివరకే ఆ ఊహ వచ్చిందనీ, తాత్కాలిక రాష్ట్రపతిని కలుసుకోడానికి తాను ఆయన నివాసానికి వెళ్తే ఆయన పార్లమెంటులో ఉన్నారని చెప్పారట అక్కడి వారు పార్లమెంటుకి వెళ్లి కనుక్కుంటే పాకిస్తాన్ జియాని పాలం విమానాశ్రయంలో ఆహ్వానించి తీసుకురావడానికి హడావిడిగా వెళ్తున్నారని చెప్పారట. అప్పుడు అక్కడి వాళ్లందరూ జియాగురించే మాట్లాడుకోడం చూసిన నా మిత్రుడికి, ఒక్క క్షణకాలం, ఈ దేశాన్ని జియా నడుపుతున్నారేమో అని అన్పించిందట.

జియా కూడా ఈ దేశాన్ని తానే నడుపుతున్నా ననుకుంటాడని, ఎందుకంటే ఆయన తన దేశాన్ని తానెలాగూ నడపలేకుండా ఉన్నాడు కదా అని అన్నాను నేను.

మంత్రివర్గంలో రెండవస్థానంలో ఉన్న ప్రణబ్ ముఖర్జీని కలుసుకోమని నామిత్రుడికి చెప్పాను. ఎందుకంటే, తానే ఈ దేశాన్ని నడుపుతున్నట్లు క్రొత్తగా వచ్చిన యువకులైన విలేఖరులకి ఆయన భ్రమ కల్పిస్తుంటారు!

నార్త్ బ్లాక్‌లో ఉన్న ప్రణబ్ ముఖర్జీ కార్యాలయంలో ఆయన చుట్టూ చిరకాల మిత్రులైన అబ్దుల్ రహమాన్ అంతూలే, ప్రకాశ్ చంద్రసేఠీ, కమల్‌నాథ్, హాజీ మస్తాన్‌లా ఉన్న మరో వ్యక్తి కూడా ఉన్నారట. ఆయన ఆఫీసుగదిలో వాళ్ళందరూ ఏం చేస్తున్నదీ నా మిత్రుడికి అంతుపట్ట లేదట. చీట్లపేక ఆడుతున్నారులా ఉంది అన్నాడు.

పెద్ద స్టేక్స్‌తోనా? అన్నాను నేను

హెన్రీ ట్రూమన్ కూడా ఇలాగే స్నేహితులతో పోకర్ ఆడుతూ తన దేశాన్ని నడిపాడట. అయితే ట్రూమన్ అదృష్టవంతుడు. ప్రణబ్ లాగా ఆయన పైప్ కాల్చడు. పైప్ కాల్చడంతో పాటు మరొక పని చెయ్యడం ఎంత కష్టమో పైప్ కాల్చే వాళ్లకే తెలుస్తుంది మరి!

ఈ దేశ రాజధానిలో నా మిత్రుడు ఏమీ సాధించలేకపోయాడు. పోనీ, రాష్ట్రాలకి వెళ్లి ప్రయత్నించమని అతనికి చెప్పాను. మహారాష్ట్రకి వెళ్లి చూడమని అన్నాను.

అయిదురోజుల తర్వాత దిగాలు పడ్డ మొహంతో తిరిగి నా దగ్గరికి వచ్చాడు నా మిత్రుడు. బొంబాయివెళ్లి నేరుగా భోన్స్లేతో ఇంటర్‌వ్యూ కోసం ప్రయత్నం చేశాడట. కానీ యితను వెళ్లే సరికి ఆయన తన ఆఫీసు గదికి వెనక ఉన్న గదిలో గాఢ నిద్రలో ఉన్నారట.

'గాఢ నిద్రలో ఉన్నారా? ఈ దేశాన్ని నడపటం అన్నది అంత విసుగు పుట్టించే పనా? భోన్స్లే లాంటి ప్రముఖ వ్యక్తులకి కూడా నిద్ర పట్టేలా చెయ్యగలిగిందా?' అని ఆశ్చర్యంగా నా మిత్రుడ్ని అడిగాను.

భోన్స్లే ప్రతి ఉదయం న్యూఢిల్లీలోని ప్రధాన మంత్రి కార్యాలయం బయట, లోపల మాత్రం కాదు, గడిపి సాయంత్రానికి తన కార్యాలయం చేరుకునే వారట.

## న్యూ ఢిల్లీ లేఖ

అలాంటప్పుడు ఆయనెలా ప్రభుత్వాన్ని నడపగలరని అడిగాను.

నిస్సందేహంగా ఆయన నడపరు. దత్తా సామంత్, జార్జి ఫెర్నాండస్‌లు వంతులు వేసుకున్నారు. పగలు సామంత్, సాయంత్రం ఫెర్నాండస్ చూసుకుంటారు. ఈ మధ్యలో ఏదో ఒక యూనియన్ వాళ్ళు ఎప్పుడూ సమ్మెలోనే ఉంటుంటారు కదా. అందరి దృష్టి అటే కేంద్రీకృతమై ఉంటుంది.

బొంబాయి నుంచి నా మిత్రుడు బెంగుళూరు వెళ్ళాడు. అక్కడ గుండూరావు అజ్ఞాత వాసంలో ఉన్నారో లేక ఢిల్లీ వెళ్ళారో తెలియదు కానీ మొత్తానికి ఇతనికి మాత్రం దొరకలేదట.

అక్కడి నుంచి హైదరాబాదు వెళ్ళాడట. విమానాశ్రయం దగ్గరే, ఓ టాక్సీడ్రైవర్, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎవరో తనకి తెలియదని, గల్ఫ్ దేశాల నించి వచ్చే షేక్‌ల మాదిరిగా వాళ్ళు వస్తూ పోతూ ఉంటారని, తమాషాగా చెయ్యి తిప్పుతూ అన్నాడట. నిజాం భవనానికి తీసికెళ్ళాడట. నా మిత్రుడు, నిజాం ప్రస్తుతం లేరు కదా, అనడిగితే కాంగ్రెసు ముఖ్యమంత్రులు వస్తుంటారు పోతుంటారు కానీ నిజాం పేరు అలాగే చిరస్థాయిగా ఉంటుందన్నాడట ఆ టాక్సీ అతను.

బాగా అలిసిపోయి చివరికి నా మిత్రుడు ఢిల్లీ తిరిగి వచ్చాడు.

ఇంకొక్కచోట ప్రయత్నిస్తే వెతుకులాట పూర్తి కావచ్చని అతనితో అన్నాను.

అతను ఉత్సాహంగా 'రాజీవ్‌గాంధి కాదు కదా?' అన్నాడు.

'అవును రాజీవ్ గాంధీనే' అన్నాను ఆయన ఇంకా నేర్చుకోటంలోనే కాలం గడుపుతున్నాడు. అందుకోసం ఆయన తప్పుదార్లు వెతుక్కుంటున్నారు. రాజీవ్ ఇటీవలే వాషింగ్టన్, మాస్కోలు సందర్శించి వచ్చారు. భారతదేశం గురించి తెలుసుకోడానికి అవి సరైన ప్రదేశాలు కావు. ఇంతవరకూ ఆయన మీరట్‌గానీ, అమృత్‌సర్ గానీ వెళ్ళలేదు. ఇప్పుడసలు గొడవగా ఉన్నది అక్కడే కదా !

ఏది ఏమైనా రాజీవ్‌ని కలుసుకోమని నా మిత్రుడితో చెప్పాను.

రాజీవ్ తన రహస్య మందిరంలో విడియో గేమ్స్ ఆడుకుంటున్నారు. ఈ దేశాన్ని ఎవరు నడుపుతున్నారని నా మిత్రుడు ఆయన్ని అడిగాడు. 'ఇప్పుడేకాదు, ఈ సెట్‌లో నేను వెయ్యి పాయింట్లు తెచ్చుకోవాలి. అంతాకా ఏమీలేదు' అని "నేను 1000 పాయింట్లు తెచ్చుకోగానే ఈ దేశాన్ని నాకు అప్పచెబుతానని 'అమ్మ' అన్నది" అన్నారు రాజీవ్.

నా మిత్రుడు ఆయనతో పాటు ఇంకా అక్కడే కూర్చుని ఉన్నాడు. కానీ అతను చాలా కాలం వేచి ఉండాల్సి వచ్చేలా కనిస్తూంది. ఎందుకంటే ఇప్పుడే కదా రాజీవ్ 420ని చేరుకున్నారు !

★

# ఆదర్శమా! మేలుకో

## గుడిసేవ సుందరరామయ్య




'క్లైలాస్ కుంజ్' ముందుస్కూటర్ఆపాను. వెనుక కూర్చున్న అప్పల స్వామి చటుక్కున దిగి స్కూటర్ అందుకున్నాడు.

నేను మెల్లగా గేట్లోంచి లోపలికి నడిచాను. ఓ పెన్ ఎయిర్లో హాయిగా వుంటుందని భావించి బయట వేసిన కుర్చీలో కూర్చున్నాను.

స్కూటర్ను పార్క్ చేసి అప్పలస్వామి కూడా లోపలికి వచ్చాడు. "అలాకూర్చో!" అన్నాను అతనిచ్చిన కీ చైన్ అందుకొంటూ.

"ఫర్లేదులెండి!" అన్నాడు బిడియపడుతూ.

"డోంట్ ఫీల్ షై ! అలాకూర్చో !" అన్నాను ఎదురుగా వున్న కుర్చీని చూపిస్తూ.

"అలాగే సార్ !" అంటూ ఇబ్బంది పడుతూనే కూర్చున్నాడు. అప్పలస్వామి పాత కాలం మనిషి. అందుచేతనే తన ఆఫీసర్ ముందు కూర్చోటానికి జంకుతున్నాడు. అదే ఈ తరం కుర్రాడైతే ఆఫర్ చేయక ముందే కుర్చీలో కూలబడి వుండే వాడు. ఆ తరం వాళ్ళకున్న అభిమానం, ఓర్పు, కర్టసీ ఈతరం వాళ్ళలో కన్పించటంలేదు. కల్లా కపటం లేని తరం వాళ్ళది. ఎవరిని ఎలా గౌరవించాలో, ఎవరి పట్ల ఎలా ప్రవర్తించాలో వాళ్ళకు బాగా తెలుసు తోటి మనిషిని గౌరవించాలన్న విజ్ఞత నానాటికీ క్షీణిస్తూంది. నాల్గు డబ్బులు కళ్ళ చూడగానే ఎవ్వరినీ లెక్కచేయదు నేటి మనిషి. తెగింపు, సాహసం. ధైర్యం మనిషికి అవసరమే! అయితే ఎదుటి వ్యక్తిని చిన్న చూపుచూడకూడదన్న ఇంగిత జ్ఞానం కూడా అవ రమన్న విషయాన్ని మర్చిపోకూడదు. నేను ఈ తరానికి చెందిన వ్యక్తిని అయినప్పటికీ ఆ తరం వాళ్ల నియమాల పైన, పద్ధతుల పైన మక్కువ ఎక్కువ అందుకే అప్పల స్వామి నన్నుబాగా ఆకర్షించాడు.

"సార్ !" అంటూ బేరర్ మెనూకార్డు అందించాడు. అందులోని లిస్టును ఓ సారి పరిశీలించి "రెండు ఐస్క్రీమ్ పట్టుకురా !" అని ఆర్డరిచ్చాను. అప్పల స్వామి తలవంచు కొని మౌనంగా కూర్చున్నాడు.

ఎత్తైన విగ్రహం, గుబురు మీసాలు, జాలపాల జుట్టు, గుండ్రటి కళ్ళద్దాల జోడు—చూపరులకుఎంతో నిండుగాకన్పిస్తాడు అతను. ప్రమోషన్ మీద నేను ఈ వూరొచ్చి నెల రోజులు కూడా కాలేదు. కాని అప్పలస్వామి వ్యక్తిత్వం ఎలాంటిదో, అతని పద్ధతులు ఎలాంటివో అనుక్షణం గమనిస్తూనే వున్నాను. ఆఫీసులో అడుగు పెట్టినది మొదలు సాయంత్రం ఆరుగంటలవరకు ఏదో పని చేస్తూనే వుంటాడు. హెడ్ ప్యూన్ అన్న అహంకారం కాని, తనకు అప్పజెప్పిన పనులను మిగతా ప్యూన్లకు పురమాయించే పద్ధతులు కాని అతనికి తెలీదు. అతని సహజగుణాలైన సహనం, ఓర్పు అతని వ్యక్తిత్వానికి మరింత వన్నె తెచ్చాయి. అప్పలస్వామి పట్ల స్టాఫ్లో అందరికీ సదభిప్రాయం వుంది. ఈ వూళ్ళో అడుగు పెట్టగానే స్టేషన్లో స్వాగతం చెప్పిన వాళ్లలో అతను కూడా వున్నాడు. నేను చెప్పిన నాల్గు రోజులకే దొండపర్తిలో ఓ చక్కని ఇంటిని కూడా ఏర్పాటు చేశాడు అతడు. మనుషులంటే అతనికి అభిమానం ఎక్కువ. అందరి విషయం ఎలావున్నా నేనంటే అప్పలస్వామికి మరింత అభిమానం. అందుక్కారణం అతని స్వంత వూరు, మా మామగారి ఊరు ఒకటే కావటం...

ఐస్క్రీమ్ కప్పును టేబుల్ మీద వుంచాడు బేరర్.

"తీసుకో అప్పలస్వామీ !" అంటూ ఓ కప్పను అతని ముందు వుంచాను.

"ఇప్పుడెందుకు సార్ !" కృతజ్ఞతగా చూశాడు.

## ఆదర్శమా! వేలంకో!!

"ప్రొద్దున్నుంచి ఒకటే ఎండ. ఇది కాని కడుపులో పడితే చల్లగా వుంటుంది" అన్నాన

"ఇది తింటే కడుపులో చల్లగా వుంటుందేమోకాని గుండెల్లో వేడి తగ్గదు సార్! అన్నాడు.

అతని మాటలో దాగున్న బాధ గుర్తించాను. ప్రొద్దుట నుండీ అతను అదో మాదిరిగా వున్నాడు. కళ్లల్లో ఏదో దిగులు గూడు కట్టుకున్నట్లనిపించింది. ఈ కాలంలో కుటుంబ బాధలు ప్రతి ఒక్కరికి తప్పవు. కష్టాలు, కన్నీళ్లు మనుషులను ముఖ్యంగా మధ్యతరగతి వాళ్లను సదా నీడల్లా ఆశ్రయించే వుంటాయి. ఇది నెలాఖరు బహుశా ఏవైనా ఆర్థిక ఇబ్బందులున్నాయేమో?

ఆ ప్రదేశంలో అతని బాధలను ఏకరువు పెట్టమని అడగటం భావ్యం కాదని భావించి బేరర్‌కు బిల్లు చెల్లించి బయటకు నడిచాను.

"కాస్సేపు అలా డైమండ్ పార్కులో కూర్చుని వెళ్దాం! వస్తావా?" అని అడిగాను.

"అలాగే సార్!" అంటూ నేనిచ్చిన కీ చైన్ అందుకొని స్కూటర్ దగ్గరకు వెళ్లాడు. ఎదురుగా కన్పిస్తున్న పార్కు వైపు చూస్తూ అడుగులు వేశాను. నేను మెల్లగా ఇనుప గేటులోంచి లోపలికి నడిచాను. అప్పటికే పార్కంతా జనంతో నిండిపోయింది. సిమెంటు బెంచీలు ఎక్కడా ఖాళీలేవు.

మెల్లగా వెళ్లి పచ్చగడ్డి మీద కర్చీఫ్ వేసుకొని కూర్చున్నాను.

"హలో! అనూ! హవార్యూ?" అన్న మాటలు విన్పించగానే ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను.

ఓ పదహారేళ్ల పంజాబీ అమ్మాయి మరోటీనేజ్ గర్ల్‌ను పలకరిస్తూంది.

'అనూ' అన్న పదం విన్పించగానే నా మనసులో అన్నపూర్ణ రూపం తళుక్కుమంది. జేబులోంచి పర్సు తీశాను. ఫోటోలో అన్నపూర్ణ నవ్వుతూంది ...

అలికిడయితే బెదిరిపోయే కళ్లు, పట్టుకుంటే కందిపోయే చెక్కిళ్లు, అలల్లా అదిరిపడే అధరాలు, స్వచ్ఛమైన రత్నాల్లాంటి పళ్లు ...

'అనూ! నిన్ను చూస్తుంటే ఏమనిపిస్తుందో తెలుసా?'

'ఊఁ' సిగ్గు.

'జీవితాంతం ఇలానే నీ ముఖంలోకి చూస్తూ కాలం గడపాలనుంది'

'అలానా!' కిసుక్కున నవ్వు.

అది స్వరంకాదు! వేయి వీణలు ఆలపించిన రాగమాలిక అది నవ్వు కాదు! కోటి చంద్రులు కురిపించిన వెన్నెలసోన.

'అనూ! ఈ నవ్వులు, కలకాలం నీ పెదవుల మీద నాట్యం చేయాల సుమా!'

'మీ హృదయంలో నా కెప్పుడూ ఇలానే స్థానం వుండాలి మరి!' గువ్వలా ఛాతీమీద వాలిపోయింది

'ష్యూర్! ష్యూర్!' అంటూ హృదయానికి హత్తుకొన్నాను అనూను ఓ వెన్నెల రాత్రి

కాని.. నేను ఆమెకిచ్చిన మాట నిలబెట్టుకొన్నానా? లేదు...ఎందుచేత?

"తాళాలివిగోసార్!" అన్న అప్పలస్వామి పలుకులు వినగానే నేను కంగారుపడుతూ పర్సు మూసేసి జేబులో పెట్టుకొన్నాను.

"అలా కూర్చో!" అన్నాను.

నాకు కొంచెం దూరంగా అప్పలస్వామి చతికిలపడ్డాడు. దూరంగా కనిపిస్తున్న డాబాల వైపు చూస్తూండి పోయాడు.

"చూడు అప్పలస్వామీ! నీ ముఖం చూస్తుంటే మనసులో ఏదో దిగులు పెట్టుకొని బాధ పడుతున్నట్టుంది, కారణం నేను తెల్సుకోవచ్చా?"

"మా అమ్మాయి గుర్తొచ్చింది సార్!" అన్నాడు.

"అలాగా!"

"ఒక్కగానొక్క కూతురు సార్! మంచి సంబంధం తెచ్చి పెళ్ళి చేశాననుకొన్నానేకాని దాని జీవితం యిలా తెల్లారుతుందనుకోలేదండి!"

"అసలేం జరిగింది?" ఆత్రంగా అడిగాను.

"కుర్రాడు ఫేక్టరీలో మెకానిక్కుగా చేస్తున్నాడని, బుద్ధిమంతుడని తృప్తిపడి పిల్లనిచ్చాంసార్! కాని అతని తల్లి వట్టి డబ్బు మనిషి గయ్యాళిగంప. మా అమ్మాయి మనసు అసలే మెత్తన. ఏ మాత్రం కష్టం వొచ్చినా తట్టుకోలేదు నా తల్లి. అలాంటి అమాయకురాలిని పెళ్ళయిన రెండు నెలలకే పుట్టింటికి పంపించేశారు సార్! చుట్టుపక్కలోళ్ళంతా మొగుడొదిలేశాడని చెప్పుకొంటుంటే దాని మనసు ఎంత బాధపడిందో ఆలోచించుకోండి. ఓసారి బావిలోదూకి ఆత్మహత్య చేసుకోబోయింది. సమయానికి మా తమ్ముడు చూసి కాపాడాడు"

అప్పలస్వామి కంఠం గద్గదమైంది. అతని పరిస్థితికి నా హృదయం జాలితో నిండిపోయింది.

"ఇంతకూ అమ్మాయిని వాళ్ళు పుట్టింటికి ఎందుకు పంపించారు? కట్నం డబ్బు యివ్వలేదా?"

"ఆ విషయంలో ఏమీ లోపం చేయలేదండి సమయానికి డబ్బు తక్కువైతే పరంధామయ్య మేస్టారే సాయం చేశారు. మీ రాయన పేరు విన్నారా సార్?"

"ఎవరాయన?"

"అన్నపూర్ణమ్మగారి తాతగారండి!"

"అయితే అన్నపూర్ణ నీకు తెలుసా?"

"చిన్నప్పుడు ఆవిడగారిని నా భుజమ్మీద ఎత్తుకొని ఆడించేవాణ్ణి సార్! పరంధామయ్య మేస్టారు ఇంట్లో నేనెంతో చనువుగా తిరిగే వాణ్ణండి నా గాధ విని ఆయనే పెళ్ళికి డబ్బుసాయం చేశారు.."

"అలాగా! అన్నీ అనుకొన్న ప్రకారం జరిగినప్పుడు తగాదా ఎందుకు?"

"అబ్బాయికి టేపురికార్డరుయివ్వలేదని.." గతుక్కుమన్నాను

కొరడాతో ఎవరో వీపు మీద చెళ్ళున చరిచినట్లయింది.

"మనుషులు ఎదిగినా మనసులు ఎదగటం లేదుసార్ ఈ కలియుగంలో. మా అమ్మాయి జీవితానికి టేపురికార్డరు ముడిపెట్టారు ఆ దౌర్భాగ్యులు..." అప్పలస్వామి కంఠంలో క్రోధం ధ్వనించింది.

"అప్పలస్వామీ! డబ్బునేనిస్తాను, టేపురికార్డరుతో మీ అమ్మాయిని అత్తవారింటికి పంపించు!" అన్నాను.

"ఆ మాత్రం మంచితనం, ఆలోచన మా అల్లుడికుంటే మా అమ్మాయి నాకు దక్కి ఉండేది సార్!"

అతని కళ్ళల్లో అస్పష్టంగా నీటి పొరలు కదలాడాయి.

"ఇప్పుడు మీ అమ్మాయి ఎక్కడుంది?" నా ప్రశ్నకు సమాధానంగా చేతులెత్తి ఆకాశం వైపు చూపించాడు.


"ఓ మైగాడ్... చనిపోయిందా? ఎలా జరిగింది ఈ ఘోరం?" నాకంఠం వణికింది.

"మీ లాంటి ధర్మాత్ముల దగ్గర అప్పుచేసి టేపురికార్డరుతో అమ్మాయిని కాపురానికి పంపించాను సార్. కాని ఆ రాక్షసులు అంతటితో తృప్తిపడలేదు. వాచీలని, మంచాలని, కంచాలని... ఇలా తీర్చాల్సిన లాంఛనాలు ఏవీ తీసుకు రాలేదని అత్త సాధింపు మొదలు పెట్టింది. వాళ్ళు పెట్టే చిత్రహింస సహించలేక కిరసనాయిలు పోసుకొని చచ్చిపోయింది సార్!"

"ఛీ! ఛీ! పాడు మనుషులు! ప్రాణం వున్న మనిషికంటే ప్రాణంలేని వస్తువులకే విలువిస్తున్నారా?" ఆవేశంగా అరిచాను.

బయట టాంకర్ హారన్ చెవులు చిల్లులు పడేలా విన్పించటంతో అప్పలస్వామితోపాటు నేను కూడా రోడ్డుమీదికి చూశాను.

"ఆ తాళాలీయండి సార్! లారీ వోడికి




## ఆదర్శమా! మేలుకో!!

రోడ్డుమీద మన స్కూటరు అడ్డంగా వున్నట్టుంది హారను తెగమోగిస్తున్నాడు!'' అనేసి కీ చైన్ తీసుకొని బయటకు వెళ్ళాడు నా మనసులో రావ్ గారు మెదిలారు.

సంసార నౌకను లాగిలాగి చిక్కి శల్యమైన ఆయన రూపం గుర్తుకు వచ్చింది. వే ఇన్స్పెక్టర్‌గా చేస్తుండగానే ఇద్దరు కూతుళ్ళకు పెళ్ళిచేశారు. అన్నపూర్ణ మూడోకూతురాయనకు. తర్వాత ముగ్గురు కొడుకులు. అన్నపూర్ణ పెళ్ళికి ఆయన ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే వుంది రిటైర్ మెంట్ బెనిఫిట్స్‌లో వచ్చిన సొమ్ములో చాలా భాగం ఆయన భార్యకు రాయవెల్లూరులో వైద్యం చేయించటానికే ఖర్చయింది. అలాంటి పరిస్థితుల్లోకూడా నలభైవేలు కట్నం, వెయ్యినూటపదహార్లు ఆడపడుచు కట్నం, లాంఛనాలు వగైరా యివ్వటానికి సిద్ధపడ్డారు. అయితే అన్నపూర్ణ పెళ్ళికోసం అమ్మిన పొలం డబ్బు సక్రమంగా చేరక పోవడంతో కట్నం తాలూకు డబ్బులో పెళ్ళినాటికి పదివేలు బాకీ పడ్డారు. పెళ్ళి ఎంతో ఘనంగా జరిపించారు. అయినా నాన్న మనసు తృప్తి పడలేదు. పెళ్ళయ్యాక వచ్చే మొదటి పండక్కి స్కూటర్ కొని పెడ్తానని ఆయన ఒప్పుకొన్నారట. అదేసమయంలో పెద్దకొడుక్కి ఇంజనీరింగ్ సీటుకోసం డొనేషన్ కట్టాల్సి వచ్చింది. ఆర్థిక ఇబ్బందులచేత రావ్ గారు వాగ్దానాలు నిలబెట్టుకోలేకపోయారు ...... అంతే .. ఫలితంగా .. అనూ అక్కడ . నేను ఇక్కడ...

కట్నం తాలూకు పదివేలు లేకపోయినంత మాత్రాన నాకేమీ దరిద్రం చుట్టుకోదు!

పండక్కియిస్తానన్న స్కూటర్ నాకు యివ్వనంత మాత్రాన నాకు వచ్చిన నష్టమేమీ లేదు! నాన్న పాత స్కూటర్‌ను ఎలానూ వాడుకుంటున్నాను కదా! నాన్న అపట్టుదల వలన, ఆయనకు ఎదురుచెప్పలేని నా పిరికితనం వలన అనూను దూరం చేసుకున్నాను. నాన్న కేవలం డబ్బు మనిషి. వడ్డీవ్యాపారం చేసి ఆస్తి పెంచాడు నాన్న. అందుచేతనే కాబోలు డబ్బంటే ఆయనకు అంత ప్రాణం. సభ్యత సంస్కారాల కంటె ఆయన డబ్బుకే ఎక్కువ విలువనిస్తారు. అమ్మకూడా ఆయనకు ఎదురు చెప్పలేక మౌనంగా ఉండిపోయింది.



## ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

# శ్రీరామ, కృష్ణావతారాలు

భగవంతుడు పెక్కురూపాలలో అవతరిస్తూ ఉంటాడని మనవారి దృఢవిశ్వాసం. ఆ అవతారాలలో పదిమాత్రం మిక్కిలి ప్రచారంలో ఉన్నవి— ఇవి- మత్స్య- కూర్మ- వరాహ- నారసింహ- వామన- పరశురామ- శ్రీరామ- కృష్ణ- కలికి అవతారాలు వీటిలో శ్రీరామావతారం, కృష్ణావతారం మిగిలిన వాటికంటే ఎక్కువ ప్రాముఖ్యాన్ని పొందినవి. శ్రీరాముడు, కృష్ణుడు అందరికీ ఆరాధ్యదేవతలు. వారి పూజలు దేశవ్యాప్తంగా జరుగుతున్నవి. వారి దేవాలయాలు భారతదేశంలోనే కాకుండా ఇతరత్రా కూడా ఉన్నవి తక్కిన అవతారాలకంటే ఈ రెండు అవతారాల వైశిష్ట్యం ఏమిటో మనం కొంచెం ఆలోచిస్తే తెలుస్తుంది.

తాను సృజించిన సర్వప్రాణులూ సుఖంగా జీవించాలనేదే భగవంతుని సంకల్పం. క్రూరమృగాలకు అరణ్యాలూ, మానవులు, సాధువులగు జంతువులకూ, పశులకు గ్రామాదులు నివాసమూ కల్పించబడింది. "నా విష్ణుః పృథివీపతిః" అని భగవంతుడే రాజుగా అయి ప్రజాపాలన చేస్తూ ఉంటాడు. అందువల్ల దైవాంశగల రాజును ప్రజలు భక్తితో సేవిస్తూ ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తూ ఉండాలి. అట్టి అవతారాలు రామావతారమూ కృష్ణావతారం మాత్రమే!

రాజు ప్రజలకు ఆదర్శపురుషుడుగా ఉండుటవలన ఆయన ఏమి చెప్పినను, అది ప్రజాహితమే అనునది గ్రహించి, అతని యందలి ఉత్తమ గుణములననుసరించుకొనుటకు ప్రజలు యత్నింతురు. అది వారి ధర్మము. అట్టి ఆదర్శ అవతారమూర్తులు రామ, కృష్ణులు మాత్రమే! రాముని నడువరించి ధర్మాభిరతి, పితృభక్తి గ్రహించదగినవి. శ్రీకృష్ణుని బాల్య చేష్టలాతని మహాత్మ్యమునకు దృష్టాంతము. అతని గీతోపదేశము ఆధ్యాత్మిక విషయములయెడ అత్యంతాసక్తికి ప్రతీక. ఇట్టి సదుపదేశములకు కారణరూపులగుట చేతనే, శ్రీరామునికిని, కృష్ణునికిని అవతారమూర్తులలో ప్రాముఖ్యం వచ్చినది. ఇతర దేవతలకంటే వారే ఎక్కువ ఆరాధ్య దైవములైనారు.

---

నిజానికి అప్పలస్వామి, నాన్న ఒకే తరానికి ప్రతినిధులు. అయినా ఇద్దరి ఆలోచనల్లో ఎంతో అంతరం వుంది ఇద్దరి పద్ధతులకు ఎంతో తేడావుంది. అప్పలస్వామి పరిస్థితి రావ్ గారి పరిస్థితి ఒక్కటే. ఇద్దరూ ఆడపిల్లల తండ్రులే!

లాంఛనాల పేరిట నాశనమైంది ఆ అమ్మాయి జీవితం - స్కూటర్ పేరిట నాశనం కాబోతుంది అనూ జీవితం - అనూ మనసు కూడా చాలా సున్నితం. ఈ అవమానాన్ని భరించలేక ఆత్మ...

నో...నో...అలా జరగటానికి వీల్లేదు

నా అనూకు దూరమై నేను బ్రతకలేను

ఇంతకాలం నాన్న మీదున్న గౌరవం నన్ను కట్టిపడేసింది. డబ్బుకంటె మమతానుబంధాలు గొప్పవని ఆయనకు తెలియపర్చాలి. మూర్ఖత్వంతో ఆలోచిస్తున్న ఆయన మనసుకు జ్ఞానోదయం కలిగించాలి

అనూకు న్యాయం చేకూర్చాలి.

తక్కున లేచి నిలబడ్డాను.

"వెళ్లిపోదామా సార్?" అని అడిగాడు అప్పలస్వామి ఎదురు వస్తూ.

"చూడు అప్పలస్వామీ! విజయనగరం వెళ్లే బస్సు ఇప్పుడేదైనా వుందా?" అని అడిగాను

'వాచీ చూసుకొని "అరగంటలో నాన్‌స్టాప్ వుంది సార్!" అన్నాడు.

"అయితే నేను ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్తున్నాను, నీవు స్కూటరును నడిపించుకు వెళ్లి మా వరండాలో పెట్టు!" అంటూ ఇనుపగేటు గుండా బయటకు వచ్చాను.

నాల్గడుగులు వేసి అప్రయత్నంగా వెనక్కితిరిగి చూశాను అప్పలస్వామి స్కూటర్ దగ్గరకు వెళ్లి ఆకాశం వైపు చూస్తూ చేతులు జోడించి దణ్ణం పెట్టాడు. అతని ముఖంలో ఏదో సంతృప్తి లైట్లు వెలుగులో తళుక్కుమంది

ఆ క్షణంలో అతను మనసులో ఏమనుకొన్నాడో?

అన్నపూర్ణను కాపురానికి తీసుకువచ్చాక ఓ రోజున అప్పలస్వామిని కూడా భోజనానికి పిల్చాను.

కడుపునిండా భోంచేశాక అడిగాను 'ఆ రోజు నీవు మనసులో అనుకొన్నదేమిటని?

"వానరులు గుర్తుచేసేవరకు ఆంజనేయుల వారికి తమ శక్తి తెలియలేదట. శక్తి తెల్సాక ఎక్కడలేని బలాన్ని తెచ్చుకొని వారధి కట్టేశారు. మనుషుల మనసులలో కూడా మంచితనం వుంటుంది. కబుర్లు చెప్పో, కథలు చెప్పో దాన్ని నిద లేపాలని మా గురువుగారు . అదేనండి ... అమ్మాయి గారి తాతగారు చెప్తుండే వారు ... వారిని మనసులో తల్చుకొని దణ్ణం పెట్టుకొన్నాను.. "అన్నాడు అప్పలస్వామి నవ్వుతూ.

అతను వెళ్లాక చెప్పింది అన్నపూర్ణ మరోనిజం!

అప్పలస్వామికి అసలు పెళ్లే కాలేదట! ★

# శోభాక్షుని డైరీ

## టాక్సీలో హత్య !

శంకగిరి అనే వూరుకు చెందిన నెపోలియన్ అనే వోహతను మొన్న 17వ తేదీ ఒక టాక్సీని బాడుగకు బేరం ఆడుకుని అత్తూరు పక్కనున్న వో గ్రామానికి పొమ్మన్నాడట. అక్కడికి వెళ్ళాక అసలు రోడ్డు వదలి అడ్డరోడ్ల మీదికి కారు మళ్ళించమనడంతో టాక్సీ డ్రయివరు "శక్తి"కి కోపం వచ్చి అటంతా కుదరదు పొమ్మన్నాడట. దాంతో యిద్దరూ శక్తివంచన లేకుండా పోట్లాడుకున్నారట. దాంలో నెపోలియనుకు తన పేరుకు తీసిపోని కోపం వచ్చి కత్తితో అతని వెన్నులో పొడిచి, అంతతో ఆగక వోపికగా అతని కంటం మీడి కోసి చంపేశాడట. ఈ కాండ వల్ల కారు విరు విరు లాడడం చూసిన ఆ చుట్టుప్రక్కల వాళ్ళిదేమి సర్కస్సో అని పరుగున వచ్చేసరికి నెపోలియను వారిని బెదిరించి పరుగు లంకించుకున్నాడట. సంఘీబావమే బలమని తలచిన చూపరులంతా వొకటిగా చేరి అతన్ని వెంబడించి పట్టుకుని చితకబాది పోలీసులకు వప్పగించారట. ఇంతకూ ఆ నెపోలియను ఈ చంపాడి అనే వో గ్రామానికి చెందిన లక్షాధికారి కూతుర్ని ఎత్తుకుపోయే ప్లానులో వో టాక్సీని కుదుర్చుకుని, పథకం తలక్రిందులయ్యేసరికి, తిక్కరేగేలా చేశాట్ట.

## పట్టుబడ్డ ఫారెస్టు రేంజర్!

తమిళనాడు దిండిగల్లుకు చెందిన నాగర్‌నగర్ నివాసి షణ్ముగం అతనికీ, నరసింహం అనే అతనికీ పొలం వ్యవహారాలలో వున్న తగాదాలు తీరక అవి పగలుగా రగిలాయట. నరసింహం తన సోదరుడు అప్పాయితోను మరో పదిమందితోనూ కలసి షణ్ముగం వూళ్ళో లేనపుడు ఆతనింటో జొరపడి, అతని భార్య సత్యాదేవిని పట్టుకుని బలాత్కరించి మానభంగం చేయబోయే సమయానికి దైవికంగా పోలీసులు వచ్చేసరికి అంతా పారిపోయారట. నరసింహం అతని తమ్ముడూ పట్టుబడ్డారట. నరసింహం నార్త్ ఆర్కాటలో ఫారెస్టు రేంజరుట కూడాను.

## దొంగసొత్తులో అమ్మవారికి వాటా !

మద్రాసులో 25 ఏళ్ళ వెంకటేశన్ అనే యువకుడు మాంగాడులోని అమ్మవారికి మొక్కుకుని జై బజరంగబలీ అని తన హస్తలాఘవం కొద్దీ కార్తవీర్యునిలా చెక్కుకుపోతూ ఆ దొంగతనాలలో వచ్చిన సొమ్ములో కచ్చితంగా సగభాగం ఆ అమ్మవారికి కానుకగా చెల్లిస్తూ వచ్చాడట: రోజులనీ ఒకేలా వుండనందు వల్ల వోరోజు అమ్మవారి వాటా చెలిస్తూ పట్టుబడ్డాడట. అతని వద్ద ఇరవై య్యయిదు వేల కిమ్మత్తు చేసే 'ఇంటి వస్తువులు దొరికాయట—మరి అమ్మవారి వద్ద ఇంత సరుకూ వుండుండాలి కదా!

## విరక్తితో ఆత్మహత్య !

సేలంలో 41 ఏళ్ళ సుభాష్ చంద్రన్ అనే వో వ్యక్తి సూర్యోదయం త్రాగుడారంభించి, నిద్రపోయే వరకూ అదేవ్యాపకంతో కాలాన్ని గడపుతూ, భార్య ఎన్ని విధాల చెప్పినా విననందు వల్ల ఆతని భార్య 33 ఏళ్ళ తన మణికి జీవితం మీద అసహ్యం పుట్టి నల్లుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నదట. అదే వూరిలో ఏరా అబ్బిసామీ, పనికివెళ్ళక సోంబేరిలా ఇంట్లోనే కూర్చున్నావు అని తన కొడుకు 18 ఏళ్ళ మోహన్ అనే వ్యక్తిని అతని తల్లి రాజమ్మ చీవాట్లు వేసేసరికి పనికి వెళ్ళాలా సరి, వెళ్తా చూడు అని చెప్పి రయమున పెరట్లోకి వెళ్ళి, ఎగిరి నూతిలో దూకేశాడట. సహాయం దొరకడమాలస్య మయినందు వల్ల చనిపోయాడట.


## పితృ వాక్యపాలన !

న్యూజిలాండ్‌లో వో 22 ఏళ్ళ ఎలిజా టికిరా అనే వివాహితకు ఆమె తండ్రి కలలో కనుపించి "బిడ్డా, నువ్వు నీ యిద్దరి పిల్లలను, భర్తనూ చంపుము ఇది నా ఆజ్ఞ, నా కోరిక" అని చెప్పాడని అంత పనీ చేసి కోర్టు పాలయ్యిందట. తన పది నెలల కొడుకు పురుషాంగాన్ని కోసేసి ఆపిల్లాడిని, అదేవిధంగా మూడేళ్ళ అమ్మాయినీ చేసి చంపిందట. ఇది ఆమె తన భర్త చేత చేయించి, ఆనక అదే కత్తితో అతని చేత్తోనే అతని పీక కోసుకుని చనిపోయేందుకు సహాయం చేసి, నిర్విఘ్నంగా ఆ ముగ్గుర్నీ పాట్టన పెట్టుకుందట.

## హత్యా – ఆత్మహత్యా ?

తెల్లారితే తన వివాహ మహోత్సవమే వుత్సవంగా వున్న 23 ఏళ్ళ నీలా అనే డాక్టరు ఆమె సొంత వూరు కోయంబత్తూరులోని తన యింటి నూతిలో చచ్చిపడి వున్నదట. ఆమె ఆత్మహత్య చేసుకునే అవసరం, అసంతృప్తి ఏవీ లేవని, కనుక యిదొహ వేళ హత్యయ్యుండవచ్చుననీ పోలీసు అనుమానిస్తున్నారట.

# నూతన వివాహితులకు పాతకాలపు ఆయిల్-బౌండ్ డిస్టెంపరా?



## బ్రిటిష్ పెయింట్స్ వైనల్ తెచ్చుకోండి మీ ఇంటి గోడల చేత ఆశీర్వాదాలు పలికించండి

కుటుంబంలో ఒక కొత్త
పెళ్లికూతురు, నూతన
సంవత్సరం, ఒక నూతన గృహములో—
మీరు క్రొత్తవిగా జరిపించనున్న తరుణంలో పాత సొగసులో వున్న
ఆయిల్ బౌండ్ డిస్టెంపర్ మీకు యిక అవసరం లేదు అనుకుంటారు కదా!
మీ గోడలకు వైనల్‌తో అందాన్ని యివ్వండి—ఆకర్షణీయమైన
అందాలతో తొణికిసలాడే వాటిని చూసి ఆనందించండి!
వైనల్ మీ గోడలకు మన్నటి ఫినిష్ ఇస్తుంది, ఖరీదైనవిగా
కన్పించేలా చేస్తుంది—మును పెన్నడూ లేనంతగా!
వైనల్ వల్ల మరెన్నో ప్రత్యక్ష ప్రయోజనాలు కూడా—
ఏ ఆయిల్-బౌండ్ డిస్టెంపరూ పోటీ పడలేనివి!
ఇవన్నీ అదనపు ఖర్చేమీ లేకుండానే




వైనల్‌ని ఏ ఆయిల్-బౌండ్ డిస్టెంపర్‌తోనైనా పోల్చి చూడండి.
ప్రతి విషయంలోనూ అతి శ్రేష్ఠమైనది వైనల్.

| | వైనల్ | ఆయిల్ బౌండ్ డిస్టెంపర్ |
|---|---|---|
| ఫినిష్ | చక్కటిది మన్నటిది | బాగుండదు |
| ఆరడానికి పట్టే సమయం | 4 గంటలు | 12 గంటలు |
| వాసన | ఇంపైనది | భరించలేనిది |
| కడుక్కొనేందుకు | ఎంతో వీలైనది | వీలుగా వుండదు |
| రంగు నిలిచి వుండటం | దివ్యం | వెలవాతేరు |
| మన్నిక | ఎక్కువ | తక్కువ |
| వెయ్యడం | —తేడా లేదు— | |

అన్నిటికీ మించిన విషయం, 5 కిలోల ఆయిల్ బౌండ్ డిస్టెంపర్ కావలసివచ్చే విస్తీర్ణానికి, కేవలం 2 లీటర్ల వైనల్ చాలు!

## బ్రిటిష్ పెయింట్స్ వైనల్

ఆనందప్రదమైన తరుణంలో విశిష్టమైన పెయింట్

LINTAS(C)/VNL/68/2317 TL

(గత సంచిక తరువాయి)

శివుని మూడో నేత్రమైన సూర్యుడు ఆ మధ్యాహ్నం వేళ మండిపోతున్నాడు. కొత్తగా కళాయిపూత పూసినట్లు ఆకాశం మెరిసిపోతోంది. కళ్లెత్తి చూడటానికి భయపడుతున్న ఆ ఎండలో సినిమాకు వచ్చారు, సాహిత్య బృందం. మగవాళ్ల క్యూ ఎక్కువుంది. అందుకు సాహిత్య ఆడవాళ్ల క్యూలోకి వచ్చి నిల్చుంది. ఒక తలకి రెండు టిక్కెట్లు మాత్రం ఇస్తారు. అందుకని కమల సాహిత్య వెనుక నిలుచుంది. అంతలో ఒకతను—

"సిస్టర్! నాకొక టికెట్టు తీసుకోండి—" అని కమలను బ్రతిమాలుతున్నాడు.

కమల వినన్లే మరోవైపు చూస్తూంది. "టికెట్టు కొరకయినా ఒక గర్ల్ ఫ్రెండ్‌ను తెచ్చుకోవాలి భాయ్" అంటూ అతనిదగ్గర డబ్బులు తీసుకుంది సాహిత్య.

ఎండకు జేవురించిన ముఖం ముద్దమందారంలా ముద్దొస్తూంది. హాలులోంచి అద్దాల తలుపుల్లోంచి చూస్తున్నాడు గోపి. 'ఈ అందమైన పిల్ల ఎవ్వరి సొంతం అవుతుందో' అనుకున్నాడు.

క్రింద తరగతుల బుక్కింగ్ దగ్గిర గొడవ గొడవగా వుంది. అది ఇంగ్లీష్ పిక్చర్. ఫయిటింగ్ పిక్చర్ కాదు. స్టోరీ పిక్చర్. ఎక్కువ సంభాషణ వుంటుంది. సరిగ్గా ఫాలో కాలేకపోతే అర్థం కాదు. అయినా రష్‌గా వుంది. మన వాళ్లకి ఇంగ్లీష్ మీద, ఇంగ్లీష్ పిక్చర్స్‌మీద ఎంత మోజు వుందో అర్థమవుతుంది.

గబగబా హాలులోకి వెళ్లి అలుపు తీర్చుకుంటున్నట్లు కూర్చున్నారు. ఎ. సి. అప్పుడప్పుడే చల్లదనాన్ని పుంజుకుంటూ వుంది.

"హెరాల్డ్ రాబిన్స్ నవల కదూ! నీవు చదివావా ?" అని సాహిత్య కమలని ప్రశ్నించింది.

"హెరాల్డ్ రాబిన్స్ నవలలు పెద్దలకి మాత్రమే నని, అవి చదివితే వంటికి మంచిది కాదని మా బావ చెప్పాడు .."

సాహిత్య కమల మాటలకు పకపక నవ్వింది.


" 'పెళ్లి అయితేకాని అర్థంకావు—చదవొద్దు' అని సంగీత — మా అక్క చెప్పింది. అర్థంకాకపోతే రెండోసారి చదువుతాను అని చెప్పాను. 'పేజీ పేజీకి సెక్స్ వుంటుంది — నీవు చదువుతుంటే నాకు సిగ్గుగా వుంటుంది. మీ బావ చూసేలా చదవకు బాబూ' అని మొత్తుకుంటుంది" అంది.

"మన సినిమాలలో ఒక రేప్ సీను—జయమాలిని డాన్స్—చివర్లో ఫైటింగ్ వుంటేగాని అవి నడవవు— అని అనుకున్నట్లు — పచ్చి పచ్చిగా సెక్స్ గుప్పిస్తేనే ఆ నవలలు హాట్ కేక్స్‌లా పోతాయని వాళ్ల నమ్మకం"

"ఏమో బాబు — వాళ్ల సాంప్రదాయాలు సెక్స్‌కి అడ్డులేకపోవటం — పెళ్లి కాకుండానే ఫ్రీగా ఒక ఇంట్లో కాపురం పెట్టేయడం — అన్నీ వాళ్లకే చెల్లు. అలా మనదేశంలో జరగడానికి మరో యుగం పట్టవచ్చు."

"యుగం అవసరం లేదు. వంద సంవత్సరాలు పట్టవచ్చు" అని సాహిత్య అంది.






అంతలో సినిమా ప్రారంభమైంది. సాహిత్యకు ఏదో జ్ఞాపకం వచ్చి తనలో తాను నవ్వుకుంటూ —

"మనం ఇప్పుడు మద్రాసులోనో, విజయవాడలోనో వుండవలసింది. పని ఎగగొట్టి — రోజూ రెండు సినిమాలు చూస్తున్నాం. రవిచంద్రకు బాగా మస్కాకొట్టాం ... " సాహిత్య నవ్వులో కమల నవ్వు కలిపింది.

సినిమాలో వృద్ధుడైన మామగార్ని మొదటి రోజే ప్రేమిస్తుంది కోడలు. భర్తకంటే మామగారు మోడీగా వున్నాడట. ఇష్టంగ, తనే వెళ్లి మామగారి ప్రక్కన పడుకుంటుంది. మరో టీనేజ్ పిల్ల నగ్నంగ — కొలనులో ఈత కొట్టుతుంది. ఇలాటి సన్నివేశాలు ఎన్నోవున్న ప్రేక్షకులు నిశ్శబ్దంగ సినిమాలో లీనమైపోయారు. అదే మన సినిమాలలో చూపిస్తే తెర చించేస్తారు. జయమాలిని జర్కుల డాన్స్ వద్దని గొడవ చేసినవారు — అంత పని చేస్తారు. కాని అవి పొరుగువారి సినిమాలు కనుక ఆనందంగా చూస్తున్నారు. సినిమా బోరుగానే వుంది. కాని ఆ మాట పైకి అనటానికి అభ్యంతరం లారెన్స్ ఆలివర్ ఎంత బాగా యాక్ట్ చేశాడు అని చెప్పుకుంటున్నారు. మన తెలుగువారిలో మహా నటులు వున్నారు. మనవారికి సాటి ఎవ్వరూ లేరు అనిపిస్తుంది— అని అనుకుంటుండగా ఇంటర్‌వెల్ అయింది. సినిమా ప్రారంభమయ్యాక తడువు

**జరిగిన కథ — 3 :** రవిచంద్ర 'రచన' వార మాస పత్రికలో మేనేజింగ్ ఎడిటర్‌గా పనిచేస్తుంటాడు. అతను ప్రముఖ రచయిత కూడా. ఫారిన్‌లో ఎం. బి ఎ. చేసివచ్చినా అతనికున్న సాహిత్యాభిమానంతో ఈ పని చేస్తుంటాడు. అతను సాహిత్య ఇచ్చిన కవరులోని సారాంశం చదివి ఆశ్చర్యపోతాడు. తనకు పి.ఎ. గా చేరిన సాహిత్య టెంప్టేషన్ నుండి తప్పించుకొడానికి, రచయితలను ఇంటర్వ్యూ చేయడానికి ఆమెను పంపాలనుకుంటాడు రవిచంద్ర. కమలను తోడుగా తీసుకొని రచయితలు ఎక్కడ వుంటే అక్కడికి వెళ్లి ఇంటర్వ్యూ చేసి రమ్మంటాడు సాహిత్యను రవిచంద్ర. వీళ్లిద్దరికీ తోడుగా గోపీ కూడా వెళ్తాడు. అనుకోకుండా కలిసిన చిట్టారెడ్డిని ఇంటర్వ్యూ చేసి తమకు కావల్సిన సమాచారం రాబట్టుకొంటారు.

కుంటూ వచ్చి కూర్చున్న గోపివైపు యధాలాపంగా చిరునవ్వుతో చూసింది. అధరాలపై చిరునవ్వు ఉష్ అన్నట్లు మాయమైపోయింది. అక్కడ రవిచంద్రను చూచి "మీరా!" అన్నట్లు చూస్తుంటే,

'యస్' 'నేనే' అన్నట్లు చూశాడు రవిచంద్ర ముందు తేరుకున్న కమల నమస్కారం చేసింది సాహిత్య వైపు చూస్తూ రవిచంద్ర—

"రేపు ఆఫీసుకి రండి" అన్నాడు.

రవిచంద్ర బయటికి వెళ్లాడు.

కూల్‌డ్రింక్స్ అమ్మే పిల్లాడు వచ్చి వాళ్లకి చెరొకటి యిస్తూ "ఆయన ఇవ్వమన్నారు" అని చెప్పాడు.

"కమలా ; మన మాటలన్నీ విన్నాడా."

"మనం రహస్యంగా మాట్లాడుకోలేదు ఈ గోపి ఏడి కనిపించడే."

'ఏమో' అన్నట్లు సాహిత్య భుజాలు ఎగురవేసింది.

పిక్చర్ మొదలైంది. కాని ఏమి చూస్తుందో సాహిత్యకే తెలియలేదు. రవిచంద్ర ప్రక్కనేవున్నాడని తెలుస్తుంది. కాస్త యిటు కదిలితే అతను తగులుతాడు. అప్రయత్నంగా కాలు జరిపింది. గబుక్కున రవిచంద్ర కాలుమీద కాలు వేసుకున్నాడు. సాహిత్య నవ్వుకుంది.

సినిమా అయిపోయింది. రవిచంద్ర ముందు వెళ్లిపోయాడు.చివర్లో హాలునుండి బయటికి వచ్చారు సాహిత్య, కమల. అటు, ఇటూ చూశారు— గోపీ కనిపిస్తాడేమోనని—

కార్లు, స్కూటర్లు బుయ్ బుయ్ మని బయటికి పోతున్నాయి. గోపీ జాడ కనిపించలేదు

"బాస్‌ను చూసి— అటు నుంచి అటే జారుకున్నాడేమోనని" సాహిత్య అంది. ఆటో కోసం ముందుకు వచ్చారు. వాళ్ల ముందుకువచ్చి ఆగింది ఫియట్ కారు. రవిచంద్ర ముందు తలుపు తీసి—

"రండి— గోపీ టిక్కెట్టు నాకు యిచ్చి వెళ్లాడు—" ఇప్పుడు అతని ముఖంలో నవ్వుచూచి కమలకు ధైర్యం వచ్చింది. ముందుసీట్లో సాహిత్య వచ్చి కూర్చుంది. అంత ధైర్యంలేని కమల వెనుక కూర్చుంది.

రవిచంద్ర కారును ముందుకు పోనిస్తూ—

"ఎక్కడికి వెళ్లాలి" అన్నాడు.

"స్టేషన్ దగ్గిర వదిలేయండి— అక్కడనుంచి వెళ్లిపోతాం" అంది కమల చిన్న స్వరంతో. రవిచంద్ర వినన్లేపోయి నల్లకుంట జంక్షన్ దగ్గర ఆపి— సీట్లో కూర్చునే వెనక డోర్ తెరిచాడు.

"మీ యిల్లు నల్లకుంటలో అని తెలుసు. ఇంటి నంబరే గుర్తులేదు. ." అంటూ చిన్నగా నవ్వాడు. కమల దిగి థాంక్స్ చెప్పింది. బాస్‌కి ఎలా తెలుసా అని లోలోనే ఆశ్చర్యపోతూ వుంది.

"మీరెక్కడికి ?"

"నా అడ్రస్ మీకు తెలియదా ?" అంది.

"నీకు నేను కాదుగా వుద్యోగం యిచ్చింది"

అప్లికేషన్‌లో చూశాడన్న మాట, ఎంత బాగా గుర్తు పెట్టుకున్నాడు అని తెలుస్తూ—

"పబ్లిక్ గార్డెన్స్" అని చెప్పింది. రవిచంద్ర ప్రశ్నార్థకంగ చూశాడు.



గార్డెన్స్ సమీపాన బాట ప్రక్కన ఆపి, సాహిత్యవైపు చూశాడు. నేరుగా రోడ్డువైపు దీర్ఘంగ చూస్తున్న సాహిత్యకు ప్రశ్నార్థకంగా రవిచంద్ర తనవైపు చూస్తున్నాడని తెలుసు. తన గుండె జోరుగా, పెద్దగా శబ్దం చేస్తున్నది. ఆ చప్పుడు అతనికి వినిపిస్తుందేమోనని బిడియంగా వుంది. ఇంటికి పోవటం ఇష్టమైతే — కమలలాగ నేరుగా యింటి దగ్గరే దిగిపోయేది. నోరు విప్పి, పబ్లిక్ గార్డెన్స్ అని చెప్పింది. పెద్ద రచయిత — మగవాడు — ఆ మాత్రం అర్థం చేసుకోలేడా! అతనితో తను ఏకాంతం కోరుతున్నదని. తన ఇష్టాన్ని, ప్రేమని, చూపుల్లో, క్రియల్లో, నవ్వుల్లోనే కాదు — అతనెంతగా తన మనస్సు నాకర్షించిందీ కవితగా చెప్పింది. అర్థం చేసుకోలేని అమాయకుడు కాదు—అతనిపై ప్రేమ మానసికంగా కష్టపెట్టుతుంటే — అర్థం కానట్లు కొట్టకనే శారీరకంగా హింసిస్తున్నాడు. ఇంకెలా చెప్పాలి తన ప్రేమను. సిగ్గు విడిచి అతనిపై పడిపోలేదు కదా!

"ఎందుకిలా హింసిస్తున్నావ్ రవిచంద్రా..." సాహిత్య మనోవేదన దుఃఖంగా మారింది. గొంతు ఎండిపోయింది. క్రింది పెదివి చిగురుటాకుల్లా దుఃఖంతో అల్లల్లాడుతుంది. సిగ్గు కన్నుల్లో అవ మానంతో ముఖం కళ తప్పింది. అభిమానంతో వుబికి వస్తున్న ఏడ్పును ఆపుకొనే ప్రయత్నంలో శరీరం వణికిపోసాగింది. వూహ తెలిసినప్పటి నుంచి తనకు దుఃఖం రావడం— ఏడ్వడం ఇదే మొదటిసారి. ఇంతవరకు తనకు ఇంటా బయటా ఆడింది ఆటగా పాడింది పాటగా చెల్లించుకుంటూ వచ్చింది. మొదటి సారిగా నిజంగా కావాలనుకున్న మగవాడు ఇతడే— ఇలాటి తిరస్కారానికి అలవాటు లేని సాహిత్య— ప్రేమ— అభిమానం— సిగ్గు ముప్పిరిగొనగా వుక్కిరి బిక్కిరయిపోయి— ముఖాన్ని రెండు చేతుల్లో దాచుకొంది.

దుఃఖంతో భుజాలు ఎగసెగసిపడుతున్నాయి.

అనుకోని ఈ చర్యకు అప్రతిభుడైనా అప్ర యత్నంగా దగ్గరకు జరిగి— ఆర్తిగా "సాహిత్యా" అని ఆర్ద్రంగా పిలిచాడు. భుజంచుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకుని — ముఖానికి అడ్డుగావున్న చేతులు తొలగించి అందమైన గడ్డాన్ని పట్టుకుని—ముఖాన్ని తనవైపు తిప్పుకుంటూ, "సాహిత్యా!" అన్నాడు.


ఎర్రబడిన కనుదోయి కన్నీటితో నిండగా— నల్లని పొడుగాటి రెప్పలు తడిసి ముద్దయినవి. అనురాగపూరితమైన రవిచంద్ర చూపు సోకగానే తనను తాను నిలదొక్కుకోలేనట్లు ముందుకు వాలి పోయింది. సాహిత్య తలను అక్కున చేర్చుకుని క్షణం కళ్లు మూసుకున్నాడు. వెంటనే తేరుకుని — కారును స్టార్ట్ చేశాడు. అటు తిప్పి, ఇటు తిప్పి— చివరికి సిటీ దాటుకుని నేషనల్ హైవేమీదకు వచ్చి, ప్రక్కన మట్టి బాటవైపుకు తిప్పాడు.


అప్పటికి పశ్చిమానికి చేరుకున్న సూర్యుడు కందిపోయి — అలసిపోయి మెల్లిగా క్రిందికి జారిపోతున్నాడు.

కారు దిగి సూర్యాస్తమయాన్ని చూపిస్తూ — "సాహిత్యా! నీలాలనింగి నుండి భువికి దిగివచ్చి నట్లున్న సూర్యుడు — ఆకర్షిస్తూ పట్టుకో అన్నట్లు — వూరిస్తున్నాడు. ఎంతో దూరంలో లేడు. పరుగెత్తుకుపోతే అందేలా వున్నాడు."

అందుకోగలనా? చూచి ఆనందించినట్లుగ నిన్ను చూస్తున్నాను; కారులో తలుపు కానుకుని కూర్చున్న సాహిత్య తనలో తానుగా మాట్లాడుకుంటున్నట్లు అనిన మాటలు విని కారుదిగి వచ్చి అతని ప్రక్కన నిలుచున్నది.

గుబులుగా— ఆరాటంగా సాహిత్యను చూస్తూ ఆమె చెయ్యి అందుకుని సుతారంగా అంటీ అంటనట్లు వ్రేళ్లను అధరాలతో స్పర్శించి "థ్యాంక్యూ సాహిత్య— నీవు దిగివచ్చినా— నిన్ను తీసుకుని ఎక్కడికి పోతాను— ఎక్కడా వుంచలేను— సాహిత్యా— అలా చూడకు. ఐ లైక్యూ— ఐ లవ్ యూ..." ఆ మాటలకే సాహిత్య ముఖం గుప్పుమని వెలిగింది. ఆ సంతోషం మరెంతసేపో నిలువలేదు.




సాహిత్య కళ్లల్లోకి చూస్తూ "కాని, నాకు భార్య వుంది తండ్రినికూడా" వూదేసినట్లు ఆ సంతోషం ఆరిపోయింది ఆ కళ్లల్లో చీకట్లు సుడులు తిరుగుతున్నట్లు మరీ నల్లగా కనిపించాయి సాహిత్య కళ్లు సాహిత్య కదల్లేదు, మెదల్లేదు రాతి బొమ్మలా నిల్చుని కళ్లు విప్పుకుని మౌనంగా చూస్తుండిపోయింది.

అధరాలు కొద్దిగా విడి పై పంటివరుస కనీ కనపడనట్లు తెల్లని గీత గీసినట్లు జేవురించిన ముఖంలో నల్లని కనులు— నుదుటి పై భాగాన్ని సగం కప్పిన కురుల్లో చంద్రోదయాన్ని గుర్తుకు తెస్తుంటే

కమనీయ సౌందర్యాన్ని రెండు చేతుల్లోకి జవురుకోవాలనిపించింది.

గుండెలో గింజుకుంటున్న బాధ ముఖంలో ప్రతిఫలిస్తుంటే ఆ చిన్నారి స్త్రీని హృదయానికి చేర్చుకుని దుఃఖం పోగొట్టాలని అడుగు ముందుకు వేశాడు నిశ్చల శిలా ప్రతిమలా వున్న సాహిత్య కదిలింది. యేదో చెప్పబోయింది. పెదవులు కదల లేదు.

పట్టుకోబోయిన రవిచంద్ర చేతులనుంచి జారిపోయి కూలిపోయినట్లు క్రింద కాళ్లపై కూర్చుండిపోయింది. మోకాళ్ల మధ్య తల వంచుకుని — నిశ్శబ్దంగా రోదించసాగింది

రవి సంధ్యను చేరుకున్నాడు. సంధ్య తొందర పడుతూ — నీలి తెరలను దించేసింది.

ఆకాశపు వాకిళ్లు తెరుచుకున్నాయి.

తూర్పు దిక్కున అమరావతిలో శచి వెలిగించిన దీపాలు చూచి — పడమర శ్రద్ధావతిలో కాళికాదేవి దీపాలు వెలిగించినట్లుంది. ఉత్తరాన అలకాపురిలో చిత్రరేఖ, దక్షిణాన వున్న సంయమనిలో శ్యామలాదేవి, ఆగ్నేయంలో అగ్నిభార్య — స్వాహాదేవి, నైఋతిలో దీర్ఘాదేవి, వాయవ్యాన అంజనాదేవి — ఈశాన్యంలో పార్వతి — వెలిగించిన మణిదీపాలు వారి దివ్య సౌధాలలో గవాక్షాలనుండి కనపడుతున్నట్లు నీలాకాశంలో నక్షత్రాలు నిగనిగలాడుతున్నాయి.

సాహిత్యను ఏమని ఓదార్చాలో తెలియక శూన్యంలోకి చూస్తూ వుండిపోయిన రవిచంద్ర నక్షత్రాగమనంతో పొద్దుపోయి చాలాసేపైనదని గ్రహించి సాహిత్యను రెండు భుజాలు పట్టుకుని

## రా గా గ్ని

లేవదీసి, తన కర్చీఫ్‌తో ముఖాన్ని తుడిచి—

"ఐ యామ్ వెరీ వెరీ సారీ! సాహిత్యా" అంటూ డోర్ తెరిచి కారులో కూర్చుండజేసి, గబగబ తిరిగి వచ్చి డ్రైవింగ్ సీటులో కూర్చుని— కారును స్టార్టుచేసి— మెయిన్‌రోడ్డుపైకి వచ్చాడు సిటీవైపు వేగంగా పోనిచ్చాడు

* * *

గ్రీష్మఋతువులో సూర్యుడు తాబేటి రథం ఎక్కుతాడు. మరి తాబేలు నడకతో పశ్చిమానికి చేరుకోటానికి ఎక్కువ సమయం తీసుకుంటాడు. పశ్చిమాద్రిపై నిలిచిన దినపతి రథం నుంచి దిగి ఎదురుచెన్నులు చూస్తున్న సంధ్యను కలుసుకున్నాడు. వారి కలయిక లోకానికి చల్లదనాన్ని ఇచ్చింది.

భార్య భర్త కలయికలో అంత ఆనందం వుంటుంది. వారు ఆనందంగ వుంటే ఆ కుటుంబము సుఖ సంతోషాలతో వుంటుంది. వారి కుటుంబమే కాదు, ఆ చుట్టు ప్రక్కల వాళ్లు ఆనందంగా వుంటారు. కలతలు లేని భార్యాభర్తలను చూస్తే, చూడముచ్చటవుతుంది వారిని చూసిన వాళ్లు వారిలాగే తాము కూడా వుండాలని అనుకుంటారు

"మీరు వచ్చిన తర్వాత నాకు చాలా హాయిగా వుంది మా ఆవిడ మారిపోయింది" అంటూ నవ్వాడు సారధి.

లక్ష్మి నవ్వింది

సారధి భార్య గిరిజ—గ్రేప్ జూస్ సిప్ చేస్తూ—

"వదినగారు! జ్యూస్ బాగుంది నేను చేస్తే ఈ రుచిరాదు.."

"మీకు తీరిక వున్నప్పుడు రండి — చేద్దాం ఆ రుచి ఎందుకు రాదో చూద్దాం" అంది లక్ష్మి.

లక్ష్మి ఎనిమిదేళ్ల కొడుకు ధీరజ్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"అమ్మా! డాడీ రాలేదు మరి మూవీకి టైం అయిపోతోంది" అంటూ పైట పట్టుకుని లాగుతూ తొందరచేశాడు.

సారధి టైం చూసుకున్నాడు.

"మీరు వెళ్లండి ఆయన వస్తే టైం వుంటే వస్తాం.." అని లక్ష్మి చెప్పింది.

సారధి, గిరిజ అలాగే అంటూ ధీరజ్‌ను తీసుకుని వెళ్లిపోయారు. వారిని గేటువరకు సాగనంపి ధీరజ్ 'టాటా' అంటూంటే వారు వీధి మలుపు తిరిగేంతవరకు చెయ్యి వూపి తోటలోకి నడిచింది

పూలకు ప్రాణాలొచ్చి పైకెగిరి దాగుడు మూతలు ఆడుతున్నట్లు ఒక్కసారి రంగు రంగుల సీతాకోక చిలుకలు నలువైపులా ఎగిరిపోయాయి. తోటగాలి, పూల సౌరభాలను దోచుకుపోతున్నది.

ఇనుప చక్రాన్ని గొడుగులా అమర్చి దానికి మేరీ పామర్ బోగన్ విల్లాను ప్రాకించిన విధం చూస్తూ ఆ గొడుగు క్రిందవున్న బెంచిపై కూర్చుంటూ—


"దేవుని సృష్టికి మెరుగులుదిద్దిన మానవుడు అభినందనీయుడు" అనుకుంది లక్ష్మి.

సంధ్య ముదిరి చీకటైంది.

మెల్లమెల్లగా చీకటి తెరలు తెరలుగా ఆ యింటిని ఆక్రమించాయి. అక్కడే కూర్చుని భర్త రాకకై ఎదురుచెన్నులు చూస్తుంది లక్ష్మి. ఎక్కడో కారు హారన్ వినిపించింది. తమ కారు హారన్ అదే అని గుర్తించి— వుదుటున లేచి గారేజ్ తలుపు తీసి ప్రక్కన నిలుచుంది.

### "చూసే" మరమనిషి!

పరిశ్రమల్లో మర మనుషుల ఉపయోగాలు నానారకాలుగా ఉంటున్నాయి. దానితో క్రొత్త రకాల మర మనుషులను తయారు చేస్తున్నారు. ఈ సంవత్సరాంతానికి "చూడగల" మర మనుషులను వ్యాపారరీత్యా తయారుచేయనున్నారు సాలిడ్ స్టేట్‌లో వున్న 'ఇమేజింగ్ డివైస్', అల్ట్రాసోనిక్ సెన్సర్లతో వీటిని నిర్మిస్తారు. ఇవి కన్వేయరు బెల్టులపై కదులుతుండే వస్తువులతో పని చేస్తాయి. ఇవి తోవలో అడంగా వున్న వస్తువులను కూడా తొలగించగలవు హిటాచి కంపెనీవారు మరో మర మనిషిని తయారు చేస్తున్నారు. ఇది వివిధ రకాల వస్తువులను గుర్తించి వాటితో క్రొత్త ఉత్పత్తులను కొనసాగించగలదు.ఇవికాక చేతివివర 'స్పర్శ'ను తెలిపే మర మనుషులను అనేక కంపెనీల వారు తయారు చేస్తున్నారు.




# వారఫలం

**19-11-1982 శుక్రవారం మొదలు**
**25-11-1982 గురువారం వరకు**

♈ **మేషం**: ముఖ్య గ్రహచలనం వలన మీకు సుగమమైన, అనుకూలమైన మార్పులు రానున్నవి ఆర్థికంగా బాగుండే వారం. వ్యాపారంలో కొన్ని మార్పులకూ అవకాశం ఉన్నది **స్త్రీలకు**: బంధుగోష్ఠి, శుభ కార్యానుకూలత ఆదాయంలో అభివృద్ధి గలవారం

♉ **వృషభం**: గ్రహించండి. నూటికి నూరుపాళ్లు పలు రంగాలలో మేలు జరుగనున్నది సాహితీ రంగంలో కొందరకు లాభదాయకమైన అవకాశాలుంటాయి అధికారు వృద్ధి కానున్నది. వ్యాపారస్థులకు అనుకూల వారం **స్త్రీలకు**: విద్యా వైజ్ఞానిక రంగాభివృద్ధి బంధు సమాగమానికి అవకాశమున్నది

♊ **మిథునం**. ఉద్యోగాభివృద్ధి చాలమంద ఆశించవచ్చు కొందరకు అనుకూలమైన మార్పులు రావటమేగాక 'ప్రమోషన్'కు అవకాశమున్నది ప్రజాసేవలో కొందరకు పేరుప్రతిష్ఠలు అతిశయిస్తవి సభారంగంలో కొందరకు అధికారాదరణ కనిపిస్తుంది **స్త్రీలకు**: అధికారుల ఆదరణ, బంధు ప్రీతికి అవకాశంగల వారం.

♋ **కర్కాటకం**. ధనాదాయం అధికారాభివృద్ధి, చేసే వ్యాపారంలో అనుకూలత ఏర్పడగలదు. వస్తువులు కొనుగోలు చేయగలరు. భూసంబంధమైన పరిష్కారాలకు అనుకూలమే కోర్టు వ్యవహారాలుంటె మధ్యవర్తి ద్వారా పరిష్కరింపబడగలవు. నీతి, నిజాయితీకి గుర్తింపు కలిగి ఆర్థికాభివృద్ధి కనిపించగలదు. **స్త్రీలకు**: ఉద్యోగానుకూలం, ఆశించిన రంగాభివృద్ధి ఆదాయం గల వారం

♌ **సింహం** విందువినోదాలలో చాలమంది పాల్గొనే అవకాశం గలవారం. కొందరు నూతన వ్యవహారాలలో జోక్యం కలుగజేసికోగలరు. కొందరు మిత్రులకు సహాయం చేయవలసిన పరిస్థితులుంటాయి. **స్త్రీలకు** బంధువుల మూలాన అధిక వ్యయం, గృహ సంబంధమైనవి గ్రహింపగలరు

♍ **కన్య**. వస్తుసేకరణకు, వ్యాపారాభివృద్ధికి నూతన వ్యవహారాలలో జోక్యం కలుగజేసికొనుటకు, నూతన మిత్ర సమాగమానికీ, అనుకూల వారం. దూరదేశానికి ప్రయాణించే అవకాశం కొందరకు, తమకు అనుకూలమైన విదేశ వార్తాశ్రవణం కొందరకు అధిక ఆదాయం కొందరకు, చెప్పదగిన వారం

♎ **తుల**. ప్రయాణాలు చేయవలసి రావటం ప్రసిద్ధులతో సమాగమం, కళా సాహిత్య రంగాలలో ఆదాయానికి మార్గం. సులువుగా ఒకానొక వ్యవహారం అనుకూలంగా నెరవేరే అవకాశమున్నది **స్త్రీలకు**: నూతన విధానంలో అభివృద్ధి, నగలు కొనే అవకాశం ఉద్యోగాభివృద్ధికి అవకాశం గలదు

♏ **వృశ్చికం**. ప్రయాణాల్లో, మతిమరపు వలన కొందరు వస్తువులు పోగొట్టుకొనే అవకాశం ఉన్నది. కొందరకు నూతన వ్యాపారం. అంది పుచ్చుకొన్నట్లు లభ్యమయ్యే అవకాశం ఉన్నది. **స్త్రీలకు**: కార్య సందడి, అధిక వ్యయం రాబడిలో లోపం చెప్పదగిన అంశాలు

♐ **ధనుస్సు**: కళా సాహిత్య రంగాలలో చేసే వ్యాపారంలో గ్రామ పెద్దరికంలో, మిత్రగోష్ఠిలో అనుకూలత గలవారం కొందరు గృహాన్ని విస్తరించే కార్యక్రమాలు చేపట్ట గలరు **స్త్రీలకు**: ఒకానొక విషయం చిరకాలంగా నెరవేరనిది అనుకూలం కావటం ఆర్థికంగా బాగుండటం గ్రహింపగలరు.

♑ **మకరం**: ప్రతిభ రాణించే అవకాశాలు సాహితీ రంగంలో ప్రగతి సాధించే అవకాశాలు, చిత్ర రంగంలో ఆదాయానికి వృద్ధి అయ్యే మార్గం, నూతన మిత్ర సందర్శనం, ఆర్థికంగా అభివృద్ధి కనిపించటం గమనిస్తారు **స్త్రీలకు**: ఆదాయానికి లోపం లేకపోవటం. అన్నింటా అనుకూల పరిస్థితులు ఏర్పడగలవు

♒ **కుంభం**: ధనాదాయం గలవారం. వ్యాపారంలో నూతన మార్పులకు అవకాశం, మిత్రాదరణ, బంధువర్గీయులు, అధికార వర్గీయులు, ఎలాగో, ఏదో విషయంలో ఆదుకోగలరు. **స్త్రీలకు** సుఖశాంతులు, నూతనంగా వస్త్ర సేకరణకు అవకాశం, ఆర్థికంగా అభివృద్ధి గలవారం.

♓ **మీనం**: ప్రయాణాలు ఎంత క్లుప్తం చేస్తే అంత మంచిది. వస్తువులు విలువగలవి సేకరించే అవకాశమున్నది ప్రతిభ రాణించటం, గౌరవం వృద్ధి చెందుటకు, ఆర్థికంగా రాణింప గలుగుటకు అవకాశమున్నది. **స్త్రీలకు** ఉద్యోగాభివృద్ధి, నగలు విలువగల వస్త్రాలు కొనుగోలు చేయగల అవకాశం గలవారం. ఉత్తమ ఫలదాయక వారమే.

— విద్వాన్ కోట సత్య రంగయ్య శాస్త్రి *

కారు తలుపుకు లాక్ చేస్తూ, గేటు మళ్లీ మూస్తున్న లక్ష్మితో—

"కాశీ ఏమైయ్యాడు" అని అడిగాడు రవిచంద్ర.

"బాబు సారధి వాళ్లతో వెళ్లాడు. వాళ్లని తొందర చేస్తాడని, కాశీని కూడ పంపాను."

లక్ష్మికి ఎదురు వెళ్లి భుజం చుట్టూ చెయ్యి వేశాడు. లక్ష్మి చిరునవ్వుతో సున్నితంగ చేతులు విడదీస్తుంటే చెయ్యిపట్టుకుని మెల్లిగా నొక్కాడు.

వరండాలైటు కాంతిలో ఒకరినొకరు చూచుకుని నవ్వుకున్నారు. చెయ్యి చెయ్యి పట్టుకుని యింట్లోకి పోయారు.

బూటులేసు విప్పుతున్న లక్ష్మిని చూస్తూ "నామీద కోపంగా లేదా!" అన్నాడు రవిచంద్ర.

"ఏదో పనివుండి రాలేకపోయారు. మీ ముఖం చూస్తుంటే తెలియటం లేదు ఎంతగా అలసి పోయారో !" బూటుతీసి హవాయి చెప్పులు కాళ్ల దగ్గర వుంచుతూ,

"గిరిజ చాలా మారిపోయిందట. మునుపటిలా గొడవ చేయటల్లేదట. సినిమానికి వెళ్దాం అని చెప్పి సారధి రాకపోయినా అలిగినా వంట చేస్తోందట" అని చెప్పుతూ నవ్వింది.

తనెదుట పరిపూర్ణ యువతిలా నిలుచున్న లక్ష్మి సుందర స్వరూపాన్ని ఆరాధనా దృష్టితో చూస్తున్నాడు. సాహిత్య జ్ఞాపకాలు తనను కలవర పెట్టుతుంటే తుడిచివేసుకుంటున్నట్లుగా భార్యను చూస్తు నిండుగా, పదిలంగ హృదయంలో నింపు కుంటున్నాడు.

రవిచంద్ర మనసులోని భావాలు ఏ మాత్రం వూహించలేని లక్ష్మి— అతని చూపులకు పులకించి పోయి— దగ్గరకు వచ్చి మెడనుచుట్టి—హృదయానికి హత్తుకుంది. లక్ష్మి నడుంచుట్టూ చెయ్యివేసి, ఆమె మెత్తని రొమ్ములపై సేదతీరుతున్నట్లుండి పోయాడు. ఒకరి స్పర్శ ఒకరికి తృప్తి నిచ్చింది. హాయిగ వుంది.

లక్ష్మి రెండు చేతులా తనకిస్తున్న సంతోషానికి సుఖాన్ని రవిచంద్ర హృదయం విచ్చుకోగా కృతజ్ఞతా భావంతో రెండు చేతులూ ఎత్తి నమస్కరించాలని పించింది.

రవిచంద్ర చేతులు జోడించిన విధం చూసి విస్తుపోయినా ఆ వెంటనే భర్త కొంటెతనం గుర్తుకు వచ్చి — ఆ చేతులు తీసుకుని — తిప్పి ముద్దుపెట్టుకుంటూ—"భక్తుడి కోరిక ఏమిటో?" అంది.

"ప్రకృతి ప్రశాంతంగా వుంది. నా ప్రత్యర్థి వచ్చేలోగా నా యిష్టప్రకారం..."

లక్ష్మి కళ్లు కాంతితో తరళించినవి. దివ్య సుమంగళిని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు.

"ముందు స్నానంచేసి రండి" అంది.

"వాడు వచ్చేస్తాడేమో" రవిచంద్ర ముఖం చూచి నవ్వింది లక్ష్మి.

"నీవు నవ్వుతుంటే నా మీద పూల వర్షం కురిసినట్లుంది. స్నానం అవసరం లేదనుకుంటాను" అంటూ పడకపై మెత్తగా దించాడు లక్ష్మిని.

**( ఇంకా వుంది )**



**విద్యార్థి లోకం వ్యాస రచన పోటీలో ప్రత్యేక బహుమతి రు. 150/-లు పొందిన వ్యాసం**

# మా విద్యార్థిలోకం ఆశయాలు

ప్రతి విద్యార్థి(ని) పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగము సంపాదించి జీవితములో సుఖపడాలని, తన ఆశయాల పునాదులపై ఆశల హర్మ్యాన్ని నిర్మించి జీవించాలని అభిలషిస్తారు. లంచగొండితనాన్ని రూపు మాపాలని, సంఘములో జరిగే అన్యాయాల్ని, అక్రమాల్ని అరికట్టాలని ఉబలాటపడతారు. దేశములో జరిగే ప్రతిఉద్యమానికి ముందుంటారు. ఇది సహజం. కాని కడలిలాంటి విద్యార్థి లోకం అనేక ఆటు పోట్లుకు లోనవుతూంది.

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలలో ముఖ్యముగా మూడింటిని పేర్కొనవచ్చును.

1) లోపభూయిష్టమైన విద్యా విధానం
2) రాజకీయాల ప్రభావం.
3) నిరుద్యోగ సమస్య.

1) నేటి విద్యా విధానము చాలా లోప భూయిష్టమైనది. నేటి పాఠ్యాంశములు విద్య యెడల విద్యార్థుల యొక్క అభిరుచిని పెంచి ఆలోచనా శక్తిని, విజ్ఞానాన్ని పెంపొందించేవిగా లేవు. పరీక్షా విధానము కూడ విద్యార్థి యొక్క జ్ఞాపకశక్తిని మాత్రమే పరీక్షిస్తుందిగాని అతని ఆలోచనా సరళిని, సృజనాత్మక శక్తిని పరిగణన లోనికి తీసుకోవటంలేదు. కుల ప్రాతపదికపై జరుగు సీట్ల రిజర్వేషన్‌లు కూడ విద్యా విధానానికొక పెద్ద జాఢ్యం విద్యార్థి ప్రతిభకు, మేధాసంపత్తికి అవకాశము లేకుండాపోతుంది. తద్వారా జాతిమనుగడకు మూలవిరాట్టులైన భావిమేధావులు నిరాశ, నిస్పృహలకు లోనవు తున్నారు ఇందువలననే ఇతర దేశాలకు మేధావులు వలసపోతున్నారు. ఇది జాతి ఉజ్వల భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు. డొనేషన్‌ల పద్ధతి విద్యా విధానానికి కేన్సరు లాంటిది.

2) నేటిసమాజములో ఉన్నఒడిదుడుకులకు విద్యార్థి లోకం అద్దం పడుతూంది. స్వార్థ పరులైన రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడానికి విద్యార్థుల్ని పావులుగా వాడు కొంటున్నారు నేటి యువత తమకు అనుకూల మైన రాజకీయ పార్టీలకు ఆశ్రయమిచ్చి అనేక సంఘాలుగా విడిపోతున్నది. దేశ సమగ్రతకు, ఉజ్వల భవిష్యత్తుకు సారధ్యం వహించవలసిన యువతరం సంకుచిత, స్వార్థ రాజకీయాలకు లోనవుతూంది.

3) డిగ్రీ చేతపట్టుకొన్న ప్రతి విద్యార్థి, విద్యార్థిని ఉద్యోగం చెయ్యాలని, సుఖమయ జీవితాన్ని గడపాలని కలలు కంటారు. కాని చాల మంది విషయంలో అవి పగటి కలలుగనే మిగిలి పోతున్నాయి. నిరుద్యోగ రాక్షసి రోజు రోజుకి బలపడుతూంది.

జాతీయ జీవన స్రవంతికి నాడీ మండలం లాంటి విద్యార్థిలోకం అస్తవ్యస్తమైన విద్యా విధానం వల్ల, స్వార్థపూరిత రాజకీయ నాయకుల ప్రమేయం వల్ల, అంతకంతకు జటిలమగుచున్న నిరుద్యోగ సమస్యవల్ల, నిర్వీర్యమై, నిస్తేజమై, నిస్పృహకు లోనైపోతూంది. ఇది జాతిమనుగడ కొక సవాల్ !

## పరిష్కారమార్గాలు :

1) బోధనా విధానము, పరీక్షా విధానము పూర్తిగా మారాలి. కుల ప్రాతిపదికపై జరిగే రిజర్వేషన్‌లు తొలగించాలి. డొనేషన్‌లు పూర్తిగా రద్దు కావాలి.

2) విద్యార్థులు రాజకీయ నాయకులతో ఎట్టి సంబంధాలు పెట్టుకోరాదు. విద్యార్థులు రాజకీయాలను పరిశీలించవచ్చుగాని అందులో ప్రవేశించరాదు.

3) దేశము పారిశ్రామికముగా అభివృద్ధి చెందితే నిరుద్యోగ సమస్య చాలావరకు పరిష్కృతమవుతుంది. జనాభా పెరుగుదలను అరికట్టుట చాలా అవసరము. ★

## రచయిత్రి పరిచయం



"స్వగ్రామం : గుంటూరు జిల్లా, తెనాలి తాలూకా, రావికంపాడు గ్రామం. నాన్నగారి వృత్తిరీత్యా ప్రస్తుతం వేమూరులో వుంటున్నాం. ఈ వ్యాసం నా తొలిప్రయత్నం. నాకు ప్రత్యేక బహుమతి యిచ్చి నన్ను ప్రోత్సహించినందుకు 'ఆంధ్ర సచిత్ర వార పత్రిక' వారికి కృతజ్ఞతలు.

చదువు : డి. ఫార్మశీ పాసైనాను. బి. ఫార్మశీకి వెళ్ళాలనే కోరిక.

నవలలు చదవటం, సినిమాలు చూడటం హాబీ. మంచి కథలు రాయాలనేది కాంక్ష."

— కొత్రిగడ్డ తనూజ


AMCO


# రాయుడిగారి వేట

పాలగిరి వేణు

"రాజయ్యగోరండీ! రాయుడుగారు మిమ్మల్ని అర్జంటుగా అంటే వున్న పళంగా తీసుకు రమ్మన్నారు... వేంకట్రాయపాళెం నుండి రంగా రెడ్డిగారొచ్చారు..." అంటూ కబురు చెప్పి, పొగాకు కట్టలోంచి ఓ పాయను బయటకు లాగి, విడదీయ సాగాడు అంకిరెడ్డి.

"వస్తున్నా పద... అంకిరెడ్డి! వైనమేమన్నా తెలుసా?" అంటూ చెక్కుతున్న నాగలిమానును ప్రక్కకు పెట్టాను.

"అబ్బే! తెలియదండీ" అంటూనే విడదీసిన పుగాకును రెండు చుట్టలు చుట్టి, ఒకటి నా ముందు పెడుతూ "అగ్గిపెట్టెస్తారుటండీ" అంటూ చేయి చాపాడు. అగ్గిపెట్టెను యిచ్చాను. మూడో పుల్లతోగాని చుట్టను వెలిగించలేకపోయాడు అంకిరెడ్డి. నా బనియను జేబులో వేసుకున్నాను ఆ చుట్టను.




ఈ పెద్దోళ్లతో వచ్చిన గొడవే యిది. ఎప్పుడు? ఎందుకు?? పిలుస్తారో తెలియదు. వెళ్తే వాళ్ళు చెప్పేది, చేయమనడానికి అంతూ పొంతూ వుండదు. అయినా వెళ్ళక తప్పదు. మర్రి చెట్టుక్రింద బ్రతికే చిన్న చిన్న మొక్కల్లాంటి వాళ్ళం. పెరగడానికి సత్తువ లేనివాళ్ళం మరి.

నేను వెళ్ళేసరికి రాయుడుగారు వాలుకుర్చీలో కూచుని చుట్ట కాలుస్తూ రంగారెడ్డిగారితో ఏదో బాతాఖానీ కొడుతున్నారు. వాలకం చూస్తే అప్పుడే టిఫిన్లు, కాఫీలు ముగిసినట్లున్నాయి.

"అయ్యా! పిల్చారట" అంటూ వసారాలో గోడకు ఆనుకుని ముంగాళ్ళమీద కూచున్నాను.

"ఏరా! రాజిగా!! బావున్నావట్రా!... ఈమధ్య నల్లపూసయిపోయావు. వేంకట్రాయ పాలెం నుండి రంగారెడ్డిగారొచ్చారు ... ఎందు కొచ్చారో తెలుసా?"

"చెప్పందే తెలియదండీ!"

"అయితే విను ... వేంకట్రాయపాలెంలో ఓ మూడురోజుల నుండి పెద్దపులి పడ్తోందట్రా! రోజుకో మేకనో, గొర్రెనో ఎత్తుకెళ్తోందట ... మన సాయం కావాల్సి వచ్చారు. మన తుపాకీలకు పని పడింది. ఏమంటావ్? మరి?"

"నాదే ముందయ్యా! మీరూ 'వూ' అంటే నేనూ 'ఊ...' అంటాను. రాములోరి ఆజ్ఞలను పాటించే హనుమంతుడిలాగా."

"అయితే రెడ్డిగారూ! రేపు మధ్యాహ్నం రెండుగంటలకల్లా చేరుకుంటాం ... ఎర కోసం రెండు మేకల్ని చూసివుంచండి. అయినా రెడ్డిగారూ ఫారెస్టోళ్ళగ్గాని, పోలీసోళ్ళకుగాని యీ వైనం తెలియదు కదా! ..."

"అమ్మమ్మ! ఎంత మాటండీ! లేని తద్దినాన్ని నెత్తిమీద రుద్దుకుంటామటండీ .! మరి వస్తాం మీరు రేపు మధ్యాహ్నానికల్లా.." అంటూ కుర్చీలోంచి లేచారు రంగారెడ్డిగారు.

"ఎంత మాట తప్పకుండా వస్తాం" అంటూ రాయుడుగారు భరోసా యిచ్చి, రెడ్డిగార్ని సవారీ బండి వరకు సాగనంపి, బండి కదిలాక వెనక్కి వచ్చారు.

"నీవు 'వూ' అంటే నాదేం లేదన్నార్రా అందుకని నిన్ను పిలిపించమన్నారు రెడ్డిగారు. పిలిపించాను."

"అబ్బే! దానికేముందండీ!" అంటూ నసిగాను.

రాయుడుగారికి రాజకీయం తెలుసు.. మనిషిని ముందుకెలా వేయాలో తెలుసు.. ముందుకేసి, పనిని ఎలా సాధించాలోకూడ తెలుసు.

"ఓరేయ్! నర్సిగా! రాజిగాడింట్లో రెండు శేర్ల పెసలు యిచ్చి రా!" అంటూ రాయుడుగారు నర్సిగాణ్ణి పిలిచి చెప్పాడు. ఆ మాట నాకు చెవుల్లో చల్లగా సోకింది.. పెసరట్లు తిని చాల రోజులయింది మరి.

"సరే! రాజీగా! నీ సరంజామా అంతా సర్దుకుని రేపు మధ్యాహ్నం ఒంటిగంట కంతా వొచ్చేయి. సవారీ బండి 'రెడీ'గా వుంటుంది ఇక నువ్వెళ్ళొచ్చు. ."

రాయుడిగారి దగ్గర శెలవు పుచ్చుకున్నాను.

రాయుడుగారు మా వూళ్ళో పెద్ద భూస్వామి మా వూరి కనుచూపుమేరకు రాయుడిగారి పొలాలు... తోటలూను... మనసు 'మంచి'దేగాని, అప్పుడప్పుడు 'అహం'తో గొడవపెట్టుకొని, దుర్మార్గుణ్ణి చేస్తుంది. ఆ దుర్మార్గానికే లొంగి బ్రతుకుతున్నాం ఆ వూళ్ళో జనమంతా. రాయుడుగారు మంచి 'షికారీ' కూడాను. చుట్టుప్రక్కల గ్రామల్లో ఏ క్రూరమృగం వచ్చిపడ్డా, రాయుడిగార్నే పిలుస్తారు. వన్యమృగాల అడుగుజాడలు చూసి, అది ఏ మృగమో పసిగట్టే ప్రతిభ, నైపుణ్యం వున్నాయి. గురి చూసి కొట్టడంలో చాతుర్యం; మెకాన్ని ఎలా చంపాలో, ప్రణాళికను తయారుచేయడంలో నేర్పు వున్నాయి. అందుకనే యింతవరకు, రాయుడుగారి వేటలో, ఏ క్రూరజంతువు కూడ తప్పించుకోలేక పోయింది. నిజంగా చెప్పాలంటే రాయుడిగారికి యీ 'వేట' పెద్ద వ్యసనం ... మనుష్యుల్ని వేటాడడు ఏదో గొప్ప అవసరం వస్తే తప్ప... జంతువుల్ని వేటాడ్డంలో రాయుడిగారికి నేను కుడి

భుజాన్ని. నేను లేకుండా, నాకు తెలిసినంతవరకు ఎలాంటి షికారీలు చేయలేదుమరి.

ఆ వుదయమే నా తుపాకీని మానెవేసి శుభ్రం చేశాను. ఇనప రవ్వలు మాత్రం నా దగ్గరుంటాయి. తూటాలు రాయుడిగారి దగ్గరుంటాయి. నా తుపాకీతో చిన్న చిన్న జంతువుల్ని, పిట్టల్ని కాల్చ వచ్చు. అంతే ... అయినా తుపాకీ ... తుపాకీయే ... ప్రాణాల్ని తీసేందుకు. మధ్యాహ్నం భోజనం చేసి రాయుడిగారింటికెళ్ళాను. అప్పటికే సవారీ బండి తయారుగావుంది. బండిలో ఓ ప్రక్కగా రాయుడిగారి పెద్ద తుపాకీ విశ్రమిస్తోంది.

అంకిరెడ్డి ఎద్దుల్ని అదిలించాడు. బండి కదిలింది. ముందువైపు నొగల దగ్గర కూచున్నాను. రాయుడుగారు తన భారీ శరీరాన్ని ఒకవైపు జారగిలేసి, కళ్ళు మూసుకున్నాడు.

వేంకటాయపాలెం మా వూరికి ఆరు మైళ్ళుంటుంది. దారికూడ బావుండదు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు పాలెం చేరుకున్నాం. రంగారెడ్డిగారింటి ముందు బండి ఆగింది. రెడ్డిగారే స్వయంగా వచ్చి రాయుడిగార్ని ఆహ్వానించి లోనికి తీసుకెళ్ళారు

ఓ పది నిముషాలయ్యాక వేడి వేడి వుప్మా, కాఫీలు వచ్చాయి. నేను, అంకిరెడ్డి వాటిని ముగించి, వసారాలో కూచుని అలా విశ్రమిద్దామనేలోపుగా, ఆ వూరి జనం పదిమందిదాకా వచ్చి, వసారాలో కూచున్నారు. రాయుడు, రెడ్డిగార్లు కుర్చీల్లో కూచున్నారు.

"అవునండయ్యా! రంగారెడ్డిగారి బామ్మర్ది పుల్లారెడ్డిగారి పొలం... అదేనయ్యా! చిన్న చింతమాను ప్రక్కన... మా గొర్రెల్ని దరికట్టి పొలంలో వదిలామయ్యా ఎరువుకోసమని... మొన్న రాత్రి.. అర్ధరాత్రి రెండు గంటలయ్యుండచ్చండి. మా కుక్క మొరుగుతోందయ్యా చాల పెద్దగా... లేచి చూచానుగదయ్యా! ఆ దరిప్రక్కన ఓ గొర్రెను నోట కరుచుకొని, ఆ యిప్పచెట్లల్లోకి పారిపోయిందయ్యా ఓ పెద్దపులి ... ! ఎంత పెద్దదనుకున్నారు...? అమ్మో!! భయమేసిందండి" అంటూ బక్కగా, రివటల్లే వున్న ఓ ఆసామి చెప్పకు పోతున్నాడు, ఆయాసపడుతూ.

"కానగల తోపు కవతల మేకల్ని మేపుతున్నానండి. సాసవరాయిమీద కూచున్నానండి నేను. మిట్ట మధ్యాహ్నం కదండి! మేకలన్నీ ఓ చింతచెట్టు కింద గిరిగీసుకు కూచున్నాయండి ! అంతలోనండి ! పెద్ద పులండీ !! వున్నట్లుండి మేకల మందమీద పడిందండీ! నేను చూస్తూనే వున్నానుకదండి ! ఓ పెద్ద రాయి తీసి పెద్దపులికి తగిలేటట్టుగా విసిరానండి ! అది సరిగ్గా దాని వీపుమీద పడిందండీ !! మేకను నోటో యీడ్చుకుంటూ యిప్పచెట్లలోకి పారిపోయిందండీ!" అంటూ పదహారేళ్ళ పిల్లగాడు చెప్తున్నాడు. వాడి పేరు కొమిరిగాడు.

రాయుడుగారు మీసాల్ని తిప్పుకుంటూ వింటున్నాడు.

"ఏరా ! రాజీగా బయల్దేరుదామా ?"

"అలాగేనయ్యా !" అంటూ రాయుడిగారి వెంట యిప్పచెట్ల అడివిలోకి ప్రయాణమయ్యాను. మాకు దారి చూపేందుకు కొమిరిగాడు ముందు నడిచాడు.

వేంకటాయపాలెం అనుకుని ఓ చిన్న అడివి వుంది. చింతచెట్లు, రావిచెట్లు, టేకుచెట్లు, అంతకు మించి యిప్పచెట్లున్నాయి. చెట్టుచెట్టుకు మధ్య ఏవో పిచ్చి ముళ్ళ పొదలు, బ్రహ్మజెముడు డొంకలు, ఈతచెట్లు. అల్లిబిల్లిగా చుట్టుకున్న రకరకాల తీగలు దారి కడ్డంపడి చికాకు కల్గిస్తున్నాయి. గుబురుగావున్న ఆకుల్లోంచి, సాయంకాలపు ఎండ జల్లెడ జల్లించినట్లుగా అడవిమీద పరుచుకుంది. రాయుడుగారు పరిసరాలన్నిటిని గమనించాడు. ఓపాద కవతలగా, చెడ్డ వాసన వస్తోంది. వెళ్ళి చూచాం గదా ! గొర్రెయొక్క కుళ్ళిన ఎముకలు. పురుగులు పట్టి చివికిన చిన్న చిన్న మాంసపు ముక్కలు... అసహ్యంగా చెల్లాచెదరయి వున్నాయి.

"మంచె ఏర్పాటుచేస్తే మంచిదయ్యా ! ఈ చోటే బావుంది" అంటూ నేనో సలహా విసిరాను.

"అవ్వునా !"

టేకు చెట్టుమీదుగా ఓ ఇరవై అడుగుల ఎత్తులో మంచె ఏర్పాటు చేశారు రంగారెడ్డి మనుష్యులు. నేను, రాయుడుగారు మంచె ఎక్కాం. మేము కనపడకుండా రెండడుగుల ఎత్తులో మంచె చుట్టూ టేకు ఆకుల్ని కప్పాలన్నాం. సరేనన్నారు.

మేము ఎంచుకున్న స్థలానికి ఓ అరవై అడుగుల దూరంలో నీళ్ళచెలమ వుంది. చెలమ చుట్టూ పచ్చనిగడ్డిలో ఏదో గుర్తు తెలియని అడుగులు పిచ్చి పిచ్చిగా పడివున్నాయి.

మంచె దిగి రంగారెడ్డిగారింటికి వచ్చేశాం ఓ రెండు గంటలు విశ్రమించాం.

రాత్రి ఎనిమిదయ్యింది మా తుపాకీలు, పెద్ద సర్చ్‌లైట్, పెద్దఫ్లాస్కు నిండా కాఫీ ... నాలుగు ప్యాకెట్ల బిస్కెట్లు ... మెడచుట్టూ మఫ్లర్లు ఇదంతా పెద్ద సరంజామా.

రంగారెడ్డిగారి సేద్యగాడు వుప్పలయ్య మేకను పట్టుకుని ముందు నడుస్తుంటే, రాయుడుగారు, నేను, మా వెనక కొమరిగాడు అడివిలోనికి బయల్దేరాం. చుట్టూ చీకటి .. కీచురాళ్ళ అరుపులు ... గుడ్లగూబల స్వైరవిహారం. దూరం నుంచి ఎక్కడో గుంటనక్కల వూళలు ...

ఆ చోటు చేరుకున్నాం. మేకను టేకుచెట్టు క్రింద బలమైన త్రాటితో కట్టేశాడు వుప్పలయ్య "అయ్యా! మే మెళ్ళొస్తాం ..." అంటూ వుప్పలయ్య, కొమరిగాడు వెనక్కి పరుగెత్తికెళ్ళారు భయంతో...అవునుమరి...వాళ్ళంత దూరం వెనక్కి పోవాలి చీకట్లో... మధ్యలో పులి మీదపడితే... ? పాపం ...

రాయుడుగారు, నేను మంచె ఎక్కాం.

రాక్షసిదోమలు చెవులచుట్టూ గీ పెట్తున్నాయి ఏదో పురుగులు ఒంటిమీదకు ప్రాకి దురద పెడ్తున్నాయి. మిణుగురు పురుగులు అక్కడక్కడ మెరుస్తున్నాయి చిన్న చిన్న నక్షత్రాల్లా...

మేక అరుస్తోంది... చీకట్లో మరీ దీనంగా.. భయంతో! నిముషాలు... గంటలు గడుస్తున్నాయి ఏ చిన్న అలికిడి అయినా వుషారు పడుతున్నాం.. పులి రాలేదు... టార్చ్‌లైట్ వెలుగులో వాచీ చూశాడు రాయుడుగారు. . మూడున్నర అయిందన్నాడు. "ఈ రాత్రికి పులి రాదు..." అంటూ నిశ్చయంగా చెప్పారు ఇంతలో అరచి... అరచి . అలిసిపోయిన మేక వున్నట్లుండి మళ్ళీ అరవటం మొదలెట్టింది.

ఎండిన ఆకులమీద బరువైన మెత్తటి అడుగుల చప్పుడు... చీకట్లో రెండు కళ్ళు... రెండు ఎర్రటి దీపాల్లా వెలుగుతూ... మెలమెల్లగా గాండ్రిస్తూ మేకపిల్లవైపు రావటం గమనించాం. రాయుడుగారు నన్ను సిద్ధంగా వుండమని సైగ చేశాడు మెల్లగా కదుపుతూ ట్రిగ్గర్‌మీద నా చేయి వేలు బిగుసుకుంటోంది... పులి... మేకమీద పడడానికి ఒక్కసారిగా దూకినట్లు శబ్దం... 'ధన్'మని చప్పుడు రాయుడిగారి తుపాకీల్లోంచి గుండు దూసుకెళ్ళినట్లు... పెద్దపులి గాండ్రిస్తూ చీకట్లో పరుగులెట్టినట్లు...

"గురి తప్పినట్లుంది రాజీగా..." అంటూ వెంటనే సెర్చ్‌లైట్ వేసి చెట్టు కిందకు చూశారు రాయుడుగారు. రాయుడిగారి తుపాకీ గుండు వృధా కాదనే నమ్మకం నాకుంది. ఏం చెప్పలేకపోయాను.

మేకలేదు. మేకకు కట్టిన తాడు మాత్రం తెగి క్రిందపడి వుంది. పులి మేకను లాక్కొని పారిపోయింది. లైటు కందినంత మాత్రం చుట్టూ చూశారు. ఎక్కడా... ఏలాటి కదలికలు లేవు. వాతావరణం నిశబ్దంగా వుంది.

## ఇష్టపదులు

ఆకాశమే తానంటూ రవి
ఆక్రోశమే నాదంటూ భువి
అవకాశమే నేనంటూ "భైరవి"
అందలాల పహారాలో పాపాలభైరవి.

సహజమ్ముడు చస్తున్నా పస్తులతో
స్వార్థోన్మత్తుడు మురుస్తాడు ఆస్తులతో
నర రుధిరంపాన మరిగిన పులి
కోరదా తన పేగు బంధపు బలి.

నగరం నడిబొడ్డున వెలసిన
చంబల్ లోయలూ, స్వార్థపుర
బలిదాన సత్రాలు

ప్రజా సర్వెంట్సుకు విలాస విడిది
విహార క్షేత్రాలు

ఏదయ్యా నీ సామ్యవాదం
పొద్దుపొడవని ముద్దు నినాదం.

ప్రభుత్వ యంత్రాంగంనిండా 'బామ్మర్దులు'
నానావిధ భ్రష్టమార్గ పయన సమర్థులు
తొక్కిపట్టి నొక్కిపట్టి అణచిన గడ్డిపోచ.

అప్పళంగా ఆరగించేవాడికిది 'డెమోక్రసి'
చెప్పుకుతిరిగేవాడికి 'వెర్రోక్రసి'
చెప్పుచ్చుకు ఎగబడేవాడికి 'మా బోక్రసి'
తప్పించుకు తిరిగేవాడికిదే ధన్యోక్రసి.

— డాక్టర్ పి. వి రమణ

"చెట్టు దిగి చూద్దామంటావా ?"

"వద్దండయ్యా ! ఎలాగూ ఇంకో రెండు గంటల్లో తెల్లారిపోతుంది."

రాయుడుగారు అలాగే కూచుని వున్నారు ఇక యీ పూట పులి రాదని తెలుసు. నాకేమో నిద్రొస్తోంది. బిస్కెట్ పాకెట్ విప్పి, రాయుడిగారి చేతిలో పెట్టాను. ఆయన వద్దన్నారు పులికి తన తుపాకీగుండు తగల్లేదా? తగిల్తే మరి పులి ఏమైంది? ఎక్కడైనా పొదలో వుండివుందా ? మరి మేకను కూడా లాకెళ్ళిందంటే పులికి దెబ్బ తగల్లేదేమో ! అదో నిర్లిప్తతతో వున్నట్లున్నారు రాయుడుగారు.

తెల్లారింది. అడవంతా మేల్కొని ఒక్కసారి వళ్ళు విరుచుకుంది. పక్షుల కిలకిలతో కోలాహలం.

మంచె దిగాం...

చెట్టుకింద మేక రక్తపు మరకలు భూమ్మీద వున్నాయి. ఆ మరకల ఆధారంగా ఎండిన ఆకుల మీదుగా కొంత దూరం వెళ్ళి చూచాం. ఆ పైన మరకలు కనిపించలేదు. అడుగులూ అవుపించలేదు. చుట్టూవున్న పొదల్లోకి రాళ్ళు విసిరి చూశాం. లాభం లేదు. పులి తప్పుకొని దూరంగా పారిపోయింది.

"ఇక వెళ్దామటండీ !"

ఒక్కసారిగా రాయుడుగారు నా వైపు కళ్ళెర్ర చేస్తూ నన్ను తన తుపాకీతో కాల్చేలా చూశారు. నా గుండె గుభేలుమంది.

రాయుడుగారి ఆవేశం అగ్నిపర్వతంలా బ్రద్దలయింది.

"ఒరే ! రాజిగా !! పులి ఎక్కడున్నా యీ అడవిలోనే వుండాలి. మనకు మాటు అవసరంలేదు. ఎదురునిల్చి కాలుద్దాం ..." అంటూ ఆవేశం కల్గించిన ఆయాసంతో రొప్పుతూ ముందుకు నడుస్తున్నాడు. రాయుడుగారికి ఎదురుచెప్పలేను. అసమర్థుణ్ణి.

రాయుడుగారి తుపాకీకి గురి తప్పడం మొదటిసారి. తన ఓటమిని అంగీకరించలేక పోతున్నాడు. ఎంతో నమ్మకంతో రంగారెడ్డిగారు యీ పనిని తనకు కట్టబెట్టారు. అల్లాంటపుడు తన అసమర్థతను వేంకటాయపాలెం జనం

# రాయుడిగారి వేట

ముందు చూపలేరు. అందుకని పట్టుదలపట్టాడు, ఎలాగైనా పులిని కాల్చి చంపవలసిందేనని.

నీళ్ళచెలమ వరకు ప్రతిపొద, గుబురు తడుముకుంటూ వెళ్ళాం. చెలమదగ్గర చుట్టూ చూశాం. పులి అడుగుల గుర్తుకాని మేక మాంసపు ముక్కలు గాని కనపడలేదు అప్పటికి తొమ్మిది దాటింది ఈసారి తూర్పుదిశగా బయల్దేరాం చూడాల్సినవన్నీ చూశాం. ఉత్తరదిక్కుగా, దక్షిణదిక్కుగా, వెతికాం. ఊహూ ! పులి జాడలే కనిపించలేదు. పదకొండు దాటింది. ఎండపొడ చాలవేడిగావుంది. రాయుడుగారు వున్నట్లుండి వుగ్రస్వరూపుడయిపోయాడు. ఓ పొదలో ఆకులు కదిలినట్లయ్యాయి. రాయి విసిరాను. ముళ్ళపంది బయటకు వచ్చింది ధన్‌మని రాయుడుగారు పేల్చేశారు. ముళ్ళపంది ముక్కలై మట్టిలో వెదజల్లిపడింది. ఆవేశంతో రొప్పుతున్నాడు... కళ్ళు ఎర్రబడి రక్తం కారేలా వున్నాయి. మనిషి వూగిపోతున్నాడు... చింతచెట్టు మీద కొంగ నిలబడివుంది... 'ధన్' మంటూ కాల్చేశారు రాయుడుగారు.. నాకెంతో ఆశ్చర్యంగా వుంది. రాయుడుగారి చూపు పిచ్చుకలపై పడిందేనని... బ్రహ్మాస్త్రం వదులుతున్నారు. రాయుడుగారి దంతా పులి, సింహం, ఎలుగు, చిరుత షికారీయే... మరి ఆవేశం అలా చేస్తోంది. రెల్లుగడ్డి దుబ్బుల్లోంచి ఓ తెల్లటి అందంగా మెరుస్తున్న కుందేలు జంట గునగునమంటూ వచ్చికలోకి వచ్చాయి. రాయుడిగారి చూపు వాటిమీద పడింది. ట్రిగ్గర్ నొక్కాడు... పది అడుగుల దూరంలో ఎగిరిపడ్డాయి ఆ జంట... మాంసము మట్టిలోపడి దొర్లింది. ఆవేశం తగ్గేవరకు రాయుడుగారు అలానే పేలుస్తుంటాడు... తప్పదు. పులి జాడ తెలియలేదు గాని అప్పటికే ఓ పదిదాకా జంతుజాలాన్ని పేల్చి పారేశాడు. నాకు విసుగేస్తోంది... ఎండ ఎక్కువయింది... ఇంతట్లో... విప్పచెట్టు క్రింద నీడన ఒక నెమలి పురివిప్పి ఆడుతోంది. ఎంతో అందమైన దృశ్యమిది... రాయుడిగారి దృష్టి తప్పిందామనుకున్నాగాని, అంతకుముందే రాయుడుగారు నెమలిపై గురి నిలిపి, ట్రిగ్గర్‌పై చేతి వేలును వుంచి నొక్కబోతున్నాడు.

ఒక్కసారిగా రాయుడిగార్ని ప్రక్కకు తోసేసాను గురి తప్పి, ఆకాశంలోకి పేల్చబడింది

"ఒరేయ్ ! రాజిగా . నన్ను నీవు ." అంటూ నా చొక్కా లాగిపట్టుకుని, నా కుడిచెంప, ఎడమచెంప తన బలమైనచేతో వాయించేస్తున్నాడు కోపంతో వణుకుతున్నాడు ప్రతి దెబ్బా నన్ను బాధ పెడుతూనే వుంది. నేను ఎదురు చెప్పడం లేదు. నా కళ్ళల్లో నీళ్ళు సుడులు గట్టి చెంపల మీదుగా జారుతున్నాయి. రాయుడిగారిలో ఆవేశం తగ్గింది అటు వైపుకు ముఖం తిప్పకొని నిలబడ్డాడు

"లేదండయ్యా ! నెమలి.. దేవతా పక్షి అయ్యగారూ ! దాన్ని చంపితే మీ కుటుంబానికి గొప్ప కీడు జరుగుతుందని ఏదో శాపముందటయ్యా ! అందుకని..." అంటూ ఏడుస్తూ రాయుడుగారి కాళ్ళమీద పడ్డాను.

"ఒరే ! రాజిగా..." అంటూ నన్ను లేవనెత్తారు. ఆ పిలుపులో ఎంతో ఆప్యాయత.. ఆత్మీయత వుంది.

"నన్ను క్షమించరా..." అంటూ నా చేతుల్లో తన చేతుల్ని పెట్టాడు.

"అంత మాటనకండయ్యా !" అంటూ దూరంగా జరిగాను.

దూరంగా మనుష్యులు వస్తున్నట్లు ఏదో అలజడి.

"పద... వెళ్దాం" అంటూ రాయుడుగారు ముందుకు నడుస్తుంటే, నేను అనుసరించాను.

దార్లో ఎదురయింది...రంగారెడ్డిగారూనా.. మా అంకిరెడ్డీను... —

"అయ్యగారూ ! పెద్దమ్మగోరికి ఏదో పురుగు కరిచిందటయ్యా ! ప్రమాదంగా వుందట. మిమ్మల్ని తోడెట్టుకు రమ్మన్నారు" అంటూ వగురుస్తూ చెప్పాడు అంకిరెడ్డి.

రాయుడ గారు నా ముఖంలోకి అదోరకంగా చూశారు.

పరుగులెత్తాం. సవారీ బండి పరుగులెత్తింది. రెండు గంటల్లో మా వూరు చేరుకున్నాం.

రాయుడిగారింటి ముందు చాల జనం వున్నారు. రాయుడిగార్ని చూసి అందరూ పక్కకు తప్పుకొని లోనికి దారిచ్చారు.

రాయుడిగారి తల్లి ఓ మంచంమీద పడివుంది. నోట్లో తెల్లటి నురగ, క్షణక్షణానికి పాలిపోతున్న ముఖం.


శేషారావు మా వూరి పోస్టు మాస్టర్, టీచర్, ఆపైన డాక్టరు కూడాను. ఏదో ఇంజక్షన్ యిచ్చాడు.

కొద్దిసేపటికి నురగ తగ్గింది. పాలిపోతున్న ముఖంలో జీవకళ మెలమెల్లగా రాసాగింది.

ఇంకో అరగంటకుగాని కళ్ళు తెరవలేదు. వేడివేడి పాలు యిచ్చారు. కొంచెం నెమ్మదించింది. జనం అంతా వెళ్ళిపోయారు.

రాయుడుగారిలో ఒక్కసారిగా చలనం కల్గింది. సవారీ బండ్లోంచి తన తుపాకీని తెమ్మన్నాడు. అంకిరెడ్డి తెచ్చియిచ్చాడు.

ఒక్కసారిగా తన బలమంతా చూపించి,



## విద్యార్థిలోకం వ్యాసరచన పోటీలో మూడవ బహుమతి రు. 500/-లు పొందిన వ్యాసం

# మా విద్యార్థిలోకం ఆశయాలు

విస్తారమైన విద్యార్థిలోకానికి అనేక ఆశయాలూ ఉన్నాయి, ఆ ఆశయాలు సమస్యలుగానూ ఉన్నాయి సమస్యలు తీర్చడం పెద్దల కర్తవ్యం. పూర్వం కన్న ఇప్పుడు అన్ని రంగాలలోను విద్య విస్తృతమయింది. ముందుకు పోవాలని ప్రతి విద్యార్థి ఉరకలు వేస్తున్నాడు. ఏదో చెయ్యాలని, దేశానికేదో సాధించాలని విద్యార్థిలోకం ఆశయం. అయితే అవకాశాలు తక్కువమూలాన్ని ఆ ఆశయానికి అడ్డు ఏర్పడుతోంది. అయితే విదేశాలలో అందరికీ ఎలా ముందుకుపోయే అవకాశాలు ఉన్నాయో ఆ విధంగానే మన దేశంలో కూడా ఆటంకాలు తొలగించి అవకాశం కల్పించాలి.

నేటి దేశ పరిస్థితులదృష్ట్యా విద్యావసరాలు విస్తరింపచెయ్యాలి. విద్యకు ప్రభుత్వం ఎంత ఖర్చుపెట్టినా వృధాకాదు. ఎందుకంటే దేశ భవిష్యత్తుకు పునాదిరాళ్ళు ఆ విద్యార్థులే. ప్రభుత్వం కూడా లెక్కలేనన్ని విద్యాలయాలు నెలకొల్పడం కాదు. సమర్థవంతమయిన నిర్వహణలో, వసతితో, బోధనోపకరణములతో, సమర్థులయిన ఉపాధ్యాయవర్గంతో నడపాలి. దానికి అవరోధంగా సమస్యలు వచ్చినా అవి చిన్నవే కనుక డబ్బు వెచ్చించి వాటిని సరిదిద్దుకోవచ్చు కనుక బడ్జెట్‌లో మిగిలినవాటికి తగ్గించుకొని దీనికి వెచ్చించుట అత్యంతావశ్యకము. ఉదాహరణకు తాడికొండ, నాగార్జున సాగర్ మొదలగు రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలు ఎంత ప్రగతిపథంలో ఉన్నాయో, మిగిలినవి ఎంతగా దిగజారి ఉన్నాయో ఎవరికీ తెలియని విషయం కాదు. అయితే అక్కడి అవకాశాలు అన్ని పాఠశాలలకు, కాలేజీలకు ఎందుకు కలగజేయకూడదు ? అలా చేస్తే అన్ని పాఠశాలలు అట్టి ప్రగతిని సాధించవచ్చును కదా! దానివల్ల ఎంతో తెలివైన విద్యార్థులను దేశానికి అందించవచ్చును కదా ! వారివలన దేశము యొక్క పేరు ప్రతిష్ఠలు ఎంతగానో విస్తరింపబడును కావున అవకాశములు కల్పించుట ప్రభుత్వ కర్తవ్యము.


చదువు పూర్తిచేసుకున్న విద్యార్థి బ్రతుకు తెరువు కోసం ఉద్యోగాన్ని అభిలషిస్తాడు. అందరికీ ఉద్యోగాలు చూపించడం ప్రభుత్వానికి పెద్ద సమస్య అయింది దేశంలో అడుగడుగునా విద్యాలయాలు స్థాపించినప్పుడు వారికి ఉద్యోగాలు చూపించవలసిన కర్తవ్యం కూడా ప్రభుత్వానికి ఉన్నది. ఆ కర్తవ్యాన్ని ఎదుర్కొనడానికి అనేక సమస్యలుండవచ్చును. బ్రతుకుతెరువుకు ఉపయోగించని విద్యావిధానమువలన నిరుద్యోగసమస్య మరీ గడ్డుగా తయారయింది. నిరుద్యోగులందరికీ భృతి ఇవ్వడానికి ప్రభుత్వం ఆర్థికంగా తట్టుకోలేక పోవచ్చును. అందుకే విద్యావిధానములో అడుగడుగునా మార్పులు కాకుండా మేధావంతులు అన్ని కోణాలనుండి ఆలోచించి సమగ్రమైన, స్థిరమైన ఒక విధానం రూపొందించాలి కనీసం డిగ్రీ తీసుకున్న విద్యార్థి ఏదో ఒక వృత్తిని చేపట్టే అవకాశం ఉండాలి ఆ వృత్తిలో పరిపూర్ణత అతను చదువు పూర్తిచేసేలోగా సిద్ధించాలి. ఆ విధంగా ప్రతి విద్యార్థికి వృత్తి విద్యాప్రావీణ్యం వచ్చి ఉంటే అంతగా నిరుద్యోగ సమస్య ఉండదు అతను బ్రతకడానికి ఒక సోపానం ఏర్పడుతుంది ఇది విద్యావిధానంలో తీసుకురావలసిన పెద్ద మార్పు.

సాంకేతిక విజ్ఞానంలో దేశాలన్నీ పరుగులు తీస్తున్నాయి దేశంలో మేధావంతులున్నప్పుడే ఆ పరుగును అందుకోవడం—వాటితో సమానంగా సరితూగడం జరుగుతుంది. అన్ని శాఖలలోను ఉన్నత విద్యాభ్యాసములలో మేధావంతులకే ప్రాధాన్యత ఈయవలెను ఏవో పద్ధతుల ద్వారా ఎక్కువ మార్కులు వచ్చినవారికి లభ్యముకాని సీటు, అతి తక్కువ మార్కులు వచ్చినవారికి లభ్యమగుట హాస్యాస్పదమగును దానివలన దేశ ప్రగతికి కావలసిన మేధావంతులు లభ్యముకారు. దానివలన సాంకేతిక విజ్ఞానంలో దేశము వెనుక పడును. అవకాశము ఉండి ""ందనివారిలో నిరాశానిస్పృహలు ఏర్పడును. అట్టివాటికి ప్రభుత్వము అవకాశమీయరాదు

విద్యాలయములు పవిత్రమైన దేవాలయముల వంటివి ఆ స్థాయి, ఆ సాంప్రదాయము నెలకొన్నపుడే వాటికి సార్థకత సిద్ధించును. ఎన్ని సమస్యలున్నను విద్య అత్యంతావశ్యకము కనుక ప్రభుత్వము దీనిపై వెచ్చించుట తప్పనిసరియని భావించవలెను. విద్యార్థులనుబట్టి భవనముల నిర్మాణము, విద్యార్థులనుబట్టి ఉపాధ్యాయుల పెంపుదల — ప్రయోగశాలలు — మొదలగు హంగులన్నీ ఉన్నపుడే ఆశయసిద్ధి జరుగును.

ఉపాధ్యాయ — విద్యార్థి అవినాభావ సంబంధము కూడ దినదినాభివృద్ధి చెందవలెను గురుకులాశ్రమములలోవలె మంచి విద్య నేర్పవలెనన్నది విద్యార్థిలోకము యొక్క ఆశయము. అది ఉపాధ్యాయులపైననే ఆధారపడియున్నది సామాన్య మానవుని కంటే ఎన్నో రెట్లు మెరుగైన జీవితమును గడుపు ఉపాధ్యాయులు తాముకూడ తృప్తిచెంది ప్రత్యేక బోధనకు అవకాశమివ్వకుండా, అందరినీ సమదృష్టిలో నుంచుకొని తరగతులలో మనస్ఫూర్తిగా బోధన జరిపినపుడే సత్ఫలితములు వచ్చును అట్టిది కట్టుదిట్టముగా జరుపు విషయమున ప్రభుత్వ పర్యవేక్షణ అవసరము. ★

### రచయిత పరిచయం



"1964 లో జననం

తండ్రి : మల్లాది సూర్యనారాయణ

తల్లి : మల్లాది ప్రసాదలక్ష్మి

విద్యాభ్యాసం : బి. కాం. 2వ సంవత్సరం అత్తిలి ఎస్. వి. ఎస్. ఎస్. ఆర్ట్స & సైన్సు కాలేజీలో.

చిన్న చిన్న కథలు వ్రాయడం, వ్యాసాలు వ్రాయడం సరదా. బొమ్మలు గీయడంలో కూడా కాస్త పరిచయం ఉంది.

పత్రికలు చదవడం — విమర్శలు వ్రాయడం అలవాటు.

నా వ్యాసానికి బహుమతి ఇచ్చిన ఆంధ్ర సచిత్ర వారపత్రికకు నా కృతజ్ఞతలు."

—ఎం ఎస్. భాస్కర్

---

తుపాకీని ఓ బండకేసి బాదాడు. రెండు ముక్కలయింది.

అందరూ ఆశ్చర్యపోయారు. దేవతా పక్షిపై గురి పెట్టిందానికే తన తల్లికి యింత ఆపద కల్గిందే, నిజంగా కాల్చుంటే తన తల్లి తనకు దక్కేదా ? దీనికంతకూ కారణం వేట కల్గించిన ఆవేశం. 'వద్దు ... వేటవద్దు ...' అనుకుంటూ తుపాకీని రెండు ముక్కలు చేశారు రాయుడుగారు ఆ నిజం నాకు తెలుసు.

"అయ్యగోరూ..." అంటూ కొమిరిగాడు పరిగెత్తుకు వచ్చాడు.

"మీరు చంపిన పులి మీరు మంచెకట్టిన టేకు చెట్టుక్రింద ముళ్ళ పొదలో పడి వుందండీ..." అంటూ చెప్పుకుపోతున్నాడు కొమిరిగాడు.

రాయుడుగారు చిరునవ్వుతో ఓ అరక్షణం కళ్ళు మూసుకున్నాడు.

నా కెంతో సంతోషంగా వుంది. . రాయుడు గారి గురి తప్పలేదని. అయినా బాధగా వుంది. రాయుడిగారితో యిక వేటకెళ్ళే పని లేదేమోనని. అవసరం కూడా లేదేమోనని. ★

సీరియల్

# జీవన్మృతులు

ఇంగ్లీషు మూలం: బ్రామ్ స్టోకర్

స్వేచ్ఛానువాదం: కొలను వెంకట దుర్గాప్రసాద్



## (గత సంచిక తరువాయి)

ఎక్కడో రోడ్డుకు దూరంగా, పొలాల మధ్య ఓ ఇంట్లోంచి కుక్క అరుపు వినిపించింది. దాని అరుపు భయంతో కూడిన ఏడుపు లాంటిది. ఆ కుక్క ఏడుపు విని మరో కుక్క మొదలెట్టింది. దాన్ని విని మరొకటి. తర్వాత మరొకటి. ఏవిటో వూరంతా కుక్కల అరుపులతో నిండినట్టు భ్రమించాను. మొదటి కుక్క అరుపు విని గుర్రాలు కూడా భయపడ్డాయి, కానీ బండి అతను వాటిని భయం లేదన్నట్టుగా తట్టాడు. అవి భయాన్ని తగ్గించుకుని ఇంకా వేగంగా పారిపోవటం మొదలెట్టాయి. బండి కిరువైపులా పర్వతాలే. ఎక్కడో దూరంగా మళ్ళీ అరుపులు వినవచ్చాయి. ఈసారి అవి కుక్కలవి కావు. తోడేళ్ళవి. ఈ అరుపులకు నాకు భయం పుట్టుకొచ్చింది. వెంటనే బండిలోంచి దూకి పారిపోదామనిపించింది. గుర్రాలూ అంతే. పిచ్చి ఎక్కినట్టు పరిగెత్తసాగాయి. బండి అతను ఎంతో కష్టంమీద వాటిని నడపగలుగుతున్నాడు. కాసేపటికి నా చెవులు ఆ తోడేళ్ళ అరుపులకు అలవాటు పడినట్టు అయిపోయి కదలకుండా కూర్చున్నాను.

గుర్రాలు కూడా బండివాడు చెప్పినట్టు మామూలుగా పరుగెడుతున్నాయి. బండివాడు ఒకచోట క్షణం ఆపాడు. బండిదిగి గుర్రాలను ఎంతో ఆప్యాయంగా తట్టి చెవుల్లో ఏదో చెప్పాడు. చల్లబడి పోయాయి. వాటి భయం ఎక్కడికి పోయిందో ? మళ్ళీ బండివాడు తన చోటులో కూర్చుని గుర్రాలను అదిలించాడు. అప్పటి వరకు కాస్త వెడల్పుదారిన వెళుతున్న బండి, కుడికి మలుపు తిరిగి ఇరుకు సందు గుండా వెళ్ళసాగింది. రెండు వేపులా చెట్లు దట్టంగా వుండి వాటి చిటారు కొమ్మలు ఎదురు చెట్లతో కలిసి పోయినయి. ఏదో సొరంగం గుండా వెళుతున్నట్టు అనిపించింది. రెండు వేపులా కొండలు అంతులేకుండా వున్నాయి. గాలి కొండల మధ్య, చెట్లగుండా వీస్తూ చప్పుడు చేస్తోంది. గాలి మెల్లమెల్లగా చల్లబడి, మంచుగా కురవసాగింది. ప్రకృతి అంతా అప్పుడే మంచుకు తెల్లబడసాగింది. కుక్క అరుపులు ఈ గాలికి వినిపిస్తూనే వున్నాయి. తోడేళ్ళ అరుపులు ఇంకా దగ్గర పడ్డాయి. అన్ని వేపుల నుంచి తోడేళ్ళు మా బండి చుట్టుముట్టుతాయా అనిపించింది. నాలో భయం పెరిగిపోసాగింది. బండి అతను గుర్రాలు బెదిరిపోకుండా పోనిస్తున్నాడు.

ఆ సమయంలో నేను చీకట్లో ఎడమ వైపుకు చూసాను. ఒక నీలిమంట. బండి అతను కూడా దాన్ని చూశాడు. వెంటనే అతడు గుర్రాలను ఆపి, బండిమీదనుంచి దూకి గబగబా చీకట్లోకి పారిపొయ్యాడు. నాకేం చెయ్యాలో తోచలేదు. ఓ పక్క తోడేళ్ళ అరుపులు. ఇట్లా భయంతో వణికి పోతున్న సమయంలో బండి అతను మళ్ళీ తిరిగి కనిపించాడు. మాట్లాడకుండా బండి ఎక్కి, ప్రయాణం సాగించాడు. దారిపొడుగునా అట్లాగే నీలిమంటలు కనిపించి మాయమయ్యాయి. అలా కనిపించినప్పుడల్లా, బండి అతను చీకట్లోకి వెళ్ళి రావడం చేసాడు. వస్తూ ఏవో రాళ్ళలాంటి వస్తువులను తీసుకువచ్చాడు.

బండిని మరొకచోట ఆపాడు. మళ్లా చీకట్లోకి వెళ్ళి చాలాసేపు రాలేదు. గుర్రాలు భయంగా సకిలించడం, ఎత్తుకు ఎగరడం మొదలెట్టాయి. అవి ఎందుకు అట్లా చేస్తున్నాయో తెలీలేదు. అప్పటివరకు నల్లటి మబ్బులో వున్న చంద్రుడు ఒక్కక్షణం బయటకు వచ్చాడు. అప్పుడు చూసాను. తెల్లటి పళ్ళతో, ఎర్రటి నాలుకను చాపి, ఎన్నో తోడేళ్ళు, బండిని చుట్టుముట్టాయి. అవి అరవడంలేదు. నిశ్శబ్ద నిశీధిలో వాటిని పరిశీలించడం అతి భయంకరమనిపించింది. నా కాళ్ళూ చేతులు ఆడలేదు. ఇంతటి భయంకరమైన ప్రమాదాన్ని ఒక్కమనిషి ఎట్లా ఎదుర్కోగలడు ?

చంద్రుని వెలుగులో అవి అరవడం

**జరిగిన కథ—1 :** జోనాధన్‌హార్కర్ తన డైరీలో వ్రాసుకొన్న కథనం రచయిత వివరిస్తున్నారు. అతను ''డ్రాకులా ప్రభువు''ను కలుసుకోవడానికి బండిలో బయలుదేరుతాడు. అక్కడివారు చాలామంది ముఖ్యంగా ఆ ముసలావిడ డ్రాకులా దగ్గరికి వెళ్లవద్దని ప్రాధేయపడుతుంది. కానీ అతని నిర్ణయం మార్చుకోడు. కొంత దూరం ప్రయాణం అయ్యాక అతను డ్రాకులా పంపించిన బండిలోకి షిఫ్ట్ అవుతాడు. ఆ బండి తోలేవాడు చాలా క్రూరంగా వున్నట్లు అతనికి అనిపిస్తుంది. సరిగ్గా సమయం పన్నెండు గంటలు అవబోతున్న సమయంలో 'ఏం జరుగుతుందో' అనే సందేహం అతనిలో కూడా భయాన్ని కలిగిస్తుంది.



మొదలెట్టాయి. గుర్రాలు భయంగా సకిలిస్తూ అటూ ఇటూ గెంతుతున్నాయి. కాస్త ధైర్యం తెచ్చుకుని బండి అతను కోసం కేకవేసాను. బండిలో వుండే అరుస్తూ, బండి తలుపుల్ని శబ్దం చేస్తూ, తోడేళ్ళను బెదిరించడానికి ప్రయత్నం చేసాను. ఇంతలో బండి అతను ప్రత్యక్షమయ్యాడు రోడ్డుమీద. ఆతను తన పొడుగాటి చేతులతో తోడేళ్ళను అదిలించి పారేసాడు. అవి పారిపోయాయి. మళ్ళీ మా ప్రయాణం మొదలయింది. నాకంతా అగమ్యగోచరంగా వుంది. భయంతో మాట్లాడలేకపోయాను. అట్లా చాలాసేపు బిగుసుకుపోయాను. బండి వెళుతూ వెళుతూ ఒక పాడుబడిపోయిన పెద్దకోట దగ్గర ఆగేసరికి కాస్త తేరుకున్నాను. ఆ కోటలోంచి కాస్త వెలుతురు వస్తోంది.

* * *


## జీవన్ స్మృతులు

మే 5 : బాగా నిద్ర పట్టేసిందనుకుంటాను. మెలకువగా వున్నట్టయితే, కోటకు వచ్చిన దారి బాగా కనిపెట్టగలిగి వుండేవాడ్ని. చీకట్లో చూస్తే, ఆ కోట తాలుకు స్థలం బాగా పెద్దదనిపించింది. మా బండి ఆగింది. బండి అతను క్రిందికి దూకాడు. నా దగ్గరకు వచ్చి నేను దిగడానికి చెయ్యి అందించాడు అతని చెయ్యి తాకినప్పుడు మళ్ళా అతని చెయ్యి యొక్క బలం అనుభవమయింది. అతని చెయ్యి నిజంగా ఉక్కు. తలుచుకుంటే అది నా చేతిని పిప్పిచెయ్యగలదనిపించింది. నా సామాను బండిలోంచి దింపి నేలమీద పెట్టాడు. నేను ఒక ద్వారం దగ్గర నిలబడ్డాను. అది చాలా పెద్ద ద్వారం. చాలా పురాతనమైనది. తలుపులకు ఇనుప మేకులు దిగేసి వున్నాయి. అవి సూదిగా బయటకు పొడుచుకుని వచ్చాయి. గుమ్మం రాతితో కట్టబడింది. కాస్తంత వెలుతుర్లో కూడా గుమ్మం చెక్కబడిన పనితనం చూడగలిగాను. పాతది కావడంవల్ల కొంత పాడయినట్టు కనిపించింది. బండి అతను మళ్ళా బండి ఎక్కి గుర్రాలను అదిలిస్తూ చీకట్లో కలిసి పోయాడు.

ఒక్కడ్నే నిలబడ్డాను. ఏం చెయ్యాలో తెలీలేదు. తలుపు కొట్టడానికి వీలులేదనిపించింది. పోనీ గంటలాంటి సాధనం ఏమైనా వుందా అంటే, అదీలేదు. గట్టిగా పిలుద్దామా అనుకుంటే, నా పిలుపు లోపలవాళ్లకు వినిపించదేమోననిపించింది. అట్లా చాలాసేపు నిలబడిపోయాను. నాలో ఎన్నో భయాలు, సందేహాలు. నేను ఎటువంటి ప్రదేశానికొచ్చానో, ఎటువంటి మనుషులను కలుస్తానో? నా ప్రయాణం ఎంత సాహసమైంది ? లండన్‌లో వున్న ఒక ఎస్టేటును ఒక విదేశీయుడికి అమ్మడం కోసం మా వకీలు తరఫున వచ్చాను. నాది గుమస్తా ఉద్యోగం. కానీ మీనాకు అది ఇష్టంలేదు. నేను లండన్ వదిలేముందే తెలిసిన విషయం — నేను పరీక్ష పాసయ్యాను. ఇప్పుడు నేను వకీలు. ఏమిటో ఆలోచనలు. ఓసారి కళ్ళు నులుముకున్నాను, నిద్ర వస్తున్నట్టు అనిపిస్తే. ఇలాంటి కాళరాత్రి ఇట్లాంటిచోట నిలబడ్డం చాలా భయంకరమైన విషయం. నేను ఇంట్లోనే వున్నట్టు, ఇదంతా కల అయినట్లుగా వుంటే ఎంత బాగుండును. నాకు నేను గిచ్చుకున్నాను. ఇది కల కాదు. నిజమే! ఇలా ఎంతసేపు నిలబడాలి ? తెల్లవారేవరకూనా ?

ఇట్లా అనుకుంటూ వుండగా, తలుపు అవతల వైపునుండి ఎవరిదో నడక శబ్దం వినపడింది. తలుపు సందుల్లోంచి వెలుతురు కనపడసాగింది. గొలుసులు, ఇనపగడలు తీసిన పెద్ద చప్పుడయింది. తాళంచెవి తాళం కప్పలో వుంచి తిప్పగా వచ్చిన పెద్దచప్పుడు వినిపించింది. తలుపులు తెరుచుకున్నాయి.

తలుపుల మధ్య ఎదురుగుండా ఒక పొడుగాటి మనిషి నిలబడివున్నాడు. గడ్డం చక్కగా చేసుకున్నాడు. తెల్లటి మీసాలు మాత్రం చాలా పొడుగ్గా పెరిగాయి. పీక నుండి పాదాలవరకు నల్లటి దుస్తుల్లో వున్నాడు. మరో రంగు జాడలేదు అతన్ని వొంటిమీద. అతని చేతిలో పురాతన వెండి



దీపం వెలుగుతోంది. దానికి చిమ్నీలేదు. గాలికి రెపరెపలాడుతోంది. అతడు చెయ్యి చూపిస్తూ స్వాగతం పలికారు. అతనికి ఇంగ్లీషు బాగా వచ్చుననిపించింది.

'స్వాగతం ! యదేచ్ఛగా లోపలికి రావచ్చు!' అన్నాడు. అతను వున్న చోటునుండి కదల లేదు. విగ్రహంలా కనిపించాడు. నేను ముందుకు కదిలాను. అతను అప్పుడు ముందుకు కదిలాడు. వెళుతూ అతను నా చెయ్యి పుచ్చుకున్నాడు. అబ్బ ! ఎంత చల్లగా వుంది ! అసలది బ్రతికివున్నవాడి చెయ్యేనా అనిపించింది.

''మా ఇంటికి స్వాగతం ! హాయిగా రండి ! క్షేమంగా వెళ్లండి. మీ సంతోషాన్ని నాకు ఇవ్వండి !'' అన్నాడు. అతను నా చెయ్యిని కదిలించాడు. అతని చేతి స్పర్శ అనుభ విస్తుంటే బండి అతను గుర్తుకొచ్చాడు. అదే బలం ! బండి అతన్ని నేను సరిగా చూడ లేదు. బహుశా అతనే ఇతను అయి వుంటాడు. అయినా ఆ విషయం తెలుసుకునే నిమిత్తం, అడ్డమైన ప్రశ్న ఒకటి వేసాను !

''డ్రాకులా ప్రభువు మీరేనా !''


అతను వినయంగా తలవంచాడు. ''అవును. నేనే డ్రాకులా. స్వాగతం చెపుతున్నది నేనే, మిస్టర్ హార్కర్ ! లోపలికి రండి ! బాగా చలిగా వుంది ఇప్పుడు. మీరు కాస్త తిని విశ్రాంతి తీసుకోవడం అవసరం'' అతను చేతిలోని దీపాన్ని పక్కనే ఒక గోడమీద వుంచాడు. గుమ్మం బయటకు వెళ్లి నా సామాను పట్టుకొని వచ్చాడు. నేను వారించ బోయాను.


''ఫర్వాలేదు. మీరు మా అతిథి. బాగా ప్రొద్దుపోయింది కదా. మా వాళ్ళు ఎవరూ ఇప్పుడు వుండరు. కాబట్టి, మీ బాగోగులు నేనే చూసుకోవాలి. పదండి!'' అన్నాడు. దారి వెంబడి నడిచాను అతనితోపాటు. కొన్నిమెట్లు ఎక్కి మరో దారి చేరుకున్నాం. అక్కడి గచ్చునేల మా నడక శబ్దాన్ని ఎక్కువ చేసింది. అట్లా నడుచుకుంటూ ఒక పెద్ద తలుపు దగ్గర ఆగాము. అతను తలుపుల్ని తెరిచారు. గది అంతా చక్కని దీపాల వెలుతురుతో నిండివుంది. అక్కడ భోజనం బల్ల, దానిమీద భోజనం వున్నాయి. పక్కనే ఎర్రని మంటలతో చలి కాచుకునే పొయ్యి వుంది. లోపలికెళ్లాం.

నా సామాను క్రిందికి దించారు. తలుపుల్ని మూసేసాడు. ఓ ప్రక్కకు వెళ్లి మరో తలుపును తెరిచాడు. అది చిన్న గది. అందులో ఒక్కటే దీపం. ఆ గదికి ఒక్క కిటికీ లేదు. ఆ గది దాటి మరో తలుపు తెరిచాడు. నన్ను పిలిచి లోపలికి వెళ్లమన్నాడు. అది పెద్ద పడక గది. దీపాల వెలుతురు చక్కగా వుంది అక్కడ. చలి కాచుకున్నే పొయ్యి అక్కడ కూడా వుంది. అతను సామాను లోపలికి తెచ్చిపెట్టాడు. 'ప్రయాణ బడలిక పోవడానికి కాస్త మొహం కడుక్కోండి. తర్వాత భోజనానికి రండి !' అంటూ తలుపులు వేసి వెళ్లాడు.

అతని హృదయపూర్వకమైన స్వాగతం అనుభవించగానే, నాలోని భయాలు, సందేహాలు మాయమయిపోయాయి. కాస్త తేరుకున్నాను. ఆకలితో సగం మాడిపొయ్యాననుకున్నాను. గబగబా మొహం కడుక్కుని అవతలి గదిలోకి వెళ్లాను.

డ్రాకులా పొయ్యి పక్కన గోడకు ఆనుకుని నిలబడ్డాడు. స్వాగతం పలుకుతున్నట్టుగా భోజనం బల్లవేపు చెయ్యి చూపించాడు. 'మీరు భోంచెయ్యండి. క్షమించాలి, నా భోజనం ఎప్పుడో అయిపోవడంవల్ల, ఇప్పుడు నేను మీతో కూర్చోలేను!' అన్నాడు.




మా వకీలు హాకిన్స్ ఇచ్చిన కవరును అతనికి ఇచ్చాను. అతను కవరు తెరిచి ఉత్తరం చాలా గంభీరంగా చదివాడు. తర్వాత దాన్ని నాకిచ్చాడు నవ్వుతూ. 'చదవండి' అన్నాడు. చదివాను. అందులోని ఒక పేరా నాకు మరింత సంతోషాన్ని కలుగజేసింది.

"నాకు ఒంట్లో బాగోకపోవడంవల్ల ప్రయాణం చేయలేకపోతున్నాను. కానీ, నా అంతటివాడ్ని మీ దగ్గరకు పంపుతున్నాను. నాకు అతనిమీద పూర్తి నమ్మకం వుంది. అతను యువకుడు, శక్తిమంతుడు, నేర్పు గలవాడు. విశ్వాసంగా పని చేయగలవాడు. వివేకవంతుడు. మౌనంగా వుంటాడు. నాదగ్గరే వుండి పైకి వచ్చాడు. మీ పనులన్నీ అతను సందేహం లేకుండా నిర్వర్తించ గలవాడు."

ఇదీ ఉత్తరంలోని ఒక భాగం.

డ్రాకులా భోజనాల బల్ల దగ్గరకొచ్చాడు. రావడంతోటే కోడి వేపుడు వున్న పాత్ర మూత తీసాడు. అదీ, కొంత జున్ను, పచ్చి కూరల పచ్చడి లాంటిది తిన్నాను. రెండు గ్లాసుల 'టొకే' సారాయి తీసుకున్నాను. నేను భోజనం చేస్తున్నంతసేపూ నా ప్రయాణం గురించి డ్రాకులా ఎన్నో ప్రశ్నలు వేసాడు. నేను అన్నిటికి జవాబులు చెప్పాను, అనుభవాలతో సహా.

భోజనం అయిన తర్వాత కుర్చీ వేసుకుని పొయ్యి దగ్గర కూర్చోమని చెబితే అట్లాగే కూర్చున్నాను. ఒక 'సిగార్' ఇచ్చాడు. నేను వెలిగించాను. డ్రాకులా తనకు అలవాటులేదని చెప్పాడు. అప్పుడే అతని రూపం పరిశీలనగా చూడటం మొదలు పెట్టాను.

## జీవన్ మృతులు

అతని మొహం చాలా బలమైందిగా కనిపించింది. ముక్కు పొడుగ్గా సన్నగా వుంది. ముక్కు రంధ్రాలు ప్రత్యేకంగా కనిపించాయి. విశాలమైన నుదురు. కణత భాగంలో జుట్టు లేదు, మిగతా తలంతా జుట్టుతో దట్టంగా వుంది. కనుబొమలు కూడా దట్టంగా వుండి ముక్కు పై భాగంలో దాదాపు కలిసినట్టుగా వున్నాయి. మీసం దట్టంగా వుంది. దానికింద నోరు క్రూరత్వం సూచిస్తున్నట్టుగా వుంది. తెల్లని పళ్ళు పదునుగా వున్నాయి. అవి పెదాలు దాటి బయటకొచ్చాయి. ఆ వయసువాడికి పళ్ళు అంత బలంగా వున్నాయంటే కాస్త ఆశ్చర్యమే! చెవులు తెల్లగా పాలిపోయినట్టు వున్నాయి. చెవుల పై భాగం కొనదేలి వున్నాయి. అతని గడ్డపు భాగం విశాలంగా, బలంగా వుంది. చెంపలు సన్నగా వున్నా, ముడతలు లేవు. మొత్తానికి అతని మొహంలో కళలేదు.

అతను కూడా పొయ్యి దగ్గర కూర్చున్నాడు. చేతులు మోకాళ్ళమీదవేసి వుంచాడు. పొయ్యి వెలుతురులో చేతులు పరీక్షించాను. అవి తెల్లగా చక్కగా వున్నాయి అనుకున్నా గానీ, కాస్త సరిగ్గా చూస్తే వెడల్పుగా మోటుగా వున్నాయి అని తెలుసుకున్నాను. వింత గొల్పిన విషయ మేమిటంటే, అతని అరచేతిలో వెంట్రుకలు వుండడం! డ్రాకులా నామీదకు వంగినవుడు అతని చేతులు నా చేతులకి తగిలాయి. ఎందుకో నా శరీరం కంపించింది. అతని దగ్గర్నుండి వాసన. భరించలేక పోయాను. డోకు వచ్చినంత పని అయింది. నాలో మార్పు కనిపెట్టి వెంటనే డ్రాకులా నాకు దూరంగా జరిగాడు, నవ్వుతూ. ఒక్క క్షణం మౌనంగా కూర్చున్నాం. అప్పుడే కిటికీవేపుకు చూసాను బయట ఆకాశంలో తెల్లవారే వెలుగు కనిపించ సాగింది. నక్కల అరుపులు దూరంగా వున్న లోయలోంచి వినిపిస్తున్నాయి. అది విన్న దొర కన్నుల్లో ఏదో వెలుగు!

'విన్నారా! ఎంత కమ్మటి సంగీతం' అన్నాడు. మళ్ళీ వెంటనే, 'నగరవాసులకు ఈ వేటగాడి మనసు అర్థంకాదు' అంటూ లేచాడు.

'బాగా అలసిపోయి వుంటారు. బాగా ప్రొద్దుపోయేదాకా నిద్రపోండి. మధ్యాహ్నం వరకు నేను బయటకు పోవాల్సిన పనివుంది కాబట్టి అప్పటిదాకా నిద్రపొండి మంచి కలలు గంటూ' అన్నాడు. నా పడక గది తలుపు అతనే తెరిచి, గౌరవ సూచకంగా తల వంచాడు. నేను పడక గదిలోకి వెళ్ళాను.

మళ్ళీ నాలో ఎన్నో సందేహాలు! భయాలు! విషయాలన్నీ చాలా వింతగా వున్నాయనిపించ సాగింది. భగవంతుడా! నా వారికోసమైనా నన్ను కాపాడు!

మే 7: ఉదయమైంది. ఇరవై నాలుగ్గంటలు హాయిగా నిద్రపోయాను. బాగా ప్రొద్దుపోయాక లేచాను. కాలకృత్యాలు తీర్చుకుని నేను క్రితం రాత్రి భోజనం చేసిన గదిలోకి వెళ్ళాను. అక్కడ ఆహారం సిద్ధంగా వుంది. చిన్న పొయ్యిమీద పెట్టబడిన కాఫీ చెంబు వుంది. బల్లమీద చిన్న చీటీవుంది. దానిమీద ఇలా రాసి వుంది —

'నాక్కాస్త పనివుంది. నా కోసం ఎదురు


5
SAVAGE
SAVAGE
MADE IN INDIA
Wiltech India Ltd.

చూడొద్దు — డ్రా' అని వుంది. నా భోజనం ముగించాను. పనివాడు ఎవరైనా వచ్చి అవన్నీ తీస్తాడనే వుద్దేశంతో, అక్కడ గంటకోసం వెతికాను. ఎక్కడా కనపడలేదు. ఇంత పెద్ద కోటలో నౌకర్ని పిలిచే సదుపాయం లేక పోవడం చాలా వింత సంగతే!

భోజనం బల్ల పరిశీలించాను. దానిమీద వున్న పాత్రలు అన్నీ బంగారం! ఎంతో విలువగలిగినవి. ఇకపోతే, కిటికీ తెరలు, కుర్చీలకు, మంచానికి వున్న పరుపులకు వాడిన గుడ్డలు, మంచానికి వాడిన తెరలు, అన్నీ అప్పట్లో చాలా ఖరీదైనవి అయివుండాలి. చాలా పురాతనమయినవయినా చెక్కుచెదర కుండా వున్నాయి. హాంప్టన్ కోర్టులో ఇలాంటి తెరలే చూసానుగానీ, బాగా పాడయి పోయాయి. ఇంకో సంగతి. ఒక్కగదిలో కూడా ఒక్క అద్దం కనిపించలేదు. కాల కృత్యాలు తీర్చుకునే గదిలోకూడా అద్దంలేదు. నేను తెచ్చుకున్న అద్దంలో చూసుకుంటూ గడ్డం చేసుకున్నాను. తల దువ్వుకున్నాను. ఒక్క నౌకరు కనిపించడంలేదు. అసలు వాళ్ళ అలికిడే లేదు, ఎక్కడో తోడేళ్ళ అరుపులు తప్ప. కాసేపు ఏదైనా చదువుదామని పుస్తకం కోసం చూసాను. అసలు కోటంతా

కర్నూలుజిల్లా పోలీసు కుటుంబ సంక్షేమానికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో సినీనటి జయసుధ నుంచి మొమెంటోని అందుకుంటున్న ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శ్రీ సిల్వర్ స్టార్.



## జీవన్ మృతులు

ఒకసారి కలయ తిరుగుదామనిపించిందిగానీ, డ్రాకులా అనుమతి లేకుండా తిరగడం మంచిది కాదనిపించింది. అందువల్ల కాస్త చదువుకుని కాలక్షేపం చెయ్యడానికే నిశ్చయించుకున్నాను. అక్కడ ఒక పుస్తకంగానీ, దినపత్రికగానీ, కనపడలేదు. ఆ గదిలోంచి లేచి మరో గదివేపుకు వెళ్ళాను.

అది పుస్తకాల గది! నాకు చాలా సంతోషమేసింది. ఎన్నో ఇంగ్లీషు పుస్తకాలు కనిపించాయి. అరలన్నీ పుస్తకాలతో నిండిపోయాయి. వాటిల్లో పత్రికలు, దినపత్రికలూ వున్నాయి. అక్కడే వున్న బల్లమీద కూడా పత్రికలు, దినపత్రికలు వున్నాయి. కానీ అవన్నీ చాలా పాతవి.

ఇక పుస్తకాలు — చరిత్ర, భూగోళం, రాజకీయాలు, వృక్షశాస్త్రం, ఆర్థికశాస్త్రం, భూగర్భశాస్త్రం, న్యాయశాస్త్రం — ఇవన్నీ ఇంగ్లాండుకు, ఇంగ్లీషువాళ్ళకు వాళ్ల సంప్రదాయాలకు సంబంధించినవే. లండన్ నిఘంటువు, విటేకర్ పంచాంగం, నౌకాబలం, సైనిక బలానికి సంబంధించినవారి పేర్లున్న పుస్తకాలు కనిపించాయి. న్యాయశాస్త్రానికి సంబంధించినవారి పేర్లున్న పుస్తకం కనిపించగానే నాకు సంతోషమేసింది.

పుస్తకాలు చూస్తుండగా, తలుపు తెరుచుకుని దొర లోపలికొచ్చాడు. అభివాదం చేసాడు. 'రాత్రి బాగా నిద్రపోయారనుకుంటా' అన్నాడు.

మళ్ళీ 'మీరు ఈ గదిలోకి వచ్చి గడపడం నాకు చాలా సంతోషంగా వుంది' అన్నాడు. కొన్ని పుస్తకాలు చూపించి, 'ఈ పుస్తకాలే ఎన్నో ఏళ్ళనుంచి నాకు స్నేహితులు. నేను లండన్ వెళదామనుకుని ఇవన్నీ చదవడం మొదలెట్టాను. ఇవి చదివాక ఇంగ్లాండ్ గురించి తెలుసుకోగలిగాను. ఇంగ్లాండ్ గురించి తెలుసుకోవడం అంటే, ఇంగ్లాండుమీద ప్రేమ పుట్టినట్టే లెక్క. లండన్‌లో బాగా జనసమ్మర్దంగా వున్న వీధుల్లో తిరుగుతూ, వాళ్ల జీవితాలు, అనుభవాలు బాధలు పంచుకోవాలని నా కోరిక. ఇప్పటివరకు ఇంగ్లీషు భాష చదవడం మాత్రమే తెలుసు. మీరు వచ్చాకే, నేను ఇంగ్లీషు మాట్లాడడం తెలుసుకున్నాను' అన్నాడు.

'కానీ మీరు ఇంగ్లీషు చాలా చక్కగా మాట్లాడుతున్నారే!' అన్నాను.

'మీరు నన్ను బాగా పొగిడేస్తున్నారు. ఏదో కొద్దిగా మాత్రమే నేర్చుకుని కాస్త దారిలో పడ్డాను. వ్యాకరణం దానికి సంబంధించిన మాటలు నేర్చుకున్నాను. కాని ఎట్లా పలకాలో ఇంకా నేర్చుకోవాలనుకుంటా' అన్నాడు.

'నిజంగా మీరు బాగా మాట్లాడుతున్నారు' అన్నాను.

'అదిసరే, నేను లండన్‌కెళితే, నేనంటే తెలిసిన వాళ్ళు ఎవరూ వుండరు. ఇక్కడ అలా కాదు. నేనంటే ప్రతివాడికి తెలుసు. నేను ఇక్కడ ప్రభువుని. పరాయి దేశంలో నేను పరాయివాడినే కదా! నన్ను గురించి పట్టించుకునే వాళ్ళే వుండరు. మీలో ఒకడ్నిగా నన్ను చూస్తే చాలు, అంతేగానీ నా భాషవిని 'వీడెవడ్రా' అని అనుకోకుండా వుంటే చాలు. ఇప్పటివరకూ ప్రభువులా వుంటూ వచ్చాను. ప్రభువులాగే వుంటాను' అన్నాడు.

మళ్ళీ 'సరే, నా మిత్రుడు పీటర్ హాకిన్స్ దగ్గర్నించి వచ్చినవారు కదా. లండన్‌లో నా ఎస్టేట్ గురించి చెప్పండి. మీరు నాతో కాసేపు వుండి అన్నీ చెప్పాలి. నేను మాట్లాడే ఇంగ్లీషులో తప్పులు వుంటే చెప్పాలి సుమా! అప్పుడు ఇంగ్లీషు నేను బాగా నేర్చుకోగలుగుతాను' అన్నాడు.

'అట్లాగే! నేను ఎప్పుడుబడితే అప్పుడు ఈ గదిలోకి రావచ్చా' అని అడిగాను. 'తప్పకుండా!' అన్నాడు.

కాస్త ఆగి 'ఈ కోటలో తాళాలు వేసి వున్న గదులకు తప్ప, మిగతా చోటు ఎక్కడికైనా వెళ్ళొచ్చు. నేను దగ్గరుండి చూపిస్తే మీకు విషయాలు బాగా అర్థమవుతాయి. ఇప్పుడు మనం ట్రాన్‌సిల్వేనియాలో వున్నాం. ట్రాన్సిల్వేనియా ఇంగ్లాండులో లేదు. అంటే మా పద్ధతులు వేరు మీ పద్ధతులు వేరు. ఇక్కడన్నీ మీకు వింతగా గోచరిస్తాయి. మీ అనుభవాలన్నీ అప్పుడే చెప్పారు గదా. ఇట్లాంటివి ఇంకా వుంటాయి' అన్నాడు.

మెల్లగా అతన్ని సంభాషణలోకి దించాను. అతనికది ఇష్టంలేదని తెలుస్తోంది. అయినా

చాలా ప్రశ్నలేసాను నిర్మోహమాటంగ. అర్థం కానట్టు మొహం పెట్టాడు ఎక్కువగా. కొన్నింటికి జవాబులు చెప్పాడు. ఇక్కడకు వచ్చేముందు బండిలో ప్రయాణం చేసాను కదా. దారిలో చీకట్లో నీలికాంతులు కనపడ్డం, బండి అతను బండి దిగి వాటి కోసం పోవడం గురించి అడిగాను.

'ఎప్పుడో ఒక్క రాత్రి, అదే మొన్నటి రాత్రి దుష్ట శక్తులు తిరిగే రాత్రి. ఆరోజు దుష్ట శక్తులు తిరుగుతాయని ఇక్కడి వారి నమ్మకం. అవి తిరిగేటప్పుడు నిధులు వున్న చోట నీలపు కాంతులు కనపడతాయి. ఈ ప్రాంతంలో చాలా నిధి పాతి పెట్టబడి వుంది. శతాబ్దాల క్రితం ఇక్కడ 'వాలాచియన్', 'సాక్సన్' టర్క్‌లు కొట్టుకు చచ్చారు. ఈ భూమ్మీది ప్రతి అంగుళం వాళ్ల రక్తంతో తడిసిందే. మగవాళ్లు, ఆడవాళ్లు, పిల్లలు, ఎందరో తుడుచుకుపెట్టుకుపోయారు. దండెత్తిన వాడికి మిగిలినది తక్కువే.'


'చాలా నిధి వుందంటున్నారు కదా ! మరి వెతికి తీసుకోవచ్చుగదా!' అడిగాను. అందుకు ప్రభువు నవ్వాడు. అతను నవ్వినప్పుడు అతని సూదుల్లాంటి పళ్ళు కనిపించాయి.

'ఏడీ, అంత ధైర్యవంతుడు ? అంత తెలివిగలవాడేడి ? ఆ నీలిమంటలు ఒక రాత్రి పూట కనపడతాయి. ఆ రాత్రి తలుపులు వేసుకోకుండా ఎవడూ వుండడు. ఒకవేళ ధైర్యం చేసి నీలిమంటలు చూసాడనుకుందాం. దానివల్ల ప్రయోజనం ఏవుంది ? ఎందుకంటే, ఆ నీలిమంటలు రాత్రి ఎక్కడ కనపడ్డాయో ఆ చోటును పగలు గుర్తించడం కష్టం. మీరు నీలిమంటలు చూసానంటున్నారు కదా. మీరు చూసిన ప్రదేశాలు కనిపెట్టలేరు మళ్ళీ.'

'నిజమే' అన్నాను. తర్వాత ఏవో విషయాలు మాట్లాడుకున్నాం.

'సరే, లండన్‌లో నా కోసం సంపాదించిన ఇంటి గురించి చెప్పండి' అన్నాడు. నేను నా సామాను పెట్టిన గదిలోకి వెళ్లాను, లండన్‌లో ఇంటి తాళాకు పత్రాలు తీసుకొచ్చేందుకు. కాగితాలన్నీ తీసుకుని సర్దుకుంటూ వుండగా, అవతలి గదిలో భోజనం బల్లమీద పాత్రల శబ్దం వినిపించింది.

(ఇంకా వుంది)



'ఆడదాని సవాల్'లో విజయశాంతి

# సినిమా

## కళాప్రపూర్ణ డాక్టర్ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

రంగస్థల చలన చిత్ర నటుడు ఆంధ్ర నాటకరంగ చరిత్రకారుడు నటరత్నాల రచయిత జానపద కళారూపాల పరిశోధకుడు స్వాతంత్ర్య సమరయోధుడు ప్రజానాట్యమండలి ప్రముఖుడు వక్త విమర్శకుడు ప్రయోక్త అయిన మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి తెలుగు నాటకరంగానికి చేసిన బహుముఖ సేవలను గుర్తించి ఆంధ్ర విశ్వ విద్యాలయం అక్టోబర్ 22న జరిపిన స్నాతకోత్సవంలో కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేట్ ఇచ్చి సన్మానించింది

'సకల కళాప్రియుడు'లో కమలహాసన్, పూర్ణిమా జయరామ్



# విశేషాలు

-జి. వి. జి.

## గంగాధర్ చిత్రకళా ప్రదర్శన

ఎన్నో విజయవంతమైన తెలుగు, తమిళ, కన్నడ చిత్రాలకు పబ్లిసిటీ ఆర్టిస్ట్‌గా ప్రసిద్ధి పొందిన గంగాధర్ తనలోని నిజమైన కళాకారుడ్ని వెలికి తెచ్చేరీతిలో మానవ జీవితంలోని పరిణామ క్రమాన్ని అద్భుతమైన విధానంలో చిత్రీకరించి, భవిష్యత్తులో మానవుని స్థితి గతులను ఊహించి వేసిన చిత్రాల ప్రదర్శన ఢిల్లీలో, హైదరాబాద్‌లో బహుముఖ ప్రశంసలందుకున్నాయి మద్రాసు, విజయవాడ, బెంగుళూరు, బొంబాయి నగరాలలో కూడా ఈ చిత్ర ప్రదర్శన జరుగుతుంది



'మగాళ్ళకో నమస్కారం'లో మురళీమోహన్, ప్రభ

'కిరాయి కోటిగాడు'లో శ్రీదేవి, అరుణ





'మనిషికో చరిత్ర' లో సుహాసిని

# సినిమా

## ప్రేమజ్వాలలో పరిశోధన

ఉదయం నుంచి డ్యూటీ చేసి అలసిపోయిన హెడ్‌కానిస్టేబుల్ (సారధి) కానిస్టేబుల్ అవతారం (నారాయణమూర్తి) దీర్ఘంగా ఆలోచించడానికి ఓ హోటల్లోకి వెళ్లి, చపాతీలు తినసాగారు హెడ్ త్రేన్చుతూ, ''ఇప్పుడు వాళ్ళిద్దర్నీ పట్టుకోడానికి నేను జేమ్స్‌బాండ్‌లా ఆలోచించి, డిటెక్టివ్ యుగంధర్ స్టైల్‌లో ఓ ప్లాన్ చెబుతా ఫర్ ఎగ్జాంపుల్ నీ బుర్రలో ఎంత సరుకుందో టెస్ట్ చెయ్యడానికి అడుగుతున్నాను మనం వెతుకుతున్న ఆ రామశాస్త్రి కొడుకు, ఆ డేనియల్‌గారి కూతురు కనిపించారనుకో,'' అంటూ ఇటూ అటూ చూశాడు



'కోకిలమ్మ' లో సరిత

''అనుకున్నాను, సార్!'' అన్నాడు అవతారం

ఒక టేబుల్ ఇరువైపులా కూర్చొనున్న యువతీ యువకులను చూసి, ''మాటవరసకి ఆ అబ్బాయి రామశాస్త్రి కొడుకనుకో,'' అన్నాడు హెడ్

''అనుకున్నాను, సార్! అయితే, ఆ అమ్మాయి డేనియల్‌గారి కూతురని మీరూ అనుకోండి,'' అన్నాడు అవతారం

''ఆల్‌రైట్ అనుకున్నాను ఈ ఇద్దరే ఆ ఇద్దరయితే—ముందుగా ఎవర్ని పట్టుకుంటావ్?''

''అబ్బాయిని పట్టుకుంటా, సార్!''

''నీ బుర్రమీద టోపీ ఉందిగాని, బుర్రలో సరుకు లేదురా! ముందు ఆ అమ్మాయిని



'దేశానికొక్కడు' లో ఒక సన్నివేశం


ఆప్కో
చైతన్యపు మెరుపు రవ్వలు
దీపాల పండగకు దేదీప్యమానమైన అద్భుతకాంతులనిచ్చే ఆప్కోవారి సిల్కులు. ప్రఖ్యాతిపొందిన పోచంపల్లి, ధర్మవరం, నారాయణపేట, గద్వాల్ మరియు వెంకటగిరి సిల్కులు. రండి! జీవం ఉట్టిపడే ఆప్కోవారి సిల్కులు ఈ దీపావళికి ఎన్నుకొనండి.
ఆప్కో
చేనేతలు


వెన్నెల మోమును
మంగళకరమైన
మెరుగు పరచటానికి
ఐటెక్స్
మాట్ ఫినిష్ తిలకం
దేశమంతటా నాగరిక యువతులు కోరి
తయారుచేయబడు ఐటెక్స్ తిలకం
చర్మానికి ఎటువంటి హానియు కలుగజేయదు
EYETEX
EYETEX

# సినిమా

పట్టుకోవాలి అదీ రూలు ఎందుకంటే — ఆడపిల్ల అయస్కాంతం లాంటిది కదా ? ఆ అమ్మాయిని పట్టుకుంటే — ఆ కుర్రాడు కూడా రపీమని దొరికి పోతాడు ''

వీళ్ళ సంభాషణ వింటూన్న ఆ యువతీ యువకులిద్దరూ లేచివచ్చి, ''హెడ్‌గారూ ! మేం వెళ్లొస్తాం, సార్ !'' అంటూ బయలుదేరారు

''మంచిది నాయనా, శుభం !'' అంటూ హెడ్ తాపీగా అవతారం వంక తిరిగి, ''చూశావా భగవంతుడి లీల ? వాళ్ళిద్దరూ కూడా మనం వెతుకుతూన్న జోడీలాగే ఉన్నారు కదూ ?'' అన్నాడు

అవతారం ఉలిక్కిపడ్డాడు ''లాగ ఉండడ మేమిటి, సార్ ? వాళ్ళే వీళ్ళు,'' అన్నాడు

''వాళ్ళే అయితే ఆ సంగతి నాతో ఎందుకు రిపోర్ట్ చెయ్యలేదు ? యూస్‌లెస్ ఫెలో నెంబర్ వన్ !'' అంటూ హెడ్ హడావిడిగా లేచి, ''వెంటనే వాళ్లను పట్టుకోవాలి కమాన్ ఫాలో మీ పట్టుకోండి ! పట్టుకోండి,'' అంటూ అరిచాడు అప్పుడా హోటల్లో ఉన్న కొందరు అతన్నే పట్టుకున్నారు ''ఛ ఛ నన్ను కాదయ్యా ఆ లబ్బాయిని ఎట్టుకోమంటే ఎన్ను ఎట్టుకున్నా



''మా చిత్రంలో హీరో వేషం కావాలంటే బీకాం పాసై ఉండాలి. ఎందుకంటే మా ప్రొడక్షన్ ఎక్కవుంట్లు కూడా రాయాలి !''

రేమిటి ?'' అంటూ రీవిగా అవతారం వంక తిరిగి ''కమాన్ ఫాలో మీ,'' అన్నాడు

ఇంతలో హోటల్ ప్రొప్రయిటర్ 'బిల్లు డబ్బో !'' అని లబోదిబోమన్నాడు ''మేమిద్దరం మస్కా తిన్నాం తప్ప ఇంకేం తినలేదు ఇంకేం బిల్లు,'' అంటూ అవతారం గాభరాతో హెడ్ వెనుక పరుగుతీశాడు

ఎన్ కృష్ణాజీ నిర్వహణలో తలాటం మాణిక్యాంబ సమర్పించే భీమేశ్వర ఆర్ట్ మూవీస్ ''ప్రేమజ్వాల'' చిత్రాన్ని, పి వి రాజు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తలాటం వెంకటేశ్వరరావు నిర్మించారు


## చిత్రాల పేర్లు

★ కృష్ణ హీరోగా విజయనిర్మల దర్శకత్వంలో కానూరి రంజిత్‌కుమార్ నిర్మించే రంజిత్ ఆర్ట్స్ చిత్రానికి ''చట్టానికి వెయ్య కళ్ళు' అని పేరు పెట్టారు

★ నవంబర్ 10 నుంచి డిసెంబర్ 10 వరకు కుమారరాజా పిక్చర్స్ అధినేత యు సూర్యనారాయణ బాబు నిర్మించే చిత్రం ''ఈ దేశంలో ఒక రోజు''

★ పి శేఖర్ దర్శకత్వంలో వానపల్లి బ్రహ్మాజీ నిర్మించే శ్రీ కామాక్షి చిత్ర సంస్థ చిత్రం పేరు 'కళారంజని''

'రఘురాముడు'లో శోభన్‌బాబు, శారద, సత్యనారాయణ





'బలిదానం'లో శోభన్‌బాబు, సాక్షి రంగారావు

## సినిమా

### మొండిఘటంలో మొండి అల్లుడు

"గుడ్‌మార్నింగ్, అత్తయ్యా!" గీత (రాధిక) మందహాసంతో ప్రవేశించింది

"ఏమే, గీతా! నిన్నొకరోజు చూడకపోతే నాకు ఏదోలా ఉంటుందని తెలియదూ? నిన్నంతా ఎక్కడికెళ్ళావే?" అంది అన్నపూర్ణమ్మ (అన్నపూర్ణ)

"మంగళగిరి కొండమీద ఓ స్వాములవారు వచ్చారని తెలిసిందత్తయ్యా! నా పెళ్ళి ఎప్పుడు జరుగుతుందో తెలుసుకుందామని వెళ్ళాను"

పక్కనే ఉన్న రవి (చిరంజీవి) "స్వాములవారు ఏం చెప్పారో!" అన్నాడు చిలిపిగా చూస్తూ

గీత తక్కువ తిన్నదేం కాదు "ఉన్నదే చెప్పాడు 'అమ్మాయ్, నువ్వొక మొండివాడ్ని ప్రేమించావ్ అతను ఎప్పుడు ఏం చేస్తాడో ఎవరికీ తెలియదు నీ పెళ్ళి ఎప్పుడు జరుగుతుందో నాకు తెలియదు' పొమ్మన్నాడు" అంది

"ఆయన చెప్పినట్టు చేస్తే, నీ భవిష్యత్తుకు చాలా మంచిది," అన్నాడు రవి

'ప్రళయ గర్జన'లో గీత, స్వప్న, మోహన్‌బాబు, కవిత



# Hallmark DELUX

# హాల్‌మార్క్ డీలక్స్ స్టెయిన్‌లెస్ స్టీల్ గ్యాస్ స్టవ్



IS 4246

అన్ని సదుపాయాలతో మరెం
కలిగి మీ గృహానికి అందాని

- శుభ్రపరచటానికి వీలుగా
  **Spill trays**
- ఇతర స్టాండులతో అ
  **Rubber feet**
- ఇంధనాన్ని పొదు
  సామర్థ్యంగల **B**
- మీ పాత్రలక
  **Pan Sup**

Hal



# సినిమా

"ఎమ్మిట్రా మంచి ? ఏం, పెళ్ళి చేసుకోవా ?" అన్నపూర్ణ నివ్వెరపోయింది

ఇంతలో మధుమూర్తి రావడం చూసి 'గుడ్‌మార్నింగ్, మామయ్యా !" అంది గీత

"ఏవమ్మా ! మీ నాన్న ఏం చేస్తున్నాడు ?" మధుమూర్తి అడిగాడు

రవి కొంటెగా చూస్తూ, "ఏం చేస్తాం టాడు ? తలకుమాసినవాడు ఎవడన్నా కనబడితే, వాడిదగ్గర ఎంత ఫీజు వసూలు చేద్దాం అని ఆలోచిస్తూంటాడు," అన్నాడు

గీత సీరియస్‌గా ముఖంపెట్టి, "అవునుమరి ఈ కాలంలో కొండమీద కోతైనా దొరుకుతుంది కాని, అల్లుళ్ళు మాత్రం దొరకటంలేదు లక్షలు సంపాదిస్తాద్దూ !" అంటూ ఒక్క చురక వేసింది

దగ్గుబాటి భాస్కరరావు నిర్మించిన అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ "మొండిఘటం" చిత్రానికి రాజాచంద్ర దర్శకుడు

'కాంతయ్య — కనకయ్య' లో

నరసింహరాజు, కవిత, రావు గోపాలరావు





'మంచు పల్లకి' లో చిరంజీవి

## మోహన్‌బాబు చిత్రావళి

★ బోయిన సుబ్బారావు దర్శకత్వంలో భరత్ బాబూరావు నిర్మించే జి వి కె కంబైన్స్ చిత్రం ''సవాల్'' తుది మెరుగులు దిద్దుకుంటోంది

★ ఎం రామకృష్ణారెడ్డి సమర్పించే సుమన్ క్రియేషన్స్ ''మాయగాడు'' సినిమాస్కోప్ చిత్రాన్ని బి ఎల్ వి ప్రసాద్ దర్శకత్వంలో ఎం శ్యామలా రెడ్డి నిర్మిస్తున్నారు

★ పి చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో ఎన్ వి సుబ్బరాజు సమర్పించే శ్రీ వాణీచంద్ర కంబైన్స్ ''ప్రళయ గర్జన'' చిత్రానికి కలిదిండి విశ్వనాథరాజు, ఆర్ వెంకట్రామరాజు నిర్మాతలు

★ ఎం రవిశేఖరరాజు నిర్మించే విశ్వచిత్ర కంబైన్స్ తొలి చిత్రానికి కోడి రామకృష్ణ దర్శకుడు

★ ఎం మోహన్‌బాబు స్వయంగా నిర్మించే శ్రీ లక్ష్మీప్రసన్న పిక్చర్స్ ''ధర్మపోరాటం'' ద్వితీయ చిత్రానికి ఎం డి సుందరం, సత్యానంద్, సత్యం, ఆత్రేయ, పుష్పాల గోపీకృష్ణ, మార్తాండ్, శ్రీనివాసరాజా తెరవెనుక కృషిచేస్తారు బోయిన సుబ్బారావు దర్శకుడు

★ జి వి ఎస్ రాజు నిర్మించే విజయలక్ష్మి మూవీస్ 6వ చిత్రానికి బోయిన సుబ్బారావు డైరెక్టరు

★ డి రామానాయుడు సమర్పణలో డి సురేష్‌బాబు నిర్మించే సురేష్ ఎంటర్‌ప్రైసెస్ ద్వితీయ చిత్రానికి బోయిన సుబ్బారావు దర్శకుడు

★ హరగోపాల్ నిర్మించే మయూర్ మూవీస్ మొదటి చిత్రానికి పి చంద్రశేఖర్ దర్శకుడు

★ గిరిబాబు సమర్పించే మాధవి చిత్ర ''మెరుపుదాడి'' చిత్రానికి కె ఎస్ ఆర్ దాస్ దర్శకుడు

★ బోయిన సుబ్బారావు దర్శకత్వం నెఱపే మధు ఆర్ట్ ఫిలిమ్స్ తొలి చిత్రానికి ఎ ఎల్ అబ్బాయినాయుడు నిర్మాత, విష్ణుకుమార్ ప్రొడక్షన్స్ చిత్రానికి బి ఆర్ రెడ్డి నిర్మాత

★ దిడ్డి శ్రీహరిరావు నిర్మించే బాబ్ అండ్ బాబ్ ఆర్ట్స్ చిత్రానికి కోడి రామకృష్ణ డైరెక్టరు

★ దాసరి కథ, స్క్రీన్‌ప్లేతో ఎం కోటారెడ్డి దర్శకత్వంలో జి సుధీర్‌బాబు సమర్పించే స్వాతి చిత్ర కంబైన్స్ ''నాంపల్లి నాగు'' చిత్రానికి జి వెంకటేశ్వరరావు, పి వి సుబ్బారెడ్డి నిర్మాతలు

★ రంగసాయి ఫిలిమ్స్ పతాకంలో డాక్టర్ పి చంద్రశేఖర్ నిర్మించే చిత్రానికి, విజయబాపినీడు నిర్మాణతలో త్వరలో ప్రారంభమయ్యే శ్యామ్‌ప్రసాద్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ చిత్రానికి, డైరెక్టర్ బి వి ప్రసాద్ ఆధ్వర్యంలో తయారయ్యే చిత్రానికి స్క్రిప్ట్‌వర్కులు జరుగుతున్నాయి



## విద్యార్థి లోకం వ్యాసరచన పోటీలో ప్రత్యేక బహుమతి రు. 150/-లు పొందిన వ్యాసం


# మా విద్యార్థిలోకం ఆశయాలు

విద్యార్థి లోకం ఆశయాలంటారు నేటి విద్యార్థులే రేపటి పౌరులంటారు రేపు మేము పెద్దవాళ్ళమయి చక్కటి పౌరులు కావాలి మాలో కొందరు మంత్రులవుతారు, కలెక్టరు లవుతారు గుమాస్తాలు, ఉపాధ్యాయులు అవుతారు అందరం పెద్దయ్యాక ఓట్లు వేస్తాము కాని మేమంతా సమర్థులము, మంచి వాళ్ళమూ కావద్దూ. మేము ఎవర్ని చూచి నేర్చుకోవాలి. మేము వార్తాపత్రికలు చూస్తూంటాము. మంత్రులందరు అబద్దాలాడుతుంటారు. ఓట్లకోసం లేని ప్రేమ ఒలకపోస్తుంటారు మా అమ్మా, నాన్నలకి మమ్మల్ని గురించి పట్టించుకొనే సమయమే ఉండదు మా మేష్టర్లు పాపం! వారికి జీతం రాదు ఇంట్లో ఇబ్బందులు పొరాలేం చెబుతారు? నాలుగు రోజులు మేము బడికెళ్తేచాలు ఎవడో రాజకీయ నాయికుడొస్తాడు "పదండిరా పిల్లలూ బయటకు నడవండి బస్సులమీద రాళ్ళెయ్యండి అద్దాలని పగలకొట్టండి" అంటూ మమ్మల్ని బయటకు ఈడ్చుకొని తెస్తారు. మా నాయకులతోపాటే మేము కదా! ఏం చేస్తాం సమ్మె చేయక? ఇటు పుస్తకాలన్నా రావు. ఇంకేం చదువు? పుస్తకాలు వచ్చేలోపల వ్యాకరణం, లెక్కలు వంటివి స్వంతంగా ఉపాధ్యాయులు బోధించవచ్చని మా తాతయ్య అంటూంటాడు. ఆ విషయం మాష్టర్లతో అంటే నోరు మూసుకోమన్నారు. ఏం చేస్తాం చెప్పండి? పరీక్షలలో సాయం చేయండి పంతులు గారూ అంటాం. ఆ సాయం వారు చేస్తున్నారు. కాకపోతే ఒకే భయం. రేపు మేము పంతుళ్ళ మయితే ఆ సహాయం చేయలేక పోతామేమో అని. అయినా పంతులు ఉద్యోగం మాకొద్దులే.

మన స్కూళ్ళకి ఆటస్థలాలు లేవు. ఆటలాడుకుంటేనే చదువు వస్తుందట. క్లాసుల్లో ఏమాడుకుంటాం? కింద కూచుంటామన్నా పై చదువుల్లో సీట్లు ఇచ్చేవారు లేరు. మంచి నీళ్ళుండవు. పక్కవాళ్ళింటివాళ్ళమీద దాడి చేయటం తప్పలేదు. ఇంతకన్నా మంచి బడిలోనే చదవాలని ఉంటుంది. మా ఇల్లు, వాకిలి తాకట్టు పెడితేకాని మంచి స్కూళ్ళల్లో సీట్లు దొరకవని మా పెద్దలు చెప్పగా సర్దుకున్నాము సమసమాజం స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని సాంఘికశాస్త్ర పాఠాలలో చదువుకున్నాం మరి అందరికి ఒకేరకం పాఠశాలలు ప్రభుత్వం ఎందుకు పెట్టదో మా కర్థం కాదు కులం పేరు చెప్పనిదే మాకు ప్రవేశం దొరకదు కులమతాల కతీతంగా ఎలా ఉండాలబ్బా!?

ఏమయినా ఈ రకం పరిస్థితులను, ఈ దేశ వ్యవస్థను మార్చాలనే మా విద్యార్థిలోకం ఆశయాలు దీనికి ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, రాజకీయ నాయకులు, సమాజము అంతా చేయూతనిస్తారని మా ఆశ ★

### రచయిత్రి పరిచయం



"నా పేరు శ్రీపతి నళిని. వయస్సు 12 సం॥లు నేను శ్రీ సరస్వతీ విద్యాపీఠం వారి పూర్వ విద్యార్థినిని ఇప్పుడు 9వ తరగతి శ్రీ రామమోహన ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో చదువుచున్నాను కార్టూనులు గీయటం నా హాబీ త్వరలో మంచి కార్టూనిస్టు కావాలని నా ఆకాంక్ష లోగడ శ్లోక పఠనంలో రెండు బహుమతులు వచ్చినవి పత్రికా ముఖముగా వ్యాసరచన పోటీలో పాల్గొనటం ఇదే ప్రథమము ప్రత్యేక బహుమతి ఇచ్చి ప్రోత్సహించినందుకు గౌ॥ సంపాదకులకు నా ధన్యవాదములు"

— శ్రీపతి నళిని

## సినిమా

### కలవారి సంసారంలో సుందరమ్మ సందేహం

"ఒరేయ్, అబ్బాయీ! అంత ఆస్తిపరులు కానీ కట్నం లేకుండా ఈ పెళ్ళికి ఒప్పుకున్నాడంటే ఇందులో ఏదో తిరకాసు ఉందిరా!" అందీ సుందరమ్మ (నిర్మల)

"చాల్లే ఊరుకోమ్మా! ఊరికే నస " అని విసుక్కుంది సుజాత (శ్రీదేవి)

"నేనూ అతన్ని గురించి విచారించానమ్మా, అందరూ చాలా మంచివాడని చెబుతున్నారు," అన్నాడు రఘు (గిరిబాబు)

"అందరూ నీకు చెబుతార్రా! నేనూ విచారించాను మనకి కాయగూరలు తెస్తాదే - కనకమ్మ, ఆవిడ కోడలు తమ్ముడు వాళ్ళింట్లో పని చేస్తున్నాడట అతనూ చెప్పాడు - అతగాడు చాలా కర్కోటకుడట అందర్నీ హడలగొడతాడట కోపమొస్తే కొడతాడంట," అంది సుందరమ్మ

"ఎవర్ని? నిన్నా లేకపోతే నన్నా?" అంది సుజాత చిలిపిగా

"నన్నెందుకు కొడతాడే పిచ్చికొయ్యా, నిన్నే!"

"అది నా సంగతేదో నేను చూసుకుంటాను నువ్వూరుకో!"



'యువరాజు'లో జయసు[illegible]

వీళ్ళ గొడవకు రఘు విసుక్కుంటూ బిగ్గరగా "అమ్మా! పెళ్ళి కూడా చాలా సింపుల్‌గా చేయాలట వాళ్ళ తరఫున పాతికమంది, మన తరఫున పాతికమంది కంటే ఎక్కువ రాకూడదట," అన్నాడు

సుందరమ్మ ఖంగారుగా "అందుకు నువ్వొప్పేసుకున్నావా?" అంది

"కాదంటే, రిజిస్టర్ మేరేజ్ చేసుకుంటానన్నాడు"

"ఒరేయ్, ఒరేయ్! ఆఖరి ఆడపిల్లరా! మరీ అంత దరిద్రంగా సాగనంపుతామ్రటా? మీ నాన్న తాశిల్దారురా!" అని సుందరమ్మ నెత్తి బాదుకుంటూ, వంట గదికేసి వెళ్ళిపోయింది

కృష్ణ హీరోగా ఎస్ పి వెంకన్నబాబు సమర్పించే మహేశ్వరీ కంబైన్స్ "కలవారి సంసారం" చిత్రానికి దోనేపూడి బ్రహ్మయ్య నిర్మాత స్క్రీన్‌ప్లే, దర్శకత్వం కె ఎస్ రామిరెడ్డి ★

## 'కార్టూనిస్టులకు' సూచనలు!

★ కార్టూన్‌లను మంచి డ్రాయింగు కాగితంమీద ఇండియన్ యింకుతో గీసి పంపాలి

★ ప్రతి కార్టూన్ వెనుక కార్టూనిస్టు పేరు, చిరునామా ఉండాలి

★ వ్యంగ్య చిత్రాలు ప్రస్ఫుటంగా సాధ్యమైనంతవరకూ వాటిపై 'వ్యాఖ్య' చదవటానికి ముందే నవ్వించేవిగా అర్థవంతంగా వుండాలి!

★ వ్యాఖ్య చిన్నదిగా క్లుప్తంగావుండాలి అక్షరాలు కుదురుగా మొదటిసారి చదివినప్పుడే అర్థం అవ్వాలి! కార్టూన్ మీద పేరూ వూరు అన్నీ రాస్తే అవి తిరస్కరింపబడే అవకాశాలుంటాయి.

★ సొంత చిరునామా గల తపాలా బిళ్ళలు అంటించిన కవరుగల కార్టూన్‌లను త్రిప్పిపంపడంజరుగుతుంది దారిలో పోయేవాటికి మా బాధ్యతలేదు

★ ఎన్నుకొన్న కార్టూన్‌లలో అన్నీగాక కొన్ని మాత్రమే ఒక్కోసారి వేసుకోడం జరుగుతుంది పరిశీలనకి ఐదారువారాలు పట్టవచ్చు.

★ పండుగల కార్టూన్‌లు — బాగా ముందుగా వాటి కవరు మీద ఆ "ప్రత్యేక" సందర్భాన్ని పేర్కొంటూ పంపడం అవసరం

★ రంగుల కార్టూన్‌లు, పెన్సిలు బొమ్మలు, తెల్లకాగితంమీద వేసిన బొమ్మలు పంపవదని మనవి

★ మా కార్యాలయానికి స్వయంగావచ్చి కార్టూన్‌లు అందజేసేవారు కూడా స్వంత చిరునామాగల స్టాంపులంటించిన కవరు జతవేయాలి. కాపీ కార్టూన్‌లు పంపరాదు.

— సం॥




# భాషాభేదాభిమానులు

ఇంటర్వ్యూ : జి. వి. జి.


ఫోటోలు : శివం

"ఈమె మా భాషా తార అంటే మా భాషా తార!" అంటూ ఇద్దరు నా గురించి హైవేలో గొడవపడ్డారు "ఆ తమాషా సంఘటన చెప్పనా?" అంటూ రాధిక ఇలా వివరించింది —

చిత్తూరులో 'యమకింకరుడు' షూటింగ్ ముగించుకుని మద్రాసుకు తిరుగు ప్రయాణం చేస్తున్నాం కారు వెనుక సీటులో అమ్మా, నేనూ ఉన్నాం చుట్టూ చిన్న చిన్న కొండలు ప్రకృతి ఎంతో రమణీయంగా ఉంది ఉన్నట్టుండి కారు బోనెట్ నుండి రైలు ఇంజన్‌లా పొగ రావడం మొదలెట్టింది "ఇంజన్ బాగా హీట్ ఎక్కిపోయిందమ్మా," అంటూ డ్రయివరు కారును స్లో చేశాడు ఇటు అటు చూస్తే, ఎక్కడా నీటిచుక్కయినా కనిపించడంలేదు చివరికి ఓ చోట కారును ఆపక తప్పిందికాదు అక్కడ రోడ్డుకి ఇటు అటు రెండు టీ కొట్లున్నాయి డ్రయివరు ఓ కేన్ తీసుకుని ఒక కొట్టు దగ్గరికి వెళ్లి, నీళ్ళు అడిగాడు ఆ కొట్టతను వింతగా చూస్తూ, "ఇక్కడ తాగడానికే నీటిబొట్టు లేదు మీ కారుకు నీళ్ళు కావాలా నీళ్ళు?" అన్నాడు హేళనగా రెండో కొట్టతన్ని అడిగితే, "ఏమిటీ? నీళ్ళా! పాలలో కలపడానికే నీళ్ళు లేక నేను స్ట్రాంగ్ టీ ఇవ్వాల్సి వస్తోంది నన్ను నీళ్ళడుగుతావే?" అంటూ నవ్వేశాడు డ్రయివర్ ఎంత అడిగినా ప్రయోజనం లేకపోయింది కనుచూపుమేర దూరంలో ఇళ్ళెక్కడా కనిపించడంలేదు రేడియేటర్‌లో నీళ్ళు పోస్తేగాని, కారు కదలదు నేను త్వరగా మద్రాసు చేరుకుని, వెంటనే సత్యా మూవీస్‌వారి తమిళ చిత్రం షూటింగ్‌కు హాజరవ్వాలి కాని, ఎలా? నేను విసుగుతో "డ్రయివర్! వాళ్ళకు డబ్బేమైనా కావాలంటే నేనిస్తాను అప్పటికైనా నీళ్ళిస్తారేమో కనుక్కో!" అన్నాను కిటికీగుండా తొంగిచూస్తూ అప్పుడు నా ముఖాన్ని ఆ కొట్టు ఆసామీలిద్దరూ చూసినట్లుంది "అరే! ఆమె రాధిక కదూ?" అంటూ ఒకతను, "ఆమా కీషక్కుం పొగుం రైలు రాధిక," అంటూ మరొకతనూ — ఇద్దరూ పరుగున







కారు దగ్గరికి వచ్చారు "పాపం ! కారులో ఉన్నది మీరని తెలియక నీళ్ళు లేదన్నాను ఉండమ్మా ఇప్పుడే తెస్తా," అంటూ తమిళతను కొట్టుకేసి వెళ్ళిపోయాడు "న్యాయం కావాలి – చిత్రంలో మీరు చాలా బాగా ఏక్ట్ చేశారండీ మా కొట్టులో నీళ్ళకు కరువేమిటండీ ?" అంటూ మరొకతను కూడా వెళ్లాడతని కొట్టుకు కాస్సేపట్లో ఇద్దరూ చెరో కుండ మోసుకుని, బోనెట్ దగ్గరికొచ్చి నిలుచున్నారు సిద్ధంగా "ఒరేయ్ ! ఈమె మా తమిళ స్టార్ మవ్వు పో !" అంటూ తమిళతను, "ఎవ్రరా చెప్పింది ? ఈమె తెలుగు తార మవ్వు పోరా !" అంటూ మరొకతను – ఒకరినొకరు తోసుకోడంతో ఇద్దరి కుండల్లోంచీ నీళ్ళు కొద్దిగా ఒలికాయి నా గుండె జల్లుమంది అక్కడ అసలే నీళ్ళకు అంత కరువుగా ఉన్నప్పుడు వీళ్ళిలా నేలపాలు చేయడమా ? క్రమక్రమంగా వాళ్ళ పోట్లాట వాళ్ళ కుండలు బ్రద్దలయ్యే స్థితికి వచ్చింది "బాబ్బాబు! మీకెంతైనా పుణ్యముంటుంది మీరు పోట్లాడు కుంటే పోట్లాడుకున్నారుగానీండి – ఆ కుండలను కింద పెట్టి మరీ పోట్లాడుకోండి అయినా, నా గురించి ఈ పోట్లాట ఏమిటండీ ? నేను తమిళ చిత్రాలలోనేకాదు, తెలుగు చిత్రాల్లో కూడా నటిస్తున్నాను అంచేత, మీ ఇద్దరి కుండల్లోని నీళ్ళనూ తలాకాస్త పోయండి కాస్సేపు మీ భాషా భేదాలు మానండి," అన్నాను "కరెక్ట్ !" అన్నాడు తమిళతను "బాగా సెలవిచ్చారు," అన్నాడు తెలుగు ఆసామీ ఇద్దరూ అలాగే రేడియేటర్‌ను నింపారు అప్పటికిగాని నా గుండె కుదుటపడింది కాదు వాళ్ళకు నేను థాంక్స్ చెప్తూ, పర్సులోంచి నోటు అందుకున్నాను "తప్పు తప్పు మంచినీళ్ళకు డబ్బేమిటమ్మా ?" అంటూ ఇద్దరూ పుచ్చుకోలేదు పైగా "కాస్త టీ పుచ్చుకుంటారా ?" అంటూ ఇద్దరూ అడిగారుకూడానూ మళ్ళీ ఇద్దరూ వాళ్ళ కొట్లలోంచి టీ తీసుకొచ్చి ఎక్కడ గొడవ పడతారో అని, "అక్కర్లేదు ఇందాక చిత్తూరులో టీ తీసుకునే బయలుదేరాం వస్తాం," అంటూ సెలవు తీసుకున్నాను మా కారు చాలా దూరం వెళ్లేవరకు వాళ్ళిద్దరూ అలా రోడ్డు మధ్యనే చూస్తూ నిలుచుండిపోయారు !

## "జలం" అంటే ఏమిటి ?

కారంచేడు దగ్గర "మొండిఘటం" షూటింగ్ మొదటిరోజు పొలాల పక్కన లొకేషన్ షూటింగ్ చూడ్డానికి చాలామంది వచ్చారు నాకు దగ్గరగా కొందరు మహిళలు, పుస్తకాలతో కొందరు విద్యార్థినులు నిలుచొని ఉన్నారు నేను మేకప్ టచ్ చేసుకుంటున్నాను ఇంతలో ఓ విద్యార్థిని "ఈమెకు తెలుగు రాదనుకుంటాను," అంది అలా అంటే నేను తెలుగులో పలకరిస్తానేమోనని కాబోలు మరో అమ్మాయి "ఎందుకురాదూ ?" అంది "రాదని నేను నిరూపిస్తా రూపాయి పందెం," అంది మొదటి అమ్మాయి "సరే," అంది రెండో అమ్మాయి మొదటి అమ్మాయి మెల్లగా నా దగ్గరికి వచ్చి, "ఏమండీ ! మీరేం అనుకోకపోతే ఒక పదం చెప్తాను దానికి అర్థమేమిటో ఇంగ్లీషులో చెప్తారా ?" అంది ఆ అమ్మాయి చొరవకు నాకెంతో ముచ్చటవేసింది ఏ కఠినమైన పదం అడుగుతుందోననుకున్నా ఆ అమ్మాయి బాగా ఆలోచించి, 'జలము' – అంటే ఏమిటి ?" అంది, "నీళ్ళు" అని అడిగితే నేనిట్టే జవాబివ్వొచ్చేమోననుకొని వెంటనే అర్థం చెప్పేశాను "వాటర్," అని "అరే! కఠినమైన పదానికి కూడా అర్థం చెప్పేశారే !" అంటూ ఆ అమ్మాయి తెల్లబోతూ, రూపాయి నోటును మరో అమ్మాయికి చెల్లించేసింది నేను నవ్వుతూ, "అమ్మాయీ ! జలం అంటే తమిళంలో కూడా నీళ్ళే అసలది సంస్కృత పదం నీకు తెలీదా ?" అన్నాను రెండో అమ్మాయి "భలే భలే ! మొత్తంమీద నేనో రూపాయి గెలిచాను," అంటూ ఆ నోటును నా దగ్గరికి తీసుకొచ్చి, "దీని మీద ఆటోగ్రాఫ్ చేయారూ ?" అంది "తప్పు – తప్పు ఇది లక్ష్మి నోటుమీద నేను సంతకం చేయను నీ దగ్గరున్న పుస్తకాలలో ఏదైనా ఇవ్వు దానిమీద సంతకం పెడ్తాను," అన్నా అలాగే ఆ అమ్మాయి ఓ నోట్‌బుక్‌లో ఓ ఖాళీ కాగితం చూపించింది దానిమీద సంతకం పెడుతూండగా రూపాయి ఓడిపోయిన అమ్మాయి, "మరి, నాకూ ఆటోగ్రాఫ్ ఇవ్వరూ ?" అంటూ తనొక పుస్తకం ఇచ్చింది దానిమీద సంతకం పెడ్తూ, "చూడమ్మాయ్ ! ఇన్ని తెలుగు పిక్చర్లలో ఆక్ట్ చేశాను నాకు తెలుగు రాదని ఎలా అనుకున్నావ్ ? మీ తెలుగు చాలా ఈజీగా నేర్చుకోవచ్చు తమిళమే కష్టం," అన్నాను "థాంక్సండీ మాకు స్కూల్‌కు టయిమైపోయింది ఇక వెళ్తాం," అన్నారిద్దరూ "విష్‌యూ ఆల్ ది బెస్ట్ !" అని ఇద్దరికీ చెప్పాను సంతోషంతో 'టాటా' చెప్పి బయలుదేరారు

నేను మద్రాసు చేరుకున్నాక ఆ ఇద్దరమ్మాయిలూ నా ఫోటోను పంపమని కోరుతూ ఒకే కవర్‌లో ఉత్తరాలు రాశారు చెరొక ఫోటో పంపిస్తూ, "ఇక్కడ మద్రాసులో జలానికి ఎద్దడిగా ఉంది," అని రాశాను చదువుకుని వాళ్ళిద్దరూ నవ్వుకొని ఉండాలి ★





# డాక్టర్ సలహాలు

## డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### ఎమ్ హెచ్. - భువనేశ్వర్

నాకు వివాహమై 5 సంవత్సరములయినా ఇంకా పిల్లలు కలుగలేదు డాక్టరు సలహాపై చాలా మందులు వాడాను డి అండ్ సి ఆపరేషన్ గూడా చేయించుకున్నాను బహిస్టుకు ముందు 4, 5 రోజులు విపరీతంగా కడుపునెప్పి వస్తోంది. ఈ కడుపునెప్పి తగ్గాలంటె, పిల్లలు కలగాలంటె ఏమి మందులు వాడవలెను ?

★ మీ శ్రీవారికి సెమినల్ అనాలిసిస్ చేయవలసి ఉంటుంది అందులో ఏ లోపమూ లేదని తెలిసినప్పుడు, మీరు ట్యూబ్ టెస్టింగ్ చేయించుకోవాలి యూటెరస్‌లోని లోపలి పొర అయిన ఎండోమెట్రియం బయాప్సీ - చేయవలసి ఉంటుంది. వీటి ఫలితాలననుసరించి చికిత్స చేయించుకోవలసి ఉంటుంది

కడుపునెప్పికి ఆస్పిరిన్, బెరాల్గాన్ వంటి మాత్రలు తాత్కాలికంగా మాత్రమే పనిచేస్తాయి. కడుపునెప్పికీ పిల్లలు కలుగకపోవటానికీ సంబంధం లేదు

### ఎ. ఆర్. — ఊవూరు

మా అమ్మాయి వయస్సు 23 సం॥లు ముఖం ముడతలతో కాంతి విహీనంగా తయారయింది. ముఖం బాగా కళకళలాడుతూ ముడతలు పోవాలంటే యేం చేయాలి ? ఆరోగ్య లోపం ఏమీలేదు ?

★ ఆహారంలో అన్నిరకాల పోషకపదార్థాలు వాడటం అవసరం. ప్రొటీన్లు, క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండేటట్లు చూడటం అవసరం ముఖానికి ఆలివ్ ఆయిల్ పూసి ప్రతిరోజూ ఎక్కువ వత్తిడి తగలకుండా రుద్దటం మంచిది మలపరీక్ష చేయించి కడుపులో క్రిములుంటే తగిన చికిత్స చేయించవలసి ఉంటుంది ప్రతిరోజూ పూటకి ఒకటి వంతున మల్టి విటమిన్ మాత్రలు, విటమిన్ సి—500 మి గ్రా. మాత్రలు వాడటం వల్ల కొంత ఫలితం కనబడుతుంది.

### జి. వి పి. — బుక్కాపట్నం

నా వయస్సు 15 సం॥లు 3 నెలల నుండి బహిష్టు కావటంలేదు. ఎందుకు అలా అవుతున్నది? ఏ మందులు వాడాలి ?

★ బుతుక్రమం రావటం ప్రారంభం అయిన మొదట కొన్ని సంవత్సరాలలో ఇలా జరిగే అవకాశం ఉంటుంది కొందరికి మాత్రం అనీమియా ఉండటం వల్ల బుతుక్రమం ఆగిపోతుంది కొందరికి మాత్రం గర్భకోశంలో ఏర్పడే కొన్ని మార్పుల వల్ల బుతుక్రమం ఆగిపోవటం జరుగుతుంది మీరు లేడీ డాక్టర్ల వద్ద పరీక్ష చేయించుకోవటం అవసరం మందులు పరీక్ష చేసిన తర్వాత వారి సలహా ప్రకారం వాడటం మంచిది.

### ఎ. ఎస్ ఎల్ — వడింపాలెం

మా పాప వయస్సు 4 సంవత్సరములు 1 సంవత్సరము దాటిన తరువాత చిన్నబిడ్డ నెప్పి వచ్చినది ఆ సంవత్సరములో మూడుసార్లు వచ్చినది ఆ తర్వాత 10, 15 రోజుల కొకమారు వచ్చుచున్నది అలా వచ్చినప్పుడు పైకి చూస్తూ కంటి రెప్ప ఆర్పదు స్పృహ తప్పిపోతుంది ఒక చెయ్యి, కాలు వణుకుతుంది నోటినుండి నురగ వస్తుంది వెక్కిళ్ళలాంటి శబ్దము గొంతునుండి వస్తుంది 15, 20 నిముషములలో తగ్గుతుంది

★ దీనిని బ్రెత్ హోల్డింగ్ స్పెల్స్ అని అంటారు చిన్నపిల్లలలో ఉండే మానసిక ఆందోళనే ఇలా రావటానికి కారణం — అని శాస్త్రజ్ఞుల అభిప్రాయం అతి గారబం, లేక అధికంగా కట్టుదిట్టం చేయుటంవల్ల ఇలా వచ్చే అవకాశం ఉన్నది కొందరు ఇలా వచ్చినప్పుడు పిల్లల్ని ఎగుర వేయటం, చుట్ట మొదలయినవాటితో కాల్చటం చేస్తారు ఇలా చేయుటంవల్ల హాని తప్ప మేలు ఉండదు దాదాపు ఆరు సం॥ల వయస్సు వచ్చేసరికి ఈ లక్షణం తగ్గిపోయే అవకాశం ఉంటుంది పిల్లల పెంపకంలో శ్రద్ధ వహించటం అవసరం

### జి వి. — శ్రీశైలం డామ్

నా కుమారుని వయస్సు 35 సం॥లు టి బి మెనిన్‌జైటిస్ వ్యాధితో కంటిచూపు పోయినది వైద్యము చేయించగా ఇప్పుడు కొద్దిగా కనిపించు చున్నది కంటిలో ఆప్టిక్ నరము సరిగా పనిచేయక కనిపించుటలేదు ఆ నరము ద్వారా మెదడునుండి కంటికి రక్తప్రసరణ సరిగా జరుగుటలేదు అది పూర్తిగా బాగుగా పనిచేసిన కంటిచూపు బాగుగా కనిపించును అని డాక్టర్లు చెప్పినారు కంటిచూపు సరిగ్గా వస్తుందా ?

★ టి బి వ్యాధికిగాను సక్రమంగా చికిత్స చేయించటం అవసరం కనీసం 18 నెలల పాటైనా చికిత్స చేయించవలసి ఉంటుంది

కాలక్రమేణా చూపు మామూలుగా వచ్చే అవకాశం ఉంటుంది ★


చలి ...చలిగా ఉందిరా హాయి రామా
నూతన్
ఈ చలి కాలంలో మీటింగ్ పెడితే జనం రారేమో!! సార్!!
నా మీటింగ్ తర్వాత కాబరే డాన్స్ ఉందని ఎనౌన్స్ చేయిద్దాం!!!
నువ్వు వంట చేస్తావా?!! నా మీద హఠాత్తుగా ఇంత ప్రేమ ఎందుకు పుట్టుకొచ్చిందబ్బా!!
చలికాలం పొయ్యిదగ్గర కాసేపయినా వెచ్చగా వుంటుందిగా
చిత్రం మాసపత్రిక సంపాదకులు
ఇంతకు మునుపు మీ కార్టూన గీతలు చక్కగా వుండేవి!!! .......
చలికాలం కదండీ చేయి వణికింది అంతే సార్...
నాకేదో భయంగా ఉంది డాక్టర్! ఎప్పుడూ ఆ కుక్కని ప్రక్కన వేసుకొని పడుకొంటున్నారు
చలికాలం కదా కుక్క ఒళ్ళు వెచ్చగా ఉంటుందని... అలా పడుకొంటు... న్నారంతే!!
మీరు వణుకుతుంది చలికా లేక ఇప్పుడు అసెంబ్లీలో ప్రతిపక్షాలు ఏ... ఏ ప్రశ్నలు వేస్తారో నని...
చలికాలం పెళ్ళి చేసుకున్న ...హాయి అని ఎవరో అనుకొంటున్నారట... ఇప్పుడు పెళ్ళి చేయకపోతే... స్కూలుకి వెళ్ళడటుండు...
పెళ్ళి పెళ్ళి పెళ్ళి

# నీలాకాశం

సీరియల్ — శ్యామల

సాయంత్రం ఇద్దరూ కలిసి గేటువైపు నడుస్తున్నారు ఎదురుగా వస్తున్న వ్యక్తిని పలకరించింది వీణ "హలో, గుడీవినింగ్!"

"గుడీవినింగ్ వీణా! హౌ ఆర్ యూ?" అన్నాడు ఆయన

"ఇందిరా, మీట్ డాక్టర్ జాక్సన్ — నా ఫ్రెండ్ ఇందిర" పరిచయం చేసింది వీణ

డాక్టర్ జాక్సన్‌కి అరవై ఏళ్ళ వయస్సుంటుంది ఆయన విదేశీయుడని చూడగానే తెలుస్తుంది ఆరడుగుల ఎత్తు, భారీగా ఉన్నాడు మనిషి బట్టతల, తెల్లని దుస్తులు, చూడగానే హుందాగా, గౌరవనీయంగా అనిపించాడు

"నమస్తే" అంది ఇందిర

"నమస్తే, లిటిల్ గర్ల్" నవ్వుతూ అన్నాడు డాక్టర్ జాక్సన్ "చాలా సంతోషం" తెలుగుని ఇంగ్లీష్‌లాగే మాట్లాడాడు

వీణ నవ్వింది "నేను నెల రోజులు లీవుమీద ఢిల్లీకి, మా అన్నయ్య దగ్గరకు వెళ్తున్నాను నా స్థానంలో ఇందిర పనిచేస్తుంది" అని చెప్పింది

"అలాగా? రండి, ఇద్దరినీ కార్లో డ్రాప్ చేస్తాను" అన్నాడాయన కారు వైపు నడుస్తూ

అది ఒక పాత మోడల్ ఆస్టిన్ కారు పెయింట్ పోయి, పాతగా ఉంది చూడటానికి ఇందిర ముఖం చూసి ఆయన గట్టిగా నవ్వాడు "ఇది పాత కారే కాని అమ్మాయ్, విమానాన్ని మించిన జోరుతో పోతుంది భయపడకు!" అన్నాడు ఇంగ్లీష్‌లో

"భయమేం లేదండీ, ఊరికే చూస్తున్నాను" అంది ఇందిర

"పల్లెటూరి రోడ్లమీద ప్రయాణాలు చేసే కారు ఇది ఎన్నో ఢక్కామొక్కీలు తిని ఉంది నాతోపాటే!"

ముందు సీటులో ఆయన ప్రక్కన వీణ, వీణ ప్రక్కన ఇందిర కూర్చున్నారు కారు స్టార్ట్ చేశాడు డాక్టర్ జాక్సన్

ఈయన ఇండియాలో ఏం చేస్తున్నాడో? పల్లెటూర్లలో తిరిగే కారు అంటున్నాడు ఏదయినా పల్లెటూరిలో ఉంటున్నాడా? అక్కడ ఏం పనో ఈయనకి? ఏమో, ఎవరయితే తనకెందుకు? — అనుకుంటూ ఉండగానే కారు వీణ యింటిముందు ఆగింది వీణ థాంక్స్ చెప్పి దిగింది ఇందిర చెప్పినట్లుగా తీసుకువెళ్ళి ఆమె యింటిముందు ఆపాడు

ఇందిర దిగి "థాంక్యూ సో మచ్" అంది

"యూ ఆర్ వెల్‌కమ్! గుడ్‌లక్ టు యూ"

**(గత సంచిక తరువాయి)**

అని కారు పోనిచ్చాడు ఆయన

ముందు గదిలోనే ఉన్నారు రమేష్, సురేష్

"గుడ్ న్యూస్ బ్రదర్స్!" అంది ఇందిర

ఏమిటన్నట్లు చూశారు వాళ్ళిద్దరూ

"ఇప్పుడు మీ ఎదురుగా నిలబడి ఉన్నది ఎవరో తెలుసా? మిస్ ఇందిర, టైపిస్ట్, హోటల్ బ్లూ బెల్స్!" అంది

"నిజంగానా?" అన్నాడు రమేష్ ఆశ్చర్యంగా

"అఫ్‌కోర్స్, నిజంగానే" అన్నది ఇందిర, తమ్ముడి ఆశ్చర్యానికి నవ్వుతూ

"నేను నమ్మను!" అన్నాడు సురేష్

"నమ్ము, నమ్మకపొమ్ము!" నాటక ఫక్కీలో అంటూ లోపలికి నడిచింది ఇందిర

అమ్మమ్మ ఇచ్చిన కాఫీ త్రాగుతూ "ఆ హోటల్‌లో కప్పు కాఫీ అయిదు రూపాయలు అమ్మమ్మా! కాని ఈ కాఫీ రుచి మాత్రం లేదు" అంది

"పోనీ అమ్మమ్మని కాఫీ సెక్షన్‌కి ఇన్‌ఛార్జిగా తీసుకుంటారేమో, కనుక్కుందామా?" అన్నాడు రమేష్

అంతా నవ్వేరు

అప్పుడు ఇందిర చెప్పింది 'తనకు జాబ్ ఎలా దొరికిందీ' అన్నవైనం "టెంపరరీయే అనుకో—కాని జాబ్ మాత్రం మంచి గ్లామరస్‌గా ఉంది" అంటూ ఆ హోటల్ ఎంత గ్రాండ్‌గా ఉన్నదీ వర్ణించింది దాని ముందు ఉన్న పెద్ద తోట, వెనకాల ఉన్న స్విమ్మింగ్‌పూల్, ఎయిర్ కండిషన్డ్ గదులు, తివాసీలు, గాజు దీపాలు అన్నీ వివరిస్తుంటే ఆసక్తిగా విన్నారు అంతా

**జరిగిన కథ — 3** ఆ రోజు రామారావ్ సుభద్రల సిల్వర్‌జూబిలీ సెలిబ్రేషన్స్‌కి అన్ని ఏర్పాట్లు చేస్తారు వారి సంతానం ఇందిర, రమేష్, సురేష్, ఉష దానిలో భాగంగా రామారావ్, సుభద్రలను సినిమాకి పంపుతారు పిల్లలు సినిమా చూసి స్కూటర్‌మీద వస్తూ యాక్సిడెంట్‌లో మరణిస్తారు ఆ దంపతులు మధుతో ఇందిర పెళ్లి గతంలోనే ఖాయం చేయడం జరుగుతుంది తన తమ్ముళ్ల, చెల్లి భవిష్యత్తు తీర్చిదిద్దడానికి మధుకి యిష్టం లేక పోయినా ఉద్యోగంలో చేరాలనుకుంటుంది ఇందిర తన స్నేహితురాలు వీణ సహాయంతో ఓ ఫైవ్ స్టార్ హోటల్లో టెంపరరీ పోస్ట్‌లో ఇందిర టైపిస్ట్‌గా జేరుతుంది

అమ్మమ్మ మనసులో మనమరాలి పెళ్ళి విషయం మెదులుతున్నది చెట్టంత కూతురు, అల్లుడు పోయారు వాళ్ళను తలుచుకొని ఏడవాలా, ఈ పిల్లలను చూసే బాధ పడాలా— అని కుమిలిపోతున్నది ఆవిడ పెద్దపిల్ల పెళ్ళి అయినా అనుకున్న విధంగా అయిపోతే ఓ బాధ్యత తీరినట్లు ఉండేది ఆ పిల్ల పడనివ్వటం లేదు పైగా ఉద్యోగం వెతుక్కుంది తమ్ముళ్ళను వృద్ధిలోకి తెస్తానంటున్నది తన జీవితం పాడుచేసుకుంటున్నందుకు జాలిపడాలో, తముళ్ళకోసం కష్టపడుతున్నందుకు మెచ్చుకోవాలో, చెప్పిన మాట వినకుండా మొండిగా ప్రవర్తిస్తున్నందుకు కోపగించుకోవాలో, ఏం చేయాలో తోచని అమ్మమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది

అమ్మమ్మ దగ్గరకు వెళ్ళి కూర్చుంది ఇందిర

"అమ్మమ్మా! నేనొకటిచెప్తాను వింటావా?"

"వింటానే అమ్మా, వినకేం చేస్తాను?"

"ఇదిగో, నీవిలా నిష్ఠూరంగా మాట్లాడితే నేనసలు ఏం చెప్పలేను నీ బాధ నాకు తెలుసు పెళ్ళి చేసుకొని కాపురం చేసుకోక ఈ ఉద్యోగం ఏమిటంటావు అంతేనా?"

ఇందిర సామరస్యంగా చెప్తుంటే, మరొకసారి గట్టిగా తన అభిప్రాయం చెప్పి నచ్చజెప్పాలనిపించింది అమ్మమ్మకి

"ఇందూ, నీ పెళ్ళి మీ అమ్మ, నాన్న స్థిరపరిచారు! ఎంతో ముచ్చటపడి చేద్దామనుకున్నారు అనుకున్న ప్రకారం జరిగిపోతే వాళ్ళు ఎక్కడ ఉన్నా—" దుఃఖంతో మాట పెగల్లేదు ఆవిడకి కాస్సేపాగి "వాళ్ళకు ఆత్మ శాంతిగా ఉంటుందమ్మా! అర్థంచేసుకో తల్లీ"

ఇందిరకీ ఏడుపు వచ్చింది అమ్మమ్మ ఒళ్ళో తల దూర్చి అలాగే ఉండిపోయింది కొంతసేపు తర్వాత తలెత్తి అంది "అమ్మమ్మా, నేను పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతే రమేష్ ఇంజనీరు ఎలా అవుతాడు? సురేష్ డాక్టరు ఎలా కాగలడు? ఉష దిగులుతో ఇంకా కుంగిపోదా? అన్ని విధాలా ఆలోచించు"

"డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యేగితే ఉంటే ఇటువంటి పరిస్థితే రాకపోయేది! ఇందూ, సుఖానికి కొలతబద్దలు పెద్ద చదువులు, ఉద్యోగాలే కావమ్మా ఏవో మార్గాలలో వాళ్ళ జీవితాలు గడిచిపోతాయి ఉష విషయమూ అంతే భగవంతుడు లేడూ?"

"ఉన్నాడు, ఎందుకు లేదు?" ఉక్రోషంగా అంది ఇందిర "అమ్మని, నాన్నని మాకు లేకుండా చేసింది ఆ దేవుడు కాదూ? పైగా ఏవో మార్గాలు చూపిస్తాడుట! ఎక్కడున్నాడు అమ్మమ్మా, ఈ దేవుడు? నువ్వు నమ్ముకొని రోజూ దండాలు పెడుతూంటావు కదా, నీమీదైన అయినా కనికరం

చూపించలేదేం? నీ కళ్ళ ముందరే అమ్మని తీసుకుపోయాడేం? నీవు ఏం పాపం చేశావని ఇంతటి శిక్ష విధించాడు?''

''అట్లా మాట్లాడకూడదమ్మా అంతా కర్మఫలం''

''కర్మఫలం! పసిది ఉష ఏం చేసిందని, దానికి తల్లిని, తండ్రిని కరువు చేశాడు నీ దేవుడు? నాకు ఈ మాటలు చెప్పకు అమ్మమ్మా! కర్మ, విధి, దేవుడు ఆలోచించి ఆలోచించి మనసు వేడెక్కిపోతున్నది కాని, ఈ మాటలకు అర్థం మాత్రం తెలియటంలేదు! అందుకే, ఇవి కేవలం మాటలేనని, వాటికి అర్థమే లేదని నిర్ణయానికి వచ్చాను తమ్ముళ్ళని, చెల్లెలిని పెద్దవాళ్ళని చేయాలి అమ్మ, నాన్న ఉంటే వాళ్ళ జీవితాలు ఎలా సాగిపోతాయో, అలాగే జరగాలి అప్పటికి కాని నాకు తృప్తి ఉండదు అమ్మమ్మా! నా స్వశక్తినే నమ్ముకున్నాను, ఏ దేవుడినీ నమ్మలేకపోతున్నాను!''

ఇందిర ఆవేశం చూస్తే అమ్మమ్మగారికి మతిపోయినట్లే అయింది ఆ పిల్లకి తను నచ్చజెప్ప లేనని అర్థమయింది ''మరి నీ బ్రతుకు సంగతేమిటి తల్లీ! పెళ్ళి, సంసారం లేకుండా ఉండగలవా?''

అమ్మమ్మ ఆదరంగా అడుగుతుంటే బావురుమని ఏడవాలనిపించింది ఇందిరకి చిన్నప్పుడు ఆటల్లో ఏదయినా దెబ్బ తగిలించుకొని ఏడుస్తూ వస్తే, అమ్మ దగ్గరకు తీసేది ఆ ఆప్యాయతకే నెప్పి మాయమయేది ఇప్పుడు తగిలిన దెబ్బ మనసుకి అమ్మమ్మకి చెప్పుకుందామనిపించింది

''అమ్మమ్మా, మధుకి పరిస్థితి అంతా వివరించి చెప్పాను రెండు, మూడేళ్ళ తర్వాత పెళ్ళి చేసుకుందాం, అర్థం చేసుకోమన్నాను కాని అతను అర్థం చేసుకోలేదు అమ్మమ్మా! 'నాకంటె తమ్ముళ్ళు ఎక్కువా?' అన్నాడు 'అట్లా కొలతలు వెయ్యలేను కాని నేనే కావాలనుకుంటే, కాస్త బరువు దింపుకొనేదాకా ఆగమ'న్నాను 'నీకు నేనే కావాలనుకుంటే ఇప్పుడే పెళ్ళి చేసుకుందామ'న్నాడు అతను నేను ఒప్పుకోలేదు కోపగించుకొని వెళ్ళిపోయాడు,'' అంది నెమ్మదిగా ఇందిర

తల్లితండ్రులతోపాటు ప్రేమించిన వ్యక్తినీ దూరం చేసుకున్న ఇందిరను చూస్తుంటే ఆవిడకు ఆప్యాయత ముంచుకొచ్చింది మనమరాలి కళ్ళు తుడిచి, దగ్గరకు తీసుకొని, ''ఇంత జరిగినా నీ నిర్ణయం మార్చుకోలేదంటే, నీ పట్టుదల అర్థమవుతున్నది ఇందూ! సరే, ఎలా జరగవలసి ఉంటే అలా జరుగుతుంది ఊరుకో, తల్లీ ఏడవకు!''

* * *

ఆ రాత్రి ఓ పట్టాన నిద్ర పట్టలేదు ఇందిరకి రేపు తను ఉద్యోగంలో చేరబోతున్నది అమ్మ, నాన్నల బాధ్యతను తన భుజస్కంధాలపైకి తీసుకోబోతున్నది ఈ టెంపరరీ ఉద్యోగం ముగిసేలోగా మరొక పర్మనెంట్ ఉద్యోగం దొరికితే— ఇంక ఆర్థికంగా ఏ దిగులూ ఉండదు

కాని కాని మధు అతన్ని జారవిడుచుకుంటున్నది తను మధూ! నువ్వు, నేను ఒకటవాలని ఎన్ని కలలు కన్నాము? ఊహల్లో ఎన్ని మేడలు కట్టాము? తమ్ముళ్ళ జీవితాలు ఓ దారిన పడేదాకా ఆగమన్నాను నీవు ఆర్థిక సహాయం చేయటానికయినా సిద్ధపడ్డావు కాని, నా కోరికను ఒప్పుకోలేదు అమ్మ, నాన్న నాపైన వదిలిపెట్టిన బాధ్యతలు ఈ చిన్నవాళ్ళు వాళ్ళు సెటిల్ అవనిదే నేను పెళ్ళి చేసుకోలేను – అది నాకు చేతకాదు కాని మధూ, నువ్వు నాకు దక్కవు అనే ఆలోచన భరించటం కూడా చేతకావటంలేదు ఏం చేయను? అమ్మా, నాన్నా! మీరు ఉన్న లోకంనించి, నన్ను కనిపెట్టి ఉండండి సరయిన దారి చూపించి, ఆ దారిలో నడవగలిగే శక్తి ఇవ్వండి నిద్రలోకి జారిపోయింది ఇందిర

చీకటితోనే లేచి, అమ్మమ్మకి పనిలో సాయం చేసి, ఉషని బడికి రెడీ చేసి, తనూ రెడీ అయింది ఇందిర తొమ్మిది గంటలు అవకుండానే బయల్దేరింది తీరా రోడ్డుపైకి వచ్చాక, ఇంత ముందుగా ఎందుకు వెళ్ళటం అనిపించింది తిరిగి ఇంట్లోకి వెళ్ళాలనిపించలేదు బస్‌స్టాండ్‌కి నడిచి మధు ఇంటి వైపు వెళ్ళే బస్ ఎక్కింది ఆ రోజు – మధుకి తన నిర్ణయాన్ని చెప్పాక, అతను అంగీకరించకుండా వెళ్ళిపోయాక, అతన్ని తిరిగి ఇంతవరకు చూడలేదు రెండుసార్లు వాళ్ళ యింటికి తనే వెళ్ళింది మధు తల్లి, అన్నయ్య, వదిన ఏదో ఫార్మల్‌గా మాట్లాడారు కాని వెనకటి ఆప్యాయత లోపించినట్లు తోచింది అమ్మ, నాన్న పోయి, దాదాపు అనాథగా నిలబడిన పిల్ల కోడలు కావటం వాళ్ళకు యిష్టం లేదని గ్రహిం



చింది లోకంతీరే అంత అని సరిపెట్టుకుంది కాని సరిపెట్టుకోలేకపోయినదల్లా మధు విషయంలోనే తను వెళ్ళిన రెండుసార్లు మధు ఇంట్లోలేడు తను వచ్చి వెళ్ళిన సంగతి అతనికి చెప్పమని యింట్లో వాళ్ళకి మరీమరీ చెప్పి వచ్చింది అయినా అతను రానేలేదు ఉద్యోగ ప్రయత్నాలలో తను కొట్టుకు పోతున్నది ఒకసారి అతని బ్యాంకికి ఫోన్‌చేసి రమ్మని అడిగింది

"నీ నిర్ణయం అదేనా ఇందిరా, మార్చుకున్నావా ?" మామూలుగా అడగినట్లే అడిగాడు

తనేం అనలేకపోయింది "ఓ మారు యింటికి రా మధూ, అన్నీ మాట్లాడుకుందాం మనసేం బాగా లేదు" అంది చివరికి

"నాకు తెలుసు ఈ సమయంలో నీకు తోడుగా ఉండాలనే నా కోరిక కూడా ! కాని నీకు నేను అక్కర్లేదన్నాక—"

"మధూ, నేను ఆ మాట అన్నానా ఎప్పుడయినా ? పెళ్ళి ఇప్పుడే ఎందుకు వద్దంటున్నానో వివరించి చెప్పలేదూ ? అర్థం చేసుకోవెందుకని ?"

"నువ్వు మాత్రం నన్నెందుకు అర్థం చేసుకోవు ? ఎప్పుడో పెళ్ళి అంటే ఒప్పుకోలేనని ఆ రోజే చెప్పలేదూ ? ఇందిరా, ఇది ఆఫీసు, ఇప్పుడు మాట్లాడలేను అయినా మనమధ్య ఇంకా మాటలు మిగిలాయా ?" ఫోన్ పెట్టేశాడు స్థాణువులా ఉండిపోయింది తను

మళ్ళీ ఈ రోజు అతన్ని కలుసుకోటానికి బయల్దేరింది 'మధూ, మనిద్దరం కలిసి బ్రతుకుదామని ఎన్ని ప్లాన్లు వేశాం' అని గుర్తుచేసి, మరొకసారి తమ్ముళ్ళ విషయంలో తన ఆశయాలు వివరించాలని బయల్దేరింది ఇందిర

మధు యింటి తలుపు తడుతుంటే గుండె దడదడ లాడింది ఎవరు తీస్తారో తలుపు ? మధు వదిన కాని, అమ్మకాని తీస్తారు మధు ఆఫీసుకి వెళ్ళిపోయాడంటే ఏం చేయటం ? ఇంట్లో వాళ్ళు ఆదరంగా మాట్లాడుతారో, లేదో ? ఎవరూ తలుపు తీయక పోవటంతో, రెండు నిమిషాలు ఆగి తిరిగి తలుపు తట్టింది

ఈమారు తలుపు తెరుచుకుంది తీసింది మధు ! ఆఫీసుకి వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నట్లున్నాడు, డార్క్ బ్లూ పాంట్‌లోకి తెల్లని షర్ట్ టక్ చేశాడు, స్మార్ట్‌గా కనిపిస్తున్న అతన్ని సంభ్రమంగా చూస్తూ ఉండిపోయింది ఇందిర

మధు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయాడు ఓ నిమిషంపాటు

"లోపలి రా, అలా చూపులతోనే మింగేస్తే ఎలా ?" నవ్వుతూ అన్నాడు

లోపలికి వచ్చి, చుట్టూ చూస్తూ అడిగింది ఇందిర, "ఎవరూ లేనట్లున్నారు ?"

"నువ్వు, నేను ఇద్దరం ఉన్నాం కదా ?"

నవ్వింది ఇందిర "అమ్మ, వదిన ఎవరూ కనబడరేమిటి, అని నా ప్రశ్న !"

"మా అత్తయ్య కొడుకు పెళ్ళికి అమలాపురం వెళ్ళారు అందరూ ఆఫీసులో ఏవో మీటింగ్స్ జరుగుతున్నాయని, నేను ఉండిపోయాను"

''మధూ ఎలా ఉన్నావు ?'' ఇన్నాళ్ళూ తనను చూడకుండా ఉన్నందుకు కోపం, అర్థం చేసుకోవటంలేదని బాధ, ఇన్నాళ్ళ తర్వాత చూస్తున్నందుకు సంతోషం, అతనిపట్ల అనురాగం – అన్నీ కలిశాయి ఆమె స్వరంలో

తదేకంగా ఆమెనే చూస్తూ ఉన్న మధు కొంతసేపు ఏం మాట్లాడలేదు తర్వాత ''ఇందిరా, అది నేను అడగవలసిన ప్రశ్న నువ్వు ఎలా ఉన్నావో చెప్పు !'' అన్నాడు

ఇందిర సోఫాలో కూర్చుంది మధు ప్రక్కనే కూర్చున్నాడు

''ఇందిరా, నీవెంత చిక్కిపోయావో తెలుసా ? కళ్ళ కింద ఆ నల్లని చారలేమిటి ? అసలు తిండి తింటున్నావా ?'' ఆమె రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకొని ''ఈ చేతులు చూడు, ఒట్టి ఎముకలు తప్ప ఏం లేవు ! ఇలా నీ ఆరోగ్యం విషయం చూసుకోకుండా గడిపితే, పోయిన అమ్మ, నాన్న తిరిగి వస్తారా ?'' ఆర్ద్రంగా అన్నాడు

కళ్ళు దించుకొని అలాగే వుండిపోయింది

''మనిద్దరం వెంటనే పెళ్ళి చేసుకుందాం ఇందిరా ! ప్లీజ్, కాదనకు నిన్ను దగ్గర ఉంచుకొని, శ్రద్ధగా కాపాడుకొని, జాగ్రత్తగా చూసుకొనే అవకాశం ఇవ్వు !''

అతను అంత ఆప్యాయంగా మాట్లాడుతుంటే ఇందిరక కళ్ళలో నీళ్ళు తిరిగాయి ''తమ్ముళ్ళని, చెల్లిని ఏం చేయను మధూ ? వాళ్ళ జీవితాల సంగతి ఏమిటి ?''

''మరి నీ సంగతి ఏమిటి డియర్ ? నీ తమ్ముళ్ళు, చెల్లి గురించిన జాగ్రత్తలు నువ్వే చూసుకో నీ గురించి జాగ్రత్తలు నేను తీసుకుంటాను ముందు పెళ్ళి అయిపోనివ్వు''

''అదెలా సాధ్యం మధూ ?'' నిస్సహాయంగా అంది ''పెళ్ళి అయినాక ఉద్యోగం చేసి వాళ్ళను పైకి తెస్తూ, ఇటు నీ భార్యగా, ఈ యింటి కోడలుగా విధులు నిర్వహించటం సాధ్యం అంటావా ? పెళ్ళయినాక ఇంక నేను ఆ యింటి పిల్లను కాను మీకు చెందిన మనిషిని వీలయితే వాళ్ళకు సాయం చేస్తాను, లేకపోతే లేదు కాని, వాళ్ళని పైకి తేవటమే ధ్యేయంగా పెట్టుకున్నాను నేను ప్రస్తుతం ఇప్పుడు పెళ్ళి కుదరదు మధూ ! ప్రస్తుతానికి నీ స్నేహం ఇవ్వు, అది చాలు తమ్ముళ్ళు ఓ దారికి వచ్చాక నేను నీ దాన్నే ! ప్లీజ్, అర్థమయింది కదూ ?''

''అయితే తమ్ముళ్ళకోసం నీ సుఖం త్యాగం చేయాలనే నిశ్చయించుకున్నావన్నమాట !''

''ఇందులోనే నా సుఖం ఉంది మధూ ! దానికి త్యాగం అని పేరు పెట్టకు..''

''ఇందిరా, లోకం తీరు ఎలా వుంటుందో చెప్పనా ? ఇప్పుడు వాళ్ళకోసం పెళ్ళి మానుకొని, ఉద్యోగంలో చేరి యాతన పడుతున్నావా–రేపు వాళ్ళ చదువులయినాక వాళ్ళు వాళ్ళు పెళ్ళిళ్ళు చేసుకొని హాయిగా సెటిల్ అవుతారు నువ్వు ఇలాగే వుండిపోతావు . నీ గురించి ఎవరూ పట్టించుకోరు .''

''మధూ, వాళ్ళు హాయిగా సెటిల్ అవాలనే కదా నా కోరిక ? అందుకే కదా ఈ ప్రయత్నం అంతా ? ఇక నా విషయం అంటావా – నేను ఇలాగే ఎందుకు ఉండిపోతాను, నిన్ను పెళ్ళి చేసుకుంటాను కదా ?'' నవ్వుతూ అంది

మధు తిరిగి నవ్వలేదు సీరియస్‌గా ఉంది ముఖం ''ఇందిరా; నీ బాధ్యతలు ఎప్పటికి పూర్తి అవుతాయో నాకు తెలీదు. బహుశా నీకూ సరిగా తెలీదు అప్పటిదాకా నీవు పెళ్ళి మానుకొని శ్రమ పడతానంటావు. నన్నూ అలా ఎదురుచూస్తూ కూర్చోమంటావు ! అంతేనా ?''

ఏం మాట్లాడలేదు ఇందిర

''అంతేనా ?'' రెట్టించాడు

''తమ్ముళ్ళని వాళ్ళ ఖర్మానికి వదలలేను నాకు చేతకాదు'' జాలిగా అంది.

''నువ్వు చాలా మొండిదానివి ఇందిరా !'' అన్నాడు పదునుగా

ఆ మాటల పదునుకి మనసులో భయం అనిపించినా, పైకి నవ్వుతూ అంది ''పట్టుదల అనరాదూ ?''

''ఆల్‌రైట్ ! నీ పట్టుదలే నువ్వుంచుకో ! నేను మాత్రం నీ దయ నాపైన ఎప్పుడు ప్రసరిస్తుందా అని ఎదురుచూస్తూ నీళ్ళుతరబడి కూర్చోలేను ! అది నాకూ చేతకాదు !''

ఇదే అతని ఆఖరు మాట అని గ్రహించింది ఇందిర అతని అహమే దెబ్బతిన్నదో, తనకోసం ఎదురు చూసేటంత బలం అతని ప్రేమకు లేదో, లేక ''వ్యర్థ త్యాగాన్ని'' (అతని మాటల్లో) సపోర్ట్ చేయటం అతనికి తెలివితక్కువగా కనిపించిందో ఏమయితేనేమిటి, మనసంతా మొద్దుబారినట్లయింది ఇందిరకి స్పష్టంగా తెలుస్తున్నదల్లా ఒక్కటే - డ్యూటీ పిలిచిన మార్గంలో వెళ్ళాలి గుండెల్లో మంటలు అక్కడే ఉంచేసి, తన విధి నిర్వహించాలి

## 4

'హోటల్ బ్లూబెల్స్' లోకి బెరిపిస్తూగ అడుగు పెట్టింది ఇందిర అది ఊరిలోని పెద్ద హోటల్స్‌లో ఒకటి విదేశీయులు, సినిమా తారలు, పెద్ద వ్యాపారస్తులు అక్కడ బసచేస్తూ ఉంటారు పెద్ద కాన్ఫరెన్స్ హాలు, బాల్‌రూమ్ డ్యాన్స్‌హాల్, రూఫ్ గార్డెన్, స్విమ్మింగ్‌పూల్ మొదలైనవి ఉన్నాయి పెద్ద గేటు దాటి లోపలికి వెళ్తే విశాలమయిన ఆవరణలో ఒక వైపంతా పచ్చగడ్డి లాన్, మరొకవైపు గులాబీతోట మధ్యలోని త్రోవకి రెండు వైపులా క్రోటన్ మొక్కలు విశాలమైన పోర్టికో దాటి మెట్లు ఎక్కగానె గాజు తలుపులు వాటివెనకే పెద్ద హాలు ఆ హాలంతా లేత నీలంరంగు కార్పెట్ పరచబడి వుంది. అక్కడక్కడా సోఫాలు, టీపాయ్‌లు, కుండీలలో రబ్బరు మొక్కలు ఉన్నాయి ఆ హాల్లోనే రిసెప్షనిస్ట్‌లు ఉన్నారు హాలు దాటాక కాఫీషాప్, రిఫ్రెష్‌మెంట్స్ హాల్ మొదలైనవి ఉన్నాయి ప్రక్క వరండాలో పైకి వెళ్ళటానికి లిఫ్ట్ ఉంది మరొక కారిడార్‌కి ఇరువైపులా హోటల్ స్టాఫ్ ఆఫీసు గదులు ఉన్నాయి వీణ నిన్న చూపించిన గదివద్దకు వెళ్ళి కాస్త బిడియంగా స్వింగ్ డోర్స్ నెట్టింది ఆ గదిలో పెద్ద టేబుల్ వెనకాల కూర్చొని ఉన్నాడు మైకేల్ అనే నడివయస్సువ్యక్తి. అతను అమెరికాలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదివాడు అతనికి టైపిస్ట్ వీణ ఇప్పుడు రాబోయే నెల ఆ పని ఇందిర చేయాలి. నిన్ననే వీణ ఇందిరని అతనికి పరిచయం చేసింది.

''హలో, వచ్చేశారా ? గుడ్ మార్నింగ్ అలా కూర్చోండి'' టేబిల్‌పైన కాగితాలు చూసుకుంటున్నాడు అతను. ఇందిర ఆ గదిని గమనిస్తూ కూర్చుంది మిగతా హోటల్ లాగే ఆ గది కూడా చక్కగా అలంకరింపబడి ఉంది

## విద్యార్థిలోకం వ్యాస రచన పోటీలో ప్రత్యేక బహుమతి రు. 150/-లు పొందిన వ్యాసం

# మా విద్యార్థిలోకం ఆశయాలు

నేడు అడుగడుగునా సమస్యలు ఎదుర్కొంటున్న ప్రపంచములో భావి పౌరులు కాగల విద్యార్థుల సమస్యలు మరిన్ని విద్యా దశలో విద్యార్థి తాము ఉత్తమునిగా కావాలని ఆశిస్తాడు మానవుడు ఆశాజీవి అతడు తన ఊహలతో అనేక ఆశయాలను అల్లుకుంటాడు అట్లే ప్రతీ విద్యార్థి, తాను ఉత్తమ విద్యార్థి కావాలని, సమగ్రమైన విద్య ద్వారా సంపూర్ణ విద్యా పరిజ్ఞానాన్ని గ్రహించి, తద్వారా సంఘములో ప్రముఖమైన గౌరవప్రదమైన స్థానాన్ని అలంకరించాలని ఆశిస్తాడు అయితే అతని ఆశయాలు వాస్తవానికి దూరమవడం, ఆచరణ సాధ్యం కాకపోవటం వల్ల నిరుత్సాహమే కాక నేటి విద్యాలోకంలో అనేక సమస్యలు తలెత్తుచున్నవి

దీనికి ప్రధానమైన కారణాలు రెండు అవి విద్యారంగంలోని లోపాలు, లోపభూయిష్టమైన ప్రభుత్వ విధానాలు నేటి విద్యా లోకంలో శీఘ్రముగా మార్పులు తీసుకురావడం, కొత్త పద్ధతులను ప్రవేశ పెట్టడం వలన విద్యాలోకం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది సిఫార్సులు (రికమండేషన్లు), లంచాలకు ప్రాధాన్యత లభిస్తుండడంతో సగటు విద్యార్థి దెబ్బ తింటున్నాడు

విద్యార్థులకు సకాలములో పాఠ్యపుస్తకముల సరఫరా జరుగకపోవటం వలన సంవత్సరాంతానికి కోర్సు పూర్తి కాకపోవడం, కోర్సు పూర్తి చేయుటకు ఉపాధ్యాయులు అతి త్వరగా పాఠాలు చెప్పడం, దానితో విద్యార్థులు అర్థం చేసుకోలేక క్రమక్రమంగా వెనుకబడడం సర్వసాధారణముగా జరుగుచున్నది సమ్మెలు కూడా దీనికి దోహదము చేయుచున్నవి ఈ సమస్యా పరిష్కారానికిగాను సకాలములో పాఠ్యపుస్తకాల సరఫరా జరుగుటకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి

అంతేకాక నేటి- ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో నాయకులు మారుతున్నకొలది విద్యా విధానం కూడా మారడం జరుగుచున్నది అంటే క్రొత్త విద్యా నాయకులు అధికారంలోనికి వచ్చినపుడు వారికి వారి దృష్ట్యా విద్యావిధానంలో లోపాలు కనిపించడం, వారి వైజ్ఞానికనుగుణంగా క్రొత్త మార్పులు తీసుకురావడం జరుగుచున్నది ప్రస్తుత కాలంలో పుస్తకాలు చూచి వ్రాయు పద్ధతి ప్రవేశపెట్టడం ప్రభుత్వ దృష్టిలో

### రచయిత్రి పరిచయం



''జన్మ స్థలం — ఏలూరు కాని ఊహ తెలిసి విద్యాభ్యాసమును ప్రారంభించినది రాజమండ్రిలో

మా నాన్నగారి ఉద్యోగ రీత్యా ప్రస్తుతము వైజాగ్‌లో ఉంటున్నాము

ఇచట 'సేక్రెడ్ హార్ట్ హైస్కూల్'లో చదువు కొనసాగించుచున్నపుడు, ఈ స్కూలు తరపున వైజాగ్‌లో జరిగిన అనేక వ్యాస, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందాను

విద్యార్థిగా నా కర్తవ్యములను, వ్యక్తిగతంగా ఉన్నత అభిప్రాయములను ఏర్పరచుకోగల్గడానికి కారణం మా నాన్నగారు

ఈ వ్యాసరచన పోటీకి నన్ను ప్రోత్సాహపరచిన నా తల్లిదండ్రులకు, బహుమతినిచ్చి ఆనందమును కల్పించిన ఆంధ్రసచిత్ర వార పత్రికకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు ''

**— డి. గాయత్రి**

వున్నది కాని ఈ పద్ధతి సమంజసమైనదికాదు పరీక్షలనేవి విద్యార్థుల విద్యా నైపుణ్యాన్ని పరీక్షించేందుకుగాను ఉద్దేశింపబడినవి కావున ఇటువంటి అసమర్థమైన విధానాలకంటే లోపాలను, సమస్యలను పరిశీలించి సరియైన విధానాలు ప్రవేశపెట్టాలి

పరీక్షాపత్రాలు పరీక్షలకు ముందే విద్యార్థులకు తెలిసిపోవడం, అధికారుల అసమర్థత లోపభూయిష్టమైన ప్రభుత్వ విధానాలకు నిదర్శనము నేడు బహిరంగంగా పరీక్షాపత్రాలు అధిక ధరలకు అమ్మడం జరుగుతున్నా ప్రభుత్వం దీనిని అరికట్టలేకపోవుచున్నది పరీక్షాపత్రాలు వెల్లడి అయ్యాయని తెలియగానే వెనుకబడిన విద్యార్థులు వాటిని కొని చదివి సులభంగా పరీక్షకు హాజరౌతారు ఇది బాగా చదివే విద్యార్థులను కృంగదీస్తోంది ఒక్కొక్కప్పుడు తప్పుడు పేపర్లు వెల్లడి అవడం, కేవలం దానిని మాత్రమే చదివిన విద్యార్థులు పరీక్షలు రాయలేకపోవడం, పూర్తిగా దెబ్బతినడం జరుగుతున్నది కాబట్టి ఈ విధానాన్ని తక్షణమే బహిష్కరింప వలసిన అవసరం ఎంతైనా ఉన్నది

ఇటీవల ఈ విషయాన్ని గూర్చి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన వచ్చే విద్యాసంవత్సరము నుంచి అనేక ప్రశ్నాపత్రాలను అచ్చు వేయించి ఒక్కొక్క సెంటర్లో ఒక్కొక్క పేపరు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు కాని ఇది కూడా ఆశాజనకమైనది, సమంజసమైనది కాదు వేరు వేరు పేపర్లు ఇవ్వడం మూలంగా ఒక సెంటర్లో పేపర్లు కష్టంగాను, మరొక చోట సులభంగాను ఉండవచ్చును దీనిమూలంగా విద్యార్థులు నిరాశ పొందుతారు కాబట్టి ఈ విద్యా విధానంలోని లోపాలను, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సరియైన దృష్టితో సక్రమంగా సమర్థవంతంగా నిర్మూలించాలి

''నేటి విద్యార్థులే రేపటి భావి పౌరులు '' కాబట్టి ఈ విధమైన సమస్యలలో వారు పెరిగితే వారు ఉత్తమ సంస్కారవంతులుగాకాని, విద్యావేత్తలుగాకాని రేపటి సమాజోద్ధరణ పౌరులుగా కాని కాలేరు, కాజాలరు

కావున విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ అధికారులు, విద్యాధికారులు సమగ్రమైన దృష్టితో పరిశీలించి, పరిష్కరించవలెను ★

---

## నీలాకాశం

కాగితాలు ప్రక్కన పెట్టేసి ''మిస్ ఇందిరా, వర్క్ ప్రారంభిద్దామా ?'' అన్నాడతను చిరు నవ్వుతో

''అలాగే'' అంది ఇందిర కూడా చిన్నగా నవ్వి

''వెరీగుడ్ ! ఇదిగో ఈ కాగితాలు చూశారా ? వీటిలో లెటర్స్, బిల్స్, రశీదులు అన్నీ వేరు చేయండి లెటర్స్ నాకు ఇచ్చేసి తక్కినవాటెనంబర్లు లెడ్జర్‌లో రాయండి ఆ తర్వాత ఇవిగో, రూములు రిజర్వ్‌చేయమని కోరుతూ రాసినవాళ్ళకి అలాట్ చేసిన రూము నంబర్లు, తారీకుల లిస్టు వాటి ప్రకారంగా జవాబు టైపు చేయండి మోడల్ లెటర్, ఇదిగో తీసుకోండి'' అంటూ ఓ కట్ట కాగితాలు ఇందిరకి అందించారు ''ఏదయినా తెలియకపోతే అడగండి !'' అని స్నేహంగా ఓ మాట కూడా కలిపాడు

కాగితాలు తీసుకొని ప్రక్క గదిలోకి వెళ్ళింది ఇందిర అక్కడ ఆరు టైప్‌రైటర్లు ఉన్నాయి ఇందిర నిన్న వీణ కూర్చున్నచోట వెళ్ళి కూర్చుంది తక్కిన టైప్ రైటర్ల వద్ద ఉన్న వాళ్ళు స్నేహంగా పలకరించారు ఇందిరని

(ఇంకా వుంది)

# ప్రశ్నావళి

కె రామలక్ష్మి

**టి వి ఎస్ నందలూరు**

ఇద్దరు ప్రాణ స్నేహితులు. ఒకరు ఇంటర్ పాసయ్యాడు ఇంకొకడు ఫెయిలయ్యాడు. ఫెయిలయినవాడు మాట్లాడ్డం మానేశాడు

అదీ—ప్రాణ స్నేహమంటే!! ఇద్దరూ ఫెయిలయి స్నేహం చిరస్థాయిగా పెంచుకోవలసింది

**విజేంద్ర, ఆదోని**

ప్రేమ అనే పదానికి అక్షరాలు రెండే అయినా వాటి అర్థం తెలియకుండా యువతరంగం అంతా ప్రేమ పిచ్చిలో పడిపోతున్నారు వీరినంతా ఏమనాలి!

ఇంకేం అంటారు—ప్రేమపిచ్చోళ్లు!

**పి పి ఆర్ నూజివీడు**

మీరు కూడా పత్రిక్కి ఏదైనా సీరియల్స్ యివ్వకూడదు?

రాయాలనేవుంది ఓపిక తగ్గింది, అందుకే ఏడాదికొకటి రాస్తే చాల్లే అనుకుంటున్నాను

**యి టి కె ఖరగ్‌పూరు**

రావణుడే రాముడైతే?

రావణుని తన్ని సీతని రక్షించేవాడు .

**టి వి మంగళగిరి**

నాకు కథలు రాయాలని వుంది కథలు వ్రాయాలంటే ఏం చేయాలి!

వ్రాయాలి, అంతే!

**కె వి డి ఆగ్నుకొండ**

కవితలు రాయాలని కథలు రాయాలని ఇలా ఎన్నో వూహలు మరెన్నో ఆలోచనలు—కాని తీరా రాద్దామని కలం పట్టేసరికి అన్నీ గజి బిజి వూహాల్లాగే అనిపిస్తున్నాయి ఎలా ఏం చేయాలి?

మీ రింకా పాత కాలం వారిలాగా తోస్తున్నారే కలంపట్టి రాసి తరవాత ఆలోచించడం యీనాటి పద్ధతి రాస్తూండండి గజి బిజిలోంచే క్రమం ఏర్పడుతుంది కల్లోలంలోంచి ప్రశాంతత పుట్టినట్టు

**పి. డి. కడప**

నేను నన్ను ఎవరేనా తక్కువ చేసి మాట్లాడితే, హేళనగా మాట్లాడితే—బాగా అరుస్తాను తర్వాత ఏడుస్తాను .

ఇది మరీ బాగుంది—అన్నదానికి బదులు అరిచి పైగా ఏడవడం ఎందుకు—అవతలివాళ్ళు ఇంకా లోకువ చేయడానికా?—ఎవరైనా మనని తక్కువ చేసినా హేళన చేసినా యాసిడ్ వాతలాగా జవాబు చెప్పాలి లేదా ఇగ్నోర్ చేయాలి ఇగ్నోర్ చేసిన వాలేసిన కంటే ఎక్కువ ఉడుక్కుంటారు! గమనించండి

**టి, ఎమ్ పి మోరి**

సన్మార్గుడయిన వ్యక్తిని నిప్పులో పోలుస్తారు ఎందుకు!

ఎండు గడ్డిలాంటి దుర్మార్గుల పాలిటి అతగాడు నిప్పు కనుక మంచి వాడిని చూసి చెడ్డవాడు పిల్లైనంత తప్పుకు తిరగడం—సహజమే కద.

**డి. వి ఎస్ ఆర్ మటం సరియాపల్లి**

సత్యానికి నిజానికి తేడా ఏమిటి?

సత్యం ఆచరించవలసిన జీవిత పథం. నిజం చెప్పవలసిన మాట

**పి ఆర్ బి. విజయవాడ**

ఏమండీ మీరు ప్రశ్నావళికి ఎన్ని సంవత్సరాల నుంచి జవాబులు యిస్తున్నారు!

ఉత్సాహంతో చేసే పనిని రోజులెక్క పెట్టుకుంటూ ఎవరేనా చేస్తారా రఘు బాబూ?!

**కె వి ఎస్ — జి ఎల్ వి భవానీపురం**

మేం ఇద్దరం హైస్కూల్లో వున్నాం 16—17 వయస్సు మనస్ఫూర్తిగా ప్రేమించుకున్నాం

హైస్కూలు ప్రేమ కథలన్నీ నవ్వు నాకు సినిమాలు చూసి యిదా మీరు నేర్చుకోవలసినవి?!

**పి పి — విశాఖపట్నం**

ఈ రోజుల్లో మగవాడే ఆడదానికి కట్నం ఇస్తే ఎలాగ ఉంటుంది?

వస్తాయి ఆ రోజులూ కాని అప్పుడు ఆడది కాస్త మానవత్వంతోనే ప్రవర్తిస్తుంది

**సి వి కె ఆర్ జి — మామిడాడ**

మా క్లాసులో ఒక అమ్మాయి నిన్ను ప్రేమిస్తున్నానని ఉత్తరం రాసింది—

బివేర్! ప్రబరద్ తీరా జవాబిస్తే తన్నించవచ్చు అంత మొండిగా, నిర్లజ్జగా ముందే ఉత్తరం రాసే అమ్మాయికి—దూరంగా వుండడం మంచిది.

**కె. జి. ఎస్ కె. — కుప్పం**

నిరుద్యోగ సమస్య పెరుగుతున్నది ఆడవాళ్ళు ఉద్యోగం చేయడం వల్లనే అంటారు పురుషులు అమ్మాయిలు ఉద్యోగం చేసేట్టు మార్చింది వారే కదా?

కాదు ఆర్థికంగా స్వంత కాళ్ళపై నిలబడాలని ధైర్యం చేసిన స్త్రీలు ఉద్యోగాలు చేస్తారు. ఇప్పుడు రాబడి మరిగిన వాళ్ళు ఉద్యోగం చేసితీరాలనే స్థితికి తెచ్చారు ఆడదాని సంపాదన జీవితాంతం అందే కట్నంగా భావించేవాళ్ళు, డబ్బు విలువే గాని ఉద్యోగం విలువ తీసి పారేసేవాళ్ళూ—చాలారకాల మనుషు లీనాడు ఆడదాని వ్యక్తిత్వంమీద దెబ్బ తీయడానికి సిద్ధంగా వున్నారు

మానవ జీవితం దేనివల్ల సుఖంగా సాగుతుంది?

సంతృప్తివల్ల

సినిమాలు లేకుంటే జనం ఏమవుతారు?

ఏమో నాటకాలు, తోలు బొమ్మలాటలు, హరికథలు అభివృద్ధి చెందేవేమో చెప్పలేం (రికార్డు డాన్సుల ముమ్మరం పెరిగినా ఆశ్చర్యం ఉండదు)


ఈ లోకంలో స్వార్థంలేని వ్యక్తి ఎవరు?


ఎవరుంటారు?

**కె ఎస్ ఆర్. — గుంతకల్లు**

భద్రాచలం రామదాసులాగా లంబాడోళ్ళ రామదాసు ఉన్నాడా? అత నెవరు? అతని చరిత్ర ఏమిటి?

నాకు తెలిసినంతవరకూ లంబాడోళ్ళ రామదాసు అంటూ ఏదో ఒక జానపద గేయం ఆధారంగా ఆరుద్ర ఎమ్ ఎల్. ఏ (తిలక్) లో పాట రాశారు తరవాత అది పట్టుకునో ఎలాగో కథలూ నవలలూ వచ్చాయి లంబాడోళ్ళ రామదాసు అంటూ తరవాత ఓ సినిమా వచ్చింది మొత్తాని కంతా కలిసి ఇదో పుక్కిటి పురాణంగానే అన్పిస్తుంది గాని నిజమైన కథ ఏమిటో ఎవరూ గట్టిగా పరిశోధించినట్టు కనబడదు. ★





# ప్రక్కా-ట్రిక్కు

**-మంత్రవాది మహేశ్వర్**

దేశజనాభా అరవై... సుమారు అరవై కోట్లు. దాంట్లోంచి పై తరగతి క్రింది తరగతి జనాభాను తీసిపారేస్తే — (ఎక్కడ పారేస్తాం) పోనీ తీసేస్తే — అబ్బలెక్కెందుకు గానీ అక్కడో తరగతుంది.

—జీతాలు సరిపోని తరగతి

—చిల్లరకొట్లో ఖాతాలు పెంచే తరగతి

—మొహమాటాల తరగతి

—ఇద్దరూ లేక ముగ్గురూ త్రికోణ సూత్రాన్ని తు చ. పాటిస్తున్నా యిబ్బందుల పాలవుతున్న తరగతి.

—అరుంధతీ నక్షత్రం కన్నా 'అప్పు'ను బాగా చూస్తున్న తరగతి.

ఇంక ఆ తరగతి ఏదో తెలిసిపోయే వుంటుంది. మధ్యతరగతి అని వదిలేస్తే నేను ఒప్పుకోను. అది మహాభయంకరమైన తరగతి. దానికి మరో భయంకరమైన పేరెట్టాలి.

పాపం! ఆ తరగతికే చెందుతాడు ఆ శాల్తీ అమ్మానాన్నలు అందంగా ముచ్చటపడి పెట్టిన పేరు ప్రకాశరావు. అదే పేరు పెట్టినందుకు బలమైన కారణాలూ చెప్పారు వాళ్ళు అయితే వాళ్ళ మాత్రం అంత అందమైన పేరును 'ప్రక్కు'గా మార్చి ఖూనీచేసింది ముద్దుకోసమో, తమ అరవయ్యోఏట పిలవడానికి ఓపిక చాలకో.

ఇక అతనేం చేస్తున్నాడన్న ప్రశ్నకి కాఫీ త్రాగుతున్నాడనో, బనీను తొడుక్కుంటున్నాడనో చెబితే ఓల్డ్ జోక్ అవుతుంది... నవ్వరు... సరికదా. తిట్టిపోస్తారు డొక్కు జోకులేమిటాని—. అతగాడు సైన్స్ గ్రాడ్యుయేషన్ కాదు పోస్ట్ గ్రాడ్యుయేషన్ బయోకెమిస్ట్రీ లాంటి దాంతో కుస్తీపట్టి విజయం సాధించేయగానే యూనివర్శిటీ యధావిధిగా పి. జి. ముద్రేసిచ్చింది. అది మడిచి జేబులో పెట్టుకుని తన తాతగారి సెకెండ్‌హాండ్ సైకిల్ మీద యింటికొచ్చేశాడు క్షేమంగా ప్రక్కు.

విన్నో — విన్నెన్నో టెస్టులు వ్రాశాడు. కొన్నింటికి ఇంటర్వ్యూలదాకా వచ్చాడు. తెలిసున్న ముఖాలేవీ ఇంటర్వ్యూబోర్డులో లేకపోవడం చేతో; వాళ్ళడిగిన డబ్బు తన దగ్గర లేకో, మరే కారణంచేతో పెద్ద ఉద్యోగాలు వెక్కిరించుకుంటూ వెళ్ళిపోయాయి నీకు-నాకు కనెక్షన్ కట్టైనట్లు. అయితే పరీక్షలు వ్రాయడంలో కొన్నేళ్ళు ఎక్స్‌పీరియన్స్ గడించేశాక ఓ పెద్దాఫీసులో ఓ చిన్న అకౌంట్స్ క్లర్కుగా జాయినై పోయాడు.

...అలా చేరినవెంటనే, యిలా సంబంధాలొచ్చేశాయి. పెళ్ళి సంబంధాలు

మూడు వేల నుంచి ముప్పై వేలంటూ ప్రక్కు రేటుని నిర్ణయించాయి అయితే కట్నం రేటు పెరుగుతున్న కొద్దీ పిల్లలో లోటుపాట్లు కూడా ఎక్కువవుతున్నట్లు గ్రహించాడు

పెళ్ళి చేసుకోమనే ఫోర్స్ యింట్లో ఎక్కువైంది.


మామ్మగారొకరు కన్నీరు పెట్టడం ప్రారంభించారు 'నే చూస్తానో లేదో' అంటూ —


'సెలక్షన్' నీ యిష్టం అన్నారు.


* * *

పారి బంధువులింట్లో అమ్మాయి

# ఖర్చులు తగ్గించుకొనేందుకు-
# సిఫార్సుప్రకారం ఎరువులను వాడండి








నీటిసాగు వేరుశనగ పంటకు సిఫార్సు ప్రకారం ఎరువులను వాడిన చాలా లాభకరం.

ఏ పంటకైనా ఎరువుల వాడకంద్వారా ఒక క్వింటాలు దిగుబడికయ్యే ఖర్చును తగ్గించవచ్చు. నీటిసాగు వేరుశనగకు సిఫార్సు ప్రకారం ఎరువులను వాడిన ఒక క్వింటాలు వేరుశనగ పండించటానికి అయ్యే ఖర్చు క్రింద సూచించిన విధంగా తగ్గుతుంది.

| నీటిసాగు వేరుశనగ | ఎరువులు వేయకపోతే | సిఫార్సు ప్రకారం ఎరువులు వేసినప్పుడు |
|---|---|---|
| ఎకరానికి సాగుబడి ఖర్చు | రు. 1000/-లు | రు. 1240/-లు |
| ఎకరానికి దిగుబడి | 4 క్వింటాళ్లు | 8 క్వింటాళ్లు |
| క్వింటాలుకు ఖర్చు | రు. 250/-లు | రు. 155/-లు |

పంట ఖర్చులు తగ్గించుకోవాలన్నా, హెచ్చు లాభాలు పొందాలన్నా సిఫార్సు ప్రకారం ఎరువులను వాడాలి. నీటిసాగు వేరుశనగకు అనువైన ఎరువు విజయ్

14-28-14. ఎకరానికి 75 కిలోల విజయ్ 14-28-14ను దుక్కిలో విత్తేటప్పుడు విత్తనానికి 5 సెం.మీ. లోతుగాను, 5 సెం.మీ. ప్రక్కగాను వేయండి.

ఇంకా వివరాలకు ఈ క్రింది చిరునామానుండి ఈ పంటకు సంబంధించిన పుస్తకాన్ని తెప్పించుకోండి.

ఏరియా మేనేజరు
మద్రాసు ఫర్టిలైజర్సు లిమిటెడ్
44, శాంతినగర్
హైదరాబాద్-500 028



## పైర్లసరియైన పోషణకు
# విజయ్

| విజయ్ 14-28-14 ఎరువుల నిర్ణీత పరిమాణముల శాతం | |
|---|---|
| నత్రజని | 14 |
| భాస్వరం | 28 |
| పొటాష్ | 14 |
| నింపుడు పదార్థం (మెత్తటి ఇసుక లేదా డాలమైట్) | 11.5 |

HTM-MFL-2617

పెళ్ళి అని అంటే బయలుదేరాడు అందంగా ప్రక్క

అంతా హడావిడిగా వుంది ..

అటు — యిటూ తిరుగాడిన ప్రక్కా కళ్ళు ఓ చోట ఆగిపోయాయి

— ఆ అమ్మాయికి పద్దెనిమిదేండ్లుండ వచ్చు

ఆడపిల తరఫు వారై వుండొచ్చు.

వచ్చిన వాళ్ళకు ఎవరెవరికి ఏం కావాలో ప్రత్యేకంగా కనుక్కొని మరీ అందిస్తోంది ఆ అందాల పట్టుపరికిణీ.

ఆ అమ్మాయితో ఎలాగైనా మాట్లాడాలి.

'కోరిక' నాలుగడుగులు ముందుకు వేయించింది:

ఆ అమ్మాయి ప్రక్కాని చూసింది ... చూసి ఊరుకుందా? ఊహుం నవ్వింది.

చూసినప్పుడు ఏం అనిపించకపోయినా; చూసి నవ్వేసరికి గుండె రైట్ కెళ్ళేసి వచ్చేసిందో సారి

"పేరేమై యుంటుందబ్బా..." ఆలోచనలో పడ్డాడు

"హలో... మీరు కాఫీ తీసుకుంటారా... కూల్ డ్రింక్ తీసుకుంటారా"

"... ... ..."

"ఏమండీ"

"ఆం" ఉలిక్కిపడ్డాడు.

ఇంతలో లోపల్నుంచి 'జయా ...' అంటూ పిలుపొచ్చింది

'వస్తున్నానమ్మా .. ఇప్పుడేవస్తానండి"

'జయ' ఆహా ఎంత చక్కని పేరు ఎంత చక్కని రూపం. ఎవరూ నన్నింతగా ఆకర్షించ లేదే...' ప్రక్కా హార్ట్ గొడవ చేసింది.

## ప్రక్కా—ట్రిక్కు

"ఏమండీ"

"ఏమండోయ్... ఇదిగో కూల్ డ్రింక్ తీసుకోండి"

"ఆం..."

"ఏమిటి పెళ్ళికొచ్చి తీక్షణంగా ఆలోచిస్తున్నారు ముందు ఈ డ్రింక్ తీసుకోండి"

"ఇందాక కాఫీయా డ్రింకా అని అడిగారు కదూ అప్పుడు నేనేం చెప్పలేదు మరి డ్రింక్ పట్టుకొచ్చేరేం"

"పోన్లెండి కాఫీ పట్టుకొస్తాను"

"ఆహా వద్దులెండి ఊరికే అన్నానుగానీ యిలాయివ్వండి చూడండి .. జయగారూ."

"ఆం జయగారూ... నా పేరు మీకెలా తెలుసు"

'తెలుసుకోవాలి అనుండాలి గానీ తెలుసుకోవడం ఎంతసేపండి"

"సర్లేండిగానీ ఏమిటో అడగబోయారు"

"పెళ్ళికూతురు వనజకి మీరేమవుతారు"

"వనజ మా పెద్దమ్మగారమ్మాయి"

"మీరేవూరి నుంచి వచ్చారు"

"అబ్బ యిక్కడేనండి చిక్కడపల్లిలో వుంటున్నాం మా నాన్నగారికి ఈ మధ్య వైజాగ్ నుంచి ట్రాన్స్ఫరైంది. అంతకు ముందు యిక్కడ మా అన్నయ్య ఒక్కడే వుండేవాడు తనేమో కెనరా బ్యాంకులో పన్జేస్తున్నాడు. నాటకాలంటే మహాపిచ్చి తనకి. మొన్నేదో వైజాగ్‌లో షూటింగ్ అయిందిటగదండి, ఆ సినిమా ప్రొడ్యూసర్ మా అన్నయ్యకి ఛాన్స్ యిస్తానన్నాడట. మా అమ్మకి మా అన్నయ్య ధోరణి అసలు నచ్చదండి పోతే మా యింట్లో నేను ఒకర్తినే ఆడపిల్లను కదండి దాంతో కాలేజీ దూరం అయితే వెళ్ళడం కష్టమనీ కాలేజీ దగ్గరే యిల్లు తీసుకున్నాం యిప్పుడు మా అమ్మకి ఒక్కటే బెంగపట్టుకుంది ... దేనికీ అని అడగరేమండీ"

"ఆం దేనికి"

"మా యింటివాళ్ళు మమ్మల్ని యిల్లు ఖాళీచేయించడానికి ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారు. ప్పు మా వాళు మరో యింటికోసం ప్రయత్నాలు చేస్తున్నారు ఎలాగో ఏమో ... నాకేం భయంలేదండి, దూరమైనా కాలేజికి వెళ్ళగలను . వెళ్ళలేనంటారా.. నే నేమన్నా చిన్న పిల్లనా చెప్పండి బి ఎ చదువుతున్నాను కానీ వాళ్ళే —'

"ఏమీ అనుకోనంటే ఓ విషయం చెప్పనా"

"ఊం చెప్పండి"

"ఎందుకులేండి"

"సందేహించకండి"

"మీ యింటిదగ్గరే మాకో యిల్లు చూడండి లేదా మీరు మా యింటి దగ్గిరికొచ్చేయండి"

"అయితే ఏమిటి"

"ఏముంది ... మీ వాళ్ళకేబెంగాలేకుండా మిమ్మల్ని క్షేమంగా మీ వాళ్ళకి రోజూ నేను అప్పజెప్తాను"

"ఇదో ఉద్యోగమా"

"కాదు.. ఉపకారం"

"ఉపకారానికిపోతే మీ అసలుద్యోగానికి ముప్పొస్తుంది"

# ఇది అసాధ్యం కాదు....

మనకు ఏ కొరత ఉన్నా నిరాశావాదుల లేమి లేదు. నిస్పృహతో మాట్లాడేవారి కరువు లేదు. నిర్మాణాత్మకంకాని విమర్శలో నిమగ్నమయ్యే వారి సంఖ్య అధికం. "విమర్శ మన దేశంలో ఒక పరిశ్రమ" అని చాల సంవత్సరాల క్రిందట జవహర్‌లాల్ అన్నారు. అయ్యో, ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి నిత్య జీవితావసర వస్తువులు అందుబాటులో లేవు. నిరుద్యోగం వికటాట్టహాసం చేస్తున్నది. నిలువ నీడలేదు, దారిద్ర్య రేఖ దిగువన ఉన్నవారి సంఖ్య పెరిగిపోతున్నది. ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. విద్యాసంస్థలలో, వైద్యశాలలలో, రైళ్లలో, బస్సుల్లో నిల్చోడానికైనా స్థలంలేదు.... అంటూ నిరాశా నిస్పృహలతో కుమిలిపోతూ, పొరుగున ఉన్నవారికి సైతం పిరికితనం నూరిపోస్తూ, జీవితాన్ని భయంకరంగా చిత్రించుకునేవారు మన మధ్య అనేకులున్నారు—

ఈ అనేకులలో మీరొకరు కాకండి
జీవితం అందమైనది.
సమస్యలు, సమరం జీవితంలో సహజమే.
"అడ్డంకులన్నిటిని అధిగమించగలం"
అని వివేకానందుడి వాణి మార్మ్రోగింది.
ఈనాటి జీవిత సమస్యలను పరిష్కరించడం,
అధిగమించడం అసాధ్యం కాదు.
సమస్యలను అధిగమించడానికి, నిరాశా నిస్పృహలను
దూరం చేయడానికి
కుటుంబ నియంత్రణ, సంక్షేమవిధానం
సులువైన మార్గం .... .... ....

రాష్ట్ర కుటుంబ సంక్షేమ శాఖ,
సుల్తాన్ బజార్, హైదరాబాద్.

DIPR NO. 28673 / 63 / Advt. 11/81

"అసలుద్యోగమేమిటి. నే నింకా యూనివర్శిటీలో చదువుతూంటే"

"కొట్పకండి ... నా కన్నీ తెలుసు మీ గురించి. మీ పేరు ప్రకాశరావు. మిమ్మల్ని ప్రక్కు అని పిలుస్తారు. మీరు ఎమ్మెస్సీ వరకూ చదివారు. వుంటున్నది మెహిదీ పట్నంలో. అవునా—"

"అరే యివన్నీ మీకెలా తెలుసు"

"తెలుసుకోవాలనుండాలిగానీ తెలుసుకోవడం వింత పనండీ" గలగలా నవ్వేసింది.

"నా మాట నాకే అప్పజెప్పుతున్నారన్న మాట."

"ఆఁ అది సరేగానీ, మీరు వచ్చి యిక్కడే బయటి మనిషిలా కూర్చుండి పోయినందుకు అమ్మ రుసరుసలాడుతోంది లోపలికి కనుక మిమ్మల్ని తీసుకురాకపోతే నాకు చివాట్లే. అవును మావయ్య, అత్తయ్య రాలేదా.. ముందు మీరు రండి బాబు"

* * *

అదీ పెళ్ళికి ముందు వారి పరిచయం.

వారి ధోరణి పెళ్ళయ్యాక, బాధ్యతల్లో నలిగాక వాళ్ళలో చాలా మార్పొచ్చేసింది.

ఆఫీసులో రావు అని పిలవబడే ప్రకాశరావు అదో టైపు మనిషి అనుకుంటూంటుంది జయలక్ష్మి.

సరిపోని జీతం, చికాకు కలిగించే ఆఫీసు వాతావరణం అతనిలో క్రమక్రమంగా కోపాన్ని విసుగుని తీసుకొచ్చాయి అతని ప్రవర్తన చూసే వారికి కక్కుర్తితనంగా తయారైంది.

## ప్రక్కు—ట్రిక్కు

ఆఫీసులో సూర్యారావు అన్న హెడ్ గుమాస్తాకి ట్రాన్స్ఫరైంది దాంతో పార్టీ... ఓ పదిహేను రూపాయలు రావు జేబు ఖాళీ చేసేసి అంతా కలిసిచ్చిన ప్రెజెంటేషన్‌లో దూరిపోయింది

మరుసటి వారంలో బంధువులింట్లో ఎవరిదో పెళ్ళి, ఓ పాతిక చదివించక తప్పలేదు.

డబ్బు యిబ్బందిగా వున్నప్పుడు యిలాంటివి మరీ ఎక్కువవుతుంటాయి

పిలుపులంటే మహా చిరాకనిపిస్తోంది ప్రకాశరావుకి.

కొన్ని కొన్ని మనస్ఫూర్తిగా వెడదామనుకున్న పెళ్ళిళ్ళకి, యితర ఫంక్షన్స్‌కి ఏదో సాకు చెప్పి ఎగ్గొట్టేశాడు. కారణం — మనీ ప్రాబ్లమ్.

పిలుపులుంటే నిజంగా చికాకే... సమస్యే. అది ఒక్క ప్రకాశరావుకే కాదు వెనక ఆస్తిపాస్తులేం లేక కేవలం జీతం రాళ్ళ మీద బ్రతికే అందరికీ— అయితే ప్రకాశరావు ధోరణి కాస్త ప్రత్యేకంగా చెప్పుకోవాలి పిలుపులంటే మంట అన్నవాడు తనూ మరొకరిని పిలవకూడదు. ఏమీ ఆశించకూడదు కానీ తన కూతురు బారసాలనీ, కొడుకు పుట్టినరోజనీ ... చెల్లాయి పెళ్ళని ... అదని యిదనీ యిలాంటివాటికి అందర్నీ పిలిచాడు. రాని వాళ్ళని ఏదైనా యివ్వాల్సొస్తుందని ఎగ్గొట్టారని తిట్టుకున్నాడు. ఏదో నాలుగు ప్రెజెంటేషన్స్ రావా .ఖర్చు కలిసొస్తుందనే తనూ పిలిచాడు అయితే తను మాత్రం చాలా వరకూ తప్పించుకుంటాడు. కానీ కొన్ని తప్పవు

* * *

"ఏమండీ ... యిదిగో కాఫీ" జయలక్ష్మి.

"ఇంతెందుకు యిది రెండు సార్లు త్రాగొచ్చు, నువ్వు త్రాగుదువుగానీ ఓ గ్లాసు పట్టా"

"నాకొద్దు. బాబు అన్నిసార్లు త్రాగలేను. వెధవకాఫీ పూర్తిగా మానేస్తే పీడాపోతుంది. ఒక ఖర్చు తగ్గుతుంది. తీసుకోండి. చల్లారిపోతోంది"

"ఆ మాట ఎన్నేళ్ళ మంచి వింటున్నానో..."

"ఏమండీ"

"ఆఁ ఏమండీ"

"ఈ రికార్డర్ బావుంది కదా"

"ఆఁ"

"చూసి చెప్పండి. నే నేదో కొనేయమని పీక్కుతినేస్తానన్నట్టు బుర్రైనా ఎత్తరేం"

"ఆఁ చూడకేం ... ఆఫీసు నుంచి రాగానే చూశాను చెవులు చిల్లులు చేసే వాల్యూమ్ పెట్టావుగా యింతోటి రికార్డరు బావుంది. 'ఎక్సలెంటు' సర్టిఫికెట్ యిచ్చాను చాలా"

"విశ్వనాధంగారి పాప బర్త్‌డేకి ఆయన బ్రదర్ ఈ రికార్డర్ ప్రెజెంట్ చేశాడట."

"ఏముంది ఈసారి ఆఫీసులో లంచాలు బాగా ముట్టుంటాయి."

"అలా అని ఎందుకనుకోవడం"

"మరి లేకపోతే బర్త్‌డేకి రికార్డర్ ప్రెజెంట్ చేస్తాడా! అదీ ఖర్చులకు తట్టుకో లేని ఈ రోజుల్లో"

"సర్లెండి ... మనసుండాలి గానీ మార్గముండదా? ఎందుకూ మీతమ్ముడూ వున్నాడు. మన చంటాడి బర్త్‌డేకి ఏం తెచ్చాడు? షర్ట్-పాంటు, దళసరిగుడ్డ పట్టుకొచ్చాడు. ఏం చేశాం మనం, దిండుగలేబులు కుట్టించాం. ఛీ ఛీ కక్కుర్తి మనుషులు ... ఏమండోయ్ మర్చేపోయాను. మధ్యాహ్నం పోస్ట్‌లో పత్రికొచ్చింది. అదే చక్రపాణిరావు గారి అబ్బాయి పెళ్ళట రేపు బుధవారం. పాపం కొడుకు పెళ్ళి చూస్తానో లేదో అని తెగ కలవరించిపోయాడు. వెధవ మాయదారి గుండెజబ్బులు కదా."

"ఏమిటి బుధవారమా, ఎలా కుదురుతుంది. ఆఫీసో"

"శలవు పెట్టండి"

"శలవా ... నోనో సెక్షన్‌లో యిప్పటికే యిద్దరు శలవులో వున్నారు."

"మరి ఎలాగండి"

"ఎలాగా ఏముంది, రాలేకపోయాం అని ఓ కవరు — వద్దులే రేటు కూడా పెరిగింది కార్డుముక్క పడేస్తే సరి. వెళ్ళినప్పుడే వెడుతుంది"

"బాగా కావల్సినవాళ్ళు కదా..."

"అవుననుకో...కానీ శలవో..."

"మీరు అసలు ఎందుకు సందేహిస్తున్నారో నాకు తెలుసు. నెలాఖరు ప్రెజెంటేషన్ ఏం పట్టుకెళ్ళాలి అని కదూ ... మరేం కంగారు పడకండి. నే నంతా ఆలోచించాను ... మీకు తెలియకుండా..."

"ఆఁ తెలియకుండా"

"ఇక్కడ మా ఉమెన్స్ క్లబ్‌లో చిట్ కడుతున్నాను ఈ నెలలో నా కొచ్చింది ఆ డబ్బుతో ఏదైనా కొని పట్టుకెడదాంలెండి. ఇంకా ఏమిటి సందేహం."

"అబ్బే ఏమీలేదు"

"ఇంకేం మాట్లాడకండి. మనం వెడుతున్నాం."

* * *

ఓ రోజున ప్రకాశరావు చిన్నప్పటి ఫ్రెండు సాంబశివరావు, ఆయన భార్యా వచ్చి కూతురు రమ పెళ్ళికి తప్పకుండా రమ్మనమనిచెప్పి పత్రికిచ్చారు

"ఏమిటండి అలా డల్‌గా వున్నారు."

"సాంబశివరావు లేడు..."

"ఆఁ మీ చిన్నప్పటి ఫ్రెండు. మొన్నటి దాకా బానే వున్నాడు కదండి పాపం సరదాగా మాట్లాడేవాడు. పెద్ద వయసు కూడా కాదు. ఈ మధ్యే ప్రమోషనొచ్చింది పాపం"

"ఏమిటి మాట్లాడతున్నావు... అయినా ఆయన కూతురు పెళ్ళి. ఆయనకేం కాలేదు"

"చంపేరు కదండి అయినా ఆయన కూతురికి పెళ్ళయితే మీ రాఎక్స్‌ప్రెషనేమిటి?"

"ఏదో ఒకటి ముట్టజెప్పాలి కదా"

"ఏగ్గొడితే సరి"

> **అక్కడే!**
>
> ఆకాశంలో
> రాత్రి మాత్రమే
> కనిపిస్తున్నాయి
> తారకలు ...
> రెండు పూటలా
> అక్కడే
> కనిపిస్తున్నాయి
> ధరవరలు!
>
> — ఎస్ వి ఆర్ సత్యనారాయణమూర్తి

"ఛ ఛ బావుండదు ... ఎంతో కావలసిన వాడు. మన అబ్బాయి బర్త్‌డే కొచ్చినప్పుడు అంతా బిస్కెట్ ప్యాకెట్‌తో వచ్చినవాళ్ళే. ఆయన స్వీట్ ప్యాకెట్‌తో బాటు వంద రూపాయలు చేతిలో పెట్టాడు. డబ్బుకోసం చూసుకున్నట్టుండకూడదు"

"మరి అన్నీ మీరే అంటే ఎలాగ — ఏదీ యిదేనా పత్రిక—ఎల్లుండే"

"అవును."

"ఇక్కడ శ్యాంనగర్‌లోనే! దగ్గరే మనకి. పెళ్ళికొడుకు ఐ. ఏ. ఎస్ అయ్యబాబోయ్... ఎంత కట్నం పోశాడో."

"అలా అనుకుంటారని తెలుసు. ఫర్ యువర్ యిన్‌ఫర్మేషన్ అబ్బాయి మంచి ఆదర్శాలున్నవాడు. పైసా కట్నం కూడా తీసుకోలేదట శివం చెప్పాడు. పెళ్ళి కూడా చాలా సింపుల్‌గా చేయాలన్నాడట. కానీ వీళ్ళే సంతంపట్టి అట్టహాసంగా చేస్తున్నారు"

"సరే అయితే అప్పోసొప్పో చేసి పదండి, తప్పతుందా."

* * *

చదివింపులు చదివిస్తున్నారు.

అంతా హడావిడిగా వుంది

ప్రకాశరావు ఓ చిన్నప్యాకట్, దాంతోబాటు కవరు తీసుకొచ్చి రమ చేతిలో పెట్టాడు

ఓ చిన్న నవ్వు నవ్వి ప్రక్కనున్న పెద్ద పళ్ళెంలో పెట్టేసింది.

అంతా వెళ్ళిపోయాక, పెళ్ళి హడావిడి తగ్గాక వచ్చిన ప్రెజెంటేషన్స్ చూసుకుంటుండగా ఒక కవరు కనిపించింది. అందులో ఓ యాభై రూపాయల గిఫ్ట్ చెక్ వుంది. యిచ్చింది ఎవరో రమణారావట. అలా కొన్ని కవర్లొచ్చాయి ఆ తరువాత మరో కవరు ... అది ప్రకాశరావుది. కాగితం తీసి చదివితే,

చిరంజీవి సౌభాగ్యవతి రమ,

పసుపు కుంకుమలతో పది కాలాలపాటు చల్లగా వుండమ్మా—బ్యాంకుకు వెళ్ళి గిఫ్ట్‌చెక్ తీసుకోవడానికి టైము చాలక ఈ రెండొందల్నీ యిందులో పెడుతున్నాను. వెంటనే నీకు వచ్చిన వస్తువు కొనుక్కో ... డబ్బయితే ఖర్చయిపోతుంది.

ఇట్లు
ప్రకాశరావు.

డబ్బేది ... ?

ఆశ్చర్యంవేసింది ... చూస్తే కవరుకు కొట్టిన పిన్ను ఊడదీసినట్టుగా వుంది.

పెళ్ళి జనంలో ఎవరో కొట్టేసుంటారు.

ఛ అలాంటివారు ఎవరొచ్చారబ్బా ...

అంతా పెద్ద పెద్ద వాళ్ళే...


ఏమో ...

దొంగలు అని ముఖంమీద రాసుండదు కదా ?

ఆ విషయాన్ని వాళ్ళు అక్కడితో మర్చిపోయారు, కాసేపు బాధపడి.

కానీ,

ప్రకాశరావు అందులో ఆ కాగితం తప్ప మరేమీ పెట్టలేదనీ, పిన్‌చేసి తనంతట తనే ఊడదీశాడన్న విషయం వాళ్ళకేం తెలుసు. ప్రకాశరావు వేసిన ఈ ప్రెజెంటేషన్ ట్రిక్కు ప్రకాశరావుని దాటి కనీసం జయలక్ష్మికి కూడా తెలియలేదు. ప్లీజ్! మీరూ ఈ విషయాన్ని రహస్యంగానే వుంచండి.




అవధానుల జగన్నాథరావు

# కట్జీ ఇన్‌స్టాల్‌మెంట్లు

వసంత రాజుని క్రీగంట చూసింది.

ఒదకంగా తననే చూస్తున్న రాజా చూపుల వాడికి వసంత సిగ్గుతో మొగ్గయింది.

"మొత్తానికి ఎంతో శ్రమపడి మీరు వచ్చినందుకు, ... అమ్మాయి అబ్బాయికి నచ్చినందుకు, నా కెంతో సంతోషంగా ఉంది. ఇక ఆ లాంఛనాల విషయం కూడా మాట్లాడేసుకుంటే..." అని అర్ధోక్తిలో ఆగేరు వెంకటరావుగారు.

ఎమ్మే ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యి, స్టేట్ బ్యాంకులో ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆ గుండెల మీద కుంపటిని, ఎలా దింపుకోవాలో తెలియక సతమతమై పోతున్నారు ఆయన, నాలుగేళ్ళుగా. అమ్మాయి కన్నా కాస్తంత ఎక్కువ చదివినవాడు కావాలంటే ఈరోజుల్లో సాధ్యమా?

"దానికేముందండీ! అన్నీ మీకు తెలిసిన విషయాలేకదా? అబ్బాయిని మైసూర్‌లో డొనేషన్ కట్టి యింజనీరింగ్ చదివించడానికి ఎంతవుతుందో మీకు తెలియనిది కాదు. తర్వాత ఫారిన్ వెళ్ళి వచ్చాడు కదా ... అంతే కాకుండా ప్రస్తుతం కోల్ ఇండియా లో మంచి పొజిషన్లో ఉన్నాడు మా వాడు. అన్నీ ఆలోచించి .. మీరే ..." సుబ్బారావుగారు, సావధానంగా కిళ్ళీ నములుతూ శెలవిచ్చారు.

ఎంతో బాగా కంఠోపాఠం వచ్చేసిన తర్వాత, పదో ఎక్కం అప్పజెపుతున్న ఐదో కాసు కుర్రాడి ముఖంలోని కాన్ఫిడెన్స్ ఆయనలో కనబడింది వెంకటరావుగార్కి.

అన్నివిధాలా, అమ్మాయికి తగినసంబంధం, కట్నం రూపేణా చెడిపోడం ఆయనకి ససేమిరా యిష్టం లేదు

ఇవేమీ పట్టించుకోకుండా, వసంతని ఏవేవో ప్రశ్నలు, అభిరుచులు, కళల్లో నైపుణ్యం, ఉద్యోగ విషయాలు ఎడతెరిపి లేకుండా గుస గుసల భాషలో తెగ అడిగేస్తున్నాడు రాజా.

అ, ఆ, ఉ, ఊ లతో ఎంతో అణుకువతో సమాధానాలు చెప్తోంది వసంత. బేంక్‌లో ఆఫీసర్‌గా అందర్నీ దడదడలాడింపే తను ఈ పెళ్ళికొడుకుల ముందు, ఎందుకిలా చిన్నపిల్లలా మారిపోతుందో తనకే అర్థం అవదు.

"అబ్బే! నలభై వేలా ... అసలు కుదరదండీ! వాడిని ఆ రోజుల్లో కాలేజీలో పెట్టడానికే ఇరవై వేలు డొనేషన్ కట్టాల్సి వచ్చింది. కనీసం ఎనభై వేలయినా ఇచ్చుకోలేకపోతే ... మీరు మమ్మల్ని క్షమించాలి..." అన్నారు సుబ్బారావుగారు దృఢంగా.

వెంకటరావుగారు, ఇంకా తాకట్టు పెట్టడానికీ, అమ్మడానికీ వీలుగా ఉన్న అస్తిపాస్తుల్ని లెక్క వేసుకుంటున్నారు.

సుబ్బారావుగారు అప్పటికే ఇరవై వేలు తగ్గించినందుకు తెగ బాధపడి పోతున్నారు.

ఇవేమీ పట్టించుకోకుండా, శివాలయంలో శివుని వాహనంలా హుందాగా కూర్చొని, మాటలు మిగలక పోవడంవల్ల, అంతకు ముందు నోట్లో వేసుకున్న వక్కపొడిని నెమ్మదిగా నెమరు వేస్తున్నట్టు తింటూ కూర్చొన్నాడు రాజా.

"ఎనభై నా శక్తికి మించిన పని.

## మాట్లాడే సైరన్ !

సైరన్లు కాలాన్ని సూచించడానికి ఉపయోగిస్తారు. అత్యవసరసమయాలో ఈ హెచ్చరికలను విపులంగా విన్పించడానికి పశ్చిమ జర్మనీలో మాట్లాడే సైరన్లు తయారు చేస్తున్నారు ఈ రకం సైరన్లు మామూలుగా 'కూత' ఏర్పడటమే కాకుండా అత్యవసర పరిస్థితిని గురించి వివరంగా పకటనలు చేస్తూ హెచ్చరికలు జారీ చేస్తుంది దీనిని జేడిన్ ఉటెన్‌బర్గ్‌లో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నారు.

ఏభైతో సర్దుకొని, మా అమ్మాయిని మీ యింటో పడేసుకొని.. నన్ని బంధాల నుండి విముక్తుడ్ని చేయండి.. " వెంకట్రావుగారు, సుబ్బారావుగారి చేతుల్ని కాళ్ల పట్టుకున్నట్లు పట్టుకున్నారు ప్రాధేయపడుతూ

"క్షమించండి . ఈ విషయంలో ... ఇక తగ్గడం నా వల్ల కాదు..." సుబ్బారావుగారు తన పాట ఒక వేయి కూడా తగ్గించేటట్లు లేరు

అప్పుడే ఫ్లైట్‌లో వచ్చిన రాజా కొంపదీసి, చెవుల్లోని దూది తీయలేదేమో నస అనుమానం వచ్చింది వసంతకి, చిరునవ్వులు చిందిస్తూ కూర్చొన్న రాజాని చూసే సరికి.

వెంకటరావుగారు ఖిన్నుడై తలవంచుకున్నాడు.

"చూడండి...! మా నాన్న మిమ్మల్ని కొనడానికి ... అన్నీ అమ్మేసుకుందుకి సిద్ధమయినా, ఏభై వేలు మాత్రమే కూడేయి. మిగిలిన డబ్బు సమకూర్చడం ఆయనకి తలకి మించిన పని

నేను మీకు నచ్చాను కదా! నాదో చిన్న రిక్వస్ట్ మీ ఫాదర్‌ని కన్విన్స్ చేసి...మిమ్మల్ని ఆయన "ఈజీ ఇన్‌స్టాల్ మెంట్స్"లో అమ్మగలరేమో కనుక్కుంటే..."

వసంత అర్ధోక్తిగా ఆగింది.

అంతవరకూ లేడిపిల్లలా కూర్చున్న వసంతలోని పులిపిల్లని చూసి ... రాజుకి ముచ్చెమటలు పోసాయి.

సుబ్బారావుగారు ఆ మాటల్ని వినేలేదు

వెంకటరావుగారు తల పట్టుకొని కుర్చీలో కూలబడారు. *

# హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

## ఇద్దరు విద్వాంసుల అస్తమయం

అక్టోబర్ మూడవ వారం ఆంధ్ర సాహిత్య లోకానికి పెద్ద కలవరం అయింది ఇద్దరు మహా విద్వాంసులు డాక్టర్ నిడదవోలు వెంకటరావు, శ్రీ సన్నిధానం సూర్య నారాయణ శాస్త్రి అస్తమించడంతో పెద్ద వెలితి ఏర్పడింది. డా. వెంకటరావుగారివయస్సు 80. ఆయన గొప్ప పరిశోధకులు. సూర్యారాయ నిఘంటు కార్యాలయంలోను, మద్రాసు విశ్వ విద్యాలయంలో తెలుగు రీడరుగాను, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎమెరిటస్ ప్రొఫెసర్‌గా పని చేశారు. ఆయన కవి చరిత్ర, ఉదాహరణ వాఙ్మయ చరిత్ర. దక్షిణ దేశీయాంధ్ర వాఙ్మయం గొప్ప పరిశోధన గ్రంథాలు ఆయన పెక్కు ప్రాచీన ప్రబంధాలకు, నవీన గ్రంథాలకు విలువైన పీఠికలు వ్రాశారు. కొన్ని వందల పరిశోధన వ్యాసాలు వ్రాశారు విద్యా రత్న, పరిశోధన పరమేశ్వర బిరుదులు, ఆంధ్ర విశ్వ విద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదు పొందారు ఆంధ్ర సాహిత్య అకాడెమీ బహుమతులు రెండుసార్లు పొందారు. విశిష్ట సభ్యులుగాను వున్నారు ఆయనకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో జ్యేష్ఠ పుత్రుడు శ్రీ శివ సుందరేశ్వరరావు తండ్రితో సమానుడైనవాడు. శ్రీ వెంకటరావు కొత్త నల్లకుంట లోని స్వగృహంలో అక్టోబర్ 15 వ తేదీ రాత్రి కన్నుమూశారు.

శ్రీ సన్నిధానం సూర్య నారాయణ శాస్త్రిగారు గొప్ప ఆలంకారికులు. వైయాకరణులు, విద్వత్కవులు. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి మహిళా కళాశాలలో. సంస్కృతోపన్యాసకులుగా వున్నారు. శతాధిక గ్రంథకర్తలు ఆయన జీరాలో స్వగృహంలో 14 వ తేదీ తెల్లవారు జామున కన్ను మూశారు వయస్సు 85 సంవత్సరాలు. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు ఉన్నారు. శ్రీ శాస్త్రిగారి తత్సమ చంద్రిక, కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్య గొప్ప గ్రంథాలు, బహుళ ప్రచారం పొందాయి. ఆయన తెలుగులోని కళాపూర్ణోదయం మున్నగు కావ్యాలను సంస్కృతీకరించారు ఆంధ్రదేశ హాస్యకథా మున్నగునవి ఆయన కావ్యాలు గోవర్ధన సప్తశతి వంటి వాటి అనువాదాలు బహుళ ప్రచారం పొందాయి. తెలుగునాట ఆయన శిష్య సంతతి అపారంగా ఉంది (శ్రీ శాస్త్రి గారి పరిచయం సంవత్సరం క్రితం హైదరాబాద్ నోట్ బుక్కులో ఇచ్చాను)

**కుమారి వనజాలాల్ నృత్యాంజలి :**

ఎక్సైజు శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీ హరి వదన్‌లాల్ కుమార్తె కుమారి వనజా లాల్ అక్టోబర్ 19 న రవీంద్ర భారతిలో నృత్యాంజలి సమర్పించింది. ఆమె నృపతుంగ జూనియర్ కాలేజీలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నది రాజధానిలోని త్యాగరాయ ప్రభుత్వ సంగీత నాట్య కళాశాలలో శ్రీమతి కె ఉమారావు అంతేవాసినిగా భరత నాట్య డిప్లొమా చదువుతున్నది అందమైన విగ్రహం నట్టువరాండ్రకు అవసరమైన పెద్ద, అందమైన కళ్ళు. మాతృభాష హిందీ అయినా, కూచిపూడి, భరత నాట్యాలలో అభిరుచి గలది ఆమె వర్జ్నిల్లో పద వర్ణం, శివతాండవ స్తుతి, జయహే మహిషాసుర మర్దని, శ్రీరామ పట్టాభిషేక శబ్దం, ఉగ్గు పట్టరే వో యమ్మలార — అన్నమాచార్య కీర్తన, శృంగారించుకొని వెడలిరి — త్యాగరాజు నౌకా చరిత కీర్తన, తిల్లానా చక్కగా అభినయించారు అధ్యక్షత వహించిన న్యాయమూర్తి శ్రీ పి సి రెడ్డి ముఖ్యాతిథి మంత్రి శ్రీ రామకృష్ణంరాజు, శ్రీమతి జమునా రమణారావు పి ఎన్ రావు, ఐ ఎ ఎస్ వి నారాయణరావు కుమారి వనజా లాల్‌ను ఆశీర్వదించారు శ్రీ రామకృష్ణంరాజు తమ ప్రసంగంలో కళ తన కుటుంబంలో కళ ఉందని, ఇప్పుడు తమ శాఖవారు కళాకారులు కావడం వల్ల కళ్ళలోను (ఎక్సైజులో) కళ్ళరు ఉందని గ్రహించానని అన్నారు. రవీంద్ర భారతి డైరెక్టర్ శ్రీ ఎ. ఎస్. మూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



**కుమారి వనజాలాల్**

**తెలుగుదేశంలో శ్రీనివాసులురెడ్డి :**

మాజీ మంత్రి, విధాన సభ సభ్యుడు శ్రీ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి అక్టోబర్ 22 న ఉదయం శ్రీ ఎన్. టి రామారావు అధ్యక్షతన వున్న తెలుగుదేశంలో చేరారు. ఆయన 22 ఉదయం ఎమ్మెల్యే క్వార్టర్సునుంచి వేయిమంది అనుచరులతో పాద యాత్ర చేసి, తెలుగుదేశం కేంద్ర కార్యాలయం చేరి, తెలుగుదేశం సభ్యత్వం స్వీకరించారు. ఆయనతో పాటు నెల్లూరు జిల్లా కోట సమితి అధ్యక్షులు, జిల్లా పరిషత్తు మాజీ చెయిర్మన్ శ్రీ ఎన్ చంద్రశేఖరరెడ్డి, గూడూరు సమితి అధ్యక్షులు శ్రీ వై. శ్రీనివాసులురెడ్డి, నాయుడు పేట సమితి అధ్యక్షులు శ్రీ ఎం వి రాఘవరెడ్డి, కోవూరు సమితి అధ్యక్షులు, గిరిజన యువకుడు శ్రీ మోహన్‌రావు, ఎనిమిది మంది గూడూరు మునిసిపల్ కౌన్సిలర్లు, ముగ్గురు సమితి ఉపాధ్యక్షులు, 300 మంది సర్పంచులు, సహకార సంస్థల అధ్యక్షులు తెలుగుదేశంలో చేరారు. రాబోయే ఎన్నికల కురుక్షేత్రంలో ''రామారావు'' కృష్ణావతారం దాల్చాలనీ, తాను అర్జునుడుగా పోరాటంలో పాల్గొంటానని, రామారావు ముఖ్యమంత్రిగా రామరాజ్యం స్థాపిస్తే, తాను లక్ష్మణుడిగా చేదోడు వాదోడుగా వుంటాననీ శ్రీ శ్రీనివాసులురెడ్డి ఈ సందర్భంలో అన్నారు.

శ్రీ శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంలో చేరడంతో తాను రెండింతలు పెరిగానని, సరైన సలహాలిచ్చే మరొక తమ్ముడు లభించాడని, వారి రాకతో తెలుగుదేశం మరింత బలిష్ఠమైందని, జాతి కుల మత వర్గ భేదాలు లేకుండా తెలుగుదేశం ముందుకు సాగిపోతుందని శ్రీ ఎన్. టి రామారావు శ్రీ శ్రీనివాసులురెడ్డి మున్నగువారికి స్వాగతం చెబుతూ అన్నారు.

## వచనకవితాదీప్తి! కుందుర్తి!

వచన కవితను నిరసించే
భాషాభిషక్కుల నెదుర్కొని.
ఉద్యమ స్ఫూర్తినిచ్చి

వచన కావ్య నిర్మాణం చేశావు.
వచన కవితకు నువ్వుపెట్టిన కోట
తెలుగు భారతికి పగడాల పేట.
తెలుగు సాహిత్యలోకంలో
నీ కవిత నయాగరా

నీ మానస విహాయస వీధిలో
విహరించే కవితా పయోవాహం
కురిపించే 'నగరంలో వాన'లో
తడవని సహృదయుడు లేడు.
నీవు పోయావని తెలిసి
కంట తడిపెట్టని రసహృదయుడు లేడు.

—చాగంరెడ్డి నరసింహారెడ్డి

**మురికి పేటలలో రాజీవ్‌గాంధీ పాదయాత్ర :**

అక్టోబర్ 13, 14, 15 తేదీలలో ఆంధ్ర ప్రదేశ్‌లో పర్యటించడానికి వచ్చిన పార్లమెంట సభ్యులు శ్రీ రాజీవ్ గాంధి 13 వ తేదీన బేగంపేటలో విమానాశ్రయం దిగినవెంటనే నగరంలోని కొన్ని మురికి పేటలలో పాదయాత్ర చేశారు. మాసాబ్‌టాంక్ సమీపంలోని మహాత్మా గాంధి నగర్ మురికిపేటలో ఆయన మొదట పాదయాత్ర చేశారు. ఆయన వెంట ముఖ్యమంత్రి శ్రీ విజయ భాస్కరరెడ్డి, తక్కిన మంత్రులు ఉన్నారు. 15 వ తేదీ రాత్రి శ్రీ రాజీవ్ గాంధి పాత నగరంలోని సెట్విన్ సంస్థను చూచారు. ఆంధ్రప్రదేశ్ పర్యటన తర్వాత ఆయన పత్రికా ప్రతినిధులతో ముచ్చటిస్తూ, ప్రాంతీయపార్టీలవల్ల ఇందిరా కాంగ్రెసుకు ఎలాటి సమస్యా ఉండదని అన్నారు ప్రజలంతా ఇందిరా కాంగ్రెస్ వైపే వున్నారని ఆయన అన్నారు. శ్రీ రాజీవ్ గాంధి మొత్తం 10 జిల్లాల్లో 34 విధాన సభ నియోజక వర్గాలలో పర్యటించారని ముఖ్యమంత్రి శ్రీ విజయ భాస్కరరెడ్డి తెలిపారు. 15 వ తేదీ రాత్రి ఢిల్లీకి వెళ్లారు.

**ఉపశ్రుతి :**

"ఏం కవిగారూ, ఇదే మంచి సమయం. తెలుగు దేశం నాయకులకు ఏదైనా పుస్తకం అంకితం ఇవ్వలేక పోయారా?—" అనడిగాను చనువున్న ఒక కవిని "బలేవారే. అంతమాత్రం నాకు తోచకనా? అక్కడ వారి చుట్టూ సినీ రచయితలే కంచుకోటగా వున్నారు. ఏం చేయను?—"అన్నారు నిస్పృహగా ఆయన.

# అవీ... ఇవీ... అన్నీ...

## 'నెఫ్జా' నాటక కళాపరిషత్తు

నెల్లూరు ఫిలిం జర్నలిస్టు్స అసోసియేషన్ అధ్వర్యాన 1983 ఫిబ్రవరి రెండవ వారములో "నెఫ్జా" నాటక కళాపరిషత్తు పందొమ్మిదవ వార్షికోత్సవం జరుగుతుంది భారీఎత్తున నాటక, నాటిక, ఏక, బహు పాత్రాభినయం పోటీలు రాష్ట్ర స్థాయిలో జరుపబడతాయి ప్రవాసాంధ్రులు సైతం ఈ పోటీలలో పాల్గొనవచ్చును సినిమా దర్శకులు, నటీనటులు ఇతర సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో పోటీలు నిర్వహించబడుతాయి దరఖాస్తులు నవంబరు 27వతేదీలోపల చేరాలి వివరాలకు కార్యదర్శి, నెఫ్జా నాటకకళాపరిషత్తు, అనితాహాల్ దగ్గర, నెల్లూరు—524003కి రాయాలి

## వేదగణితం ( ఇంగ్లీషు )

రచన శ్రీ టి సత్యన్నారాయణరాజా 120 పేజీలు వెల 10 రూపాయలు ప్రతులకు ఉషారాణి పబ్లికేషన్స్, రాయాలం పోస్టు, భీమవరం తాలూకా, ప గో జిల్లా.

## శ్రీ కాళహస్తి మహాత్మ్యము
### ( రంగస్థల నాటకము )

రచన శ్రీ బి ఎల్ ఎన్ ఆచార్య, 108 పేజీలు, వెల 9 రూపాయలు ప్రతులకు రచయిత పేరు 14 శ్రీనివాసరెడ్డి వీధి, త్యాగరాయనగరు, మద్రాసు 17.

## చక్కెర బొమ్మ ( కథల సంపుటి )

రచన శ్రీమతి పోలాప్రగడ రాజ్యలక్ష్మి ప్రముఖ పత్రికల్లో అప్పుడప్పుడు ప్రచురితమయిన కథలు గల ఈ పుస్తకం వెల 10 రూపాయలు 198 పేజీలు ప్రతులకు రచయిత పేర 6, మునిసిపల్ వీధి, బాపట్ల

## భుజం భుజం కలిపి (జనం పాటలు)

రచన శ్రీ ఎస్ కె పిల్లే శ్రమజీవుల బాధలను, గాథలను జానపద బాణీలో వ్రాసిన పాటలు గల పుస్తకం వెల 3 రూపాయలు. 46 పేజీలు. ప్రతులకు రచయిత పేర పోస్టు: పాతగూడూరు, వయా: పెద్దారం, జిల్లా, కరీంనగర్.

## సంఘం మారేదెప్పుడు
### ( విప్లవ ఏకపాత్రాభినయం )

రచన శ్రీ ఉపేదన, 20 పేజీలు వెల రెండున్నర రూపాయలు ప్రతులకు రచయిత పేర, కేర్ ఆఫ్ రైల్వే క్వార్టర్స్, నెం 73 ఎ, మద్దిపాలెం (నార్త్) విశాఖపట్నం—18

## ముత్యాలు నీళ్లోసుకుంది

రచయిత్రులు సత్యవాడ సోదరీమణులు ఆకాశవాణి ద్వారాను, వివిధ మాస వార పత్రికల ద్వారాను వెలువడిన పది కథలు గల ఈ పుస్తకం వెల 4 రూపాయలు, 75 పేజీలు ప్రతులకు రచయిత్రుల పేర సత్యప్రసాద్ బిల్డింగ్స్, వాల్తేరు అప్‌లాండ్స్, విశాఖపట్నం—530003 అన్న చిరునామాకు రాయాలి

## లలిత శస్త్రాల బండారం

ప్రజలలో మూఢ నమ్మకాలను పారద్రోలి చైతన్యాన్ని పెంపొందించాలని లలిత శస్త్రాల బండారాన్ని బయటపెట్టాలన్న దృష్టితో ఈ పుస్తకాన్ని డాక్టర్ విజయం, ఆయన సతీమణి శ్రీమతి సుమతి కలిసి వ్రాశారు 82 పేజీలు గల ఈ పుస్తకం వెల 5 రూపాయలు ప్రతులకు నాస్తిక కేంద్రం, పటమట, విజయవాడ—6

## శ్రీ హనుమదాది స్తోత్ర నవకమ్

రచన జగద్గురు శ్రీ శ్రీ నృసింహానంద భారతీ మహాస్వామిన 64 పేజీలు వెల రు 3 ప్రతులకు 1 ప్రతాప శ్రీరామమూర్తి, రాంభట్లపాలెం, వినయాశ్రమం పోస్టు, వయా చెరకుపల్లె, పల్లపట్ల తాలూకా —522 309 2 అచ్యుతుని నాగేశ్వరరావు, హెడ్ కరణం, ఆరుంబాక పోస్టు, వయా చెరకుపల్లి, పల్లపట్ల తాలూకా, 3 ప్రభు సమీరకుమార్ దేవ్, 17(ఎ) 10 3 155 సరోజినీదేవి రోడ్డు, సికిందరాబాదు—26

## గుండె మంట

పాటలు, రచన శ్రీ క్రాంతికిరన్, 47 పేజీలు వెల 1—50 రూపాయలు. ప్రతులకు మైత్రీ బుక్ హౌస్, లబ్బీపేట విజయవాడ—10

## సృజన కర్త శంఖారావం

రచన శ్రీ దుర్గానంద్ 28 పేజీలు వెల రెండు రూపాయలు ప్రతులకు శ్రీ ఆర్ కె మొగసాటి షణ్ముఖి బిల్డింగ్స్, తణుకు, ప గో జిల్లా

## ప్రముఖులు — హాస్యాలు

ఈ పుస్తకంలో ఆణిముత్యాల్లాంటి ప్రముఖుల మధురమైన చలోక్తులు ఉన్నాయి రచన ఎం డి సౌజన్య, 168 పేజీలు వెల 10 రూపాయలు ప్రతులకు శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్, మ్యూజియం రోడ్, ఏలూరు రోడ్ కార్నర్, గవర్నరుపేట, విజయవాడ—2.




హైదరాబాదు లోని వెంకటరమణ థియేటరులో 'దేశ్‌ప్రేమీ' రజితోత్సవం జరిగింది. థియేటరు యజమాని శ్రీ జె. భాస్కరరావు స్వాగత ప్రసంగం చేశారు.

**Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna.**